
కొత్తపట్నం బస్టాండ్ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు పనుల్లో కార్మికులు

నగరంలో నీటి సమస్య మరింత తీవ్రం

దాహం కేకలు

- రోడ్డెక్కిన కొప్పోలు ప్రజలు
- పదిరోజులుగా నీరు లేక నానా అగచాట్లు
- ఒంగోలులో అస్తవ్యస్తంగా సరఫరా
- శివారు కాలనీల్లో పరిస్థితి దారుణం

నగరంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మంచినీళ్ల కోసం మహిళలు కుస్తీలు పడుతున్నారు. బిందెడు నీటి కోసం ట్యాంకర్ల వద్ద బారులు తీరుతున్నారు. కొన్నిప్రాంతాల్లో వేళాపాళా లేని సరఫరాతో జనం జాగారం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి నీళ్ల కష్టాల్లోకి నెట్టేసింది. ఒంగోలు ప్రజలకు తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారంగా ఉన్న రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీరు అంతంతమాత్రంగానే ఉంది. రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతున్నా కార్పొరేషన్ ఇంజనీరింగ్ వ్యవస్థ నిర్లక్ష్యం వీడటం లేదు. దీంతో నగరంలో జనం నీటి కోసం గగ్గోలు పెడుతూ రోడ్డెక్కుతున్నారు.

ఒంగోలు (కార్పొరేషన్), మే 20: పాలకుల నిర్లక్ష్యంతో ఒంగోలు నగరంలో నీటికి కటకట నెలకొంది. జనం దాహార్తితో అల్లాడుతున్నారు. శివారు ప్రాంతాలకు సరఫరా అంతంతమాత్రంగా మారింది. బిందెడు నీటి కోసం బండెడు కష్టాలను నగరవాసులు అనుభవిస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతోనే సరఫరా అస్తవ్యస్తంగా మారింది. సరైన విధానం లేకపోవడంతో కొన్ని చోట్ల నాలుగైదు రోజులకు ఒకసారి ఇస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం నగర జనాభా 3లక్షలకు చేరింది. కానీ అందుకు తగ్గట్లు తాగునీటి అవసరాలను తీర్చే వనరులు లేవు. దీంతో నగరంలోనే కాకుండా విలీన గ్రామాల్లోనూ దాహం కేకలు వినిపిస్తున్నాయి. మునిసిపాలిటీ ఏర్పడిన నాటి పైపులైన్లతోనే అధికారులు కాలం వెల్లబుచ్చుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు వందల సంఖ్యలో దర్శనమిచ్చే లీకులతో సగం నీరు రోడ్లపాలవుతోంది. అయినా నగర పాలక ఇంజనీరింగ్ వ్యవస్థలో స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తాగునీటి కోసం కొప్పోలు గ్రామ ప్రజలు రోడ్డెక్కారు. పది రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహించారు. ఖాళీబిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు.

కొత్త చేతిపంపుల ఏర్పాటు ఊసే కరువు

నగరంలో చేతిపంపులు పనిచేయడం లేదు. ప్రతి వార్డులో పదుల సంఖ్యలోనే ఉండగా వాటి నిర్వహణ కోసం ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆయన పర్యవేక్షణలో మరో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే నిత్యం బోర్లు (చేతిపంపులు) మరమ్మతులతో బిజీగా ఉన్నట్లు నటిస్తున్న యంత్రాంగం పట్టుమని బిందెడు నీళ్లు కూడా వాటి ద్వారా ఇవ్వలేకపోతోంది. ఒంగోలులోనే దాదాపు 850 చేతిపంపులు కార్పొరేషన్ రికార్డుల్లో ఉండగా, వాటి మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు కోసం ఏటా బడ్జెట్‌లో రూ.10లక్షలు మంజూరవుతున్నాయి. కానీ అవి ఏమవుతున్నాయని అడిగితే చెప్పడం కష్టమేనని ఇంజనీరింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు.

నగరంలో అస్తవ్యస్తంగా సరఫరా

నగరంలో కొద్ది రోజుల నుంచి తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గతంలో రెండు రోజులకోసారి నీరు అందిస్తుండగా, ఇటీవల కాలంలో మూడురోజుల కొకసారి సరఫరా చేస్తున్నారు. మోటార్లు పాడయ్యాయని, కరెంటు పోయిందని, పైపులైను లీకులు వచ్చాయని ఏదో ఒక కారణం చూపుతూ తాగునీటి సరఫరా వేళలను మార్చి వేశారు. సరఫరాలో జాప్యంపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోతుండటంతో ప్రజలకు రోజంతా ఎదురుచూపులు తప్పడం లేదు. కొన్నిసార్లు నాలుగు రోజులకు, పనులు పూర్తికాకపోతే ఐదురోజులకు ఇస్తుండటం గమనార్హం.

శివారు కాలనీల్లో వేధిస్తున్న సమస్య

నగరంలోని 50 శివారు కాలనీల్లో నీటి సమస్య వేధిస్తోంది. ఆ కాలనీలకు సరైన పైపులైన్ లేదు. ప్రత్యేకించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఉన్న ప్రాంతాల్లోనే తాగునీటి పైపులైన్లు అటుఇటు మార్పుచేశారే తప్ప శివారు కాలనీలను పట్టించుకోలేదు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ప్రైవేటు ట్యాంకర్లు ఆధారమయ్యాయి. అయితే రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు. ముందే వచ్చిన వేసవితో తాగునీటి అవసరాలు పెరిగాయి. దీంతో కాలనీల్లో నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతున్నారు.

ట్యాంకర్లతో సరఫరా ఇష్టారాజ్యం

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్‌లో హోదాకు తగ్గట్లు నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. దీంతో 35 ప్రైవేటు ట్యాంకర్లే ఏళ్లతరబడి తాగునీటిని సరఫరా చేస్తున్నాయి. కార్పొరేషన్‌లో ఉన్న శివారు ప్రాంతాలకు, పది విలీన గ్రామాలకు ఆ ట్యాంకర్లతోనే రోజుకు రెండువందల ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో అటు శివారు కాలనీలు, ఇటు విలీన ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.


నీటి కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న కొప్పోలు ప్రజలు

కొప్పోలు ప్రజల నిరసన

పది రోజులుగా తాగునీరు రాకపోవడంతో సోమవారం నగర పరిధిలోని కొప్పోలు ప్రజలు రోడ్డెక్కారు. ఒంగోలు-కొత్తపట్నం రహదారిపై ఖాళీబిందెలతో బైటాయించి రెండు గంటలపాటు నిరసన తెలిపారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిరోజులుగా నీరు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులను అడిగితే రెండు మూడు రోజులకొకసారి ట్యాంకర్లు పంపుతారని, అది కూడా పలుకుబడి ఉన్నవారికేనని వాపోయారు. సాధారణ ప్రజల గోడు మాత్రం పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు కొప్పోలు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. కొత్త పైపులైను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో జనం ఆందోళన విరమించారు.



కొండెక్కిన కూరగాయలు

- బీన్స్ కిలో రూ.140
- పచ్చిమిర్చి కిలో రూ.100
- అన్నిరకాల ధరలు పెరుగుదల
- సామాన్యుడు కొనడం కష్టమే

ఒంగోలు (కలెక్టరేట్), మే 20 : కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒంగోలులో ఏ రోజుకా రోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్లతో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. మార్కెట్‌లో కిలో బీన్స్ రూ.150 పలుకుతుండగా, పచ్చిమిర్చి కిలో రూ.100 ఉంది. పెద్ద చిక్కుళ్లు కిలో రూ.100, క్యారెట్ కిలో రూ.80 పలుకుతోంది. దొండ కిలో రూ.60, బంగాళా దుంప, చామదుంప, బెండ, గోరు చిక్కుళ్లు, క్యాబేజీ ధర కిలో రూ.50కి చేరింది. టమాటా ధర రూ.30 నుంచి రూ.35 పలుకుతుండగా రిటైల్‌గా కిలో రూ.40నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు.


కొండల మధ్య నుంచి నెమలిగుండంలోకి జాలువారుతున్న నీరు

- ఇప్పటికే జిల్లాలో వర్షాలు
- తగ్గిన ఎండల తీవ్రత
- పలుప్రాంతాల్లో జలకళ
- పశ్చిమ ప్రాంతానికి ఊరట
- సాగుకు భరోసా
- దుక్కులు దున్నకానికి సిద్ధమవుతున్న రైతులు

సకాలంలో రుతుపవనాలు

ఒంగోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సకాలంలో అది కూడా సాధారణం కన్నా కాస్తంత అధికంగానే కురిసే అవకాశం కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్తంత ముందుగానే రావడం, ఇప్పటికే జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురవడం రైతుల్లో ఆశలు కల్పిస్తున్నాయి. వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి రుతుపవనాలు ముందుగానే అండమాన్ తీరాన్ని తాకగా జూన్ 1 నాటికి కేరళలోకి, తొలివారంలో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. దీనికితోడు మరో రెండు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఆతర్వాత తుఫాన్‌గా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ద్రోణి ప్రభావం ఉండటంతో జిల్లాలో గత వారంరోజులుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. అత్యధిక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. పశ్చిమాన మండు వేసవిలోనూ జలకళ కనిపిస్తోంది. భైరవకోన జలపాతం నీటితో కనువిందు చేస్తుండగా గుండ్లకమ్మలోకి ప్రవాహం వస్తోంది. తాజా వర్షాలతో గిద్దలూరు నియోజకవర్గంలోని నెమలిగుండ్లలోకి కూడా నీరు చేరుతోంది. తూర్పు, పశ్చిమ తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ వాగులు, వంకలు, కుంటల్లోకి నీరు చేరి వేసవి వేళ పశువులు, ఇతరత్రా జీవాలకు ఊరట లభించింది.

చల్లబడిన వాతావరణం

వారంక్రితం వరకు తీవ్ర ఎండలతో మండిపోయిన జిల్లా ప్రజలకు తాజా వాతావరణ పరిస్థితి కొంతమేర ఊరట కలిగిస్తోంది. వారం క్రితం వరకు పశ్చిమాన 43 నుంచి 46 డిగ్రీలు, తూర్పుప్రాంతంలో 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ప్రస్తుతం ఎక్కడా 40 డిగ్రీలు కూడా లేదు. కొద్దిచోట్ల 37 నుంచి 39 డిగ్రీలు ఉంటుండగా అధిక ప్రాంతాల్లో మిట్టమధ్యాహ్నం కూడా 35 నుంచి 37 డిగ్రీలలోపుగానే నమోదవుతున్నాయి. అలా ఉష్ణోగ్రతలు తగ్గడం, పలుచోట్ల ఒక మోస్తరు వర్షాలు పడుతుండటం, వచ్చేనెల రెండో వారంలోపు రుతుపవనాలు వచ్చి వర్షాలు సాధారణంగా పడే అవకాశం వంటి సంకేతాలతో ఈ ఏడాది సాగుపై భరోసా కలుగుతోంది. దీంతో రైతులు దున్నకాలకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 25 నుంచి రోహిణి కార్తె రానుండటంతో నెలాఖరులో మరోసారి ఎండలు పెరిగే అవకాశం ఉంది. అయితే వాతావరణ మార్పుతో జల్లులు పడి ఆ తీవ్రత అంతగా ఉండకపోవచ్చని సమాచారం.


ఒంగోలులో సోమవారం సాయంత్రం దట్టంగా కమ్ముకున్న మేఘాలు

వెలుగులోకి వైసీపీ అక్రమాలు

- బహిర్గతమవుతున్న అధికారుల పక్షపాత ధోరణి
- ఓటుకు డబ్బులు తీసుకొని సస్పెన్షన్‌కు గురైన ఎస్ఐ
- విస్తుపోతున్న ప్రజలు



1 వివరాలు మెయిన్‌లో..


కనిగిరిలో మాక్ డ్రిల్ సందర్భంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పోలీస్.. అలర్ట్!

- ప్రజల్లో అవగాహనకు మాక్‌డ్రిల్
- ముఖ్యమైన ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- రాత్రుళ్లు పలుప్రాంతాల్లో పల్లెనిద్ర

ఒంగోలు (క్రైం), మే 20 : జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల అనంతరం, కౌంటింగ్ తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎస్పీ గరుడ్ సుమిత్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే శాఖలోని కిందిస్థాయి పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న విధంగా మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు.

పోలీసు అధికారుల పల్లెనిద్ర

పోలీసు అధికారులు ప్రతిరోజూ ఒక గ్రామంలో నిద్రపోయే విధంగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలను ఎంచుకొని రాత్రుళ్లు బస చేస్తున్నారు. అక్కడ పరిస్థితులను తెలుసుకోవడంతోపాటు గ్రామాల్లోని ప్రజలకు శాంతిభద్రతల విషయంలో భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆలోచింపజేస్తున్న మాక్‌డ్రిల్

పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించడంతోపాటు అసాంఘిక శక్తుల భరతం పడతామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదివారం ఒంగోలులో, సోమవారం కనిగిరిలో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించారు. అల్లర్లు సృష్టిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. వాటర్ క్యానన్‌ల ద్వారా అల్లరి మూకలను అణిచివేయడం, టియర్ గ్యాస్ వదలి గుంపులను చెదరగొట్టడం, అవసరమైతే కాల్పులు ఎలా జరుపుతారన్నది ప్రజలకు చూపిస్తున్నారు.

కార్డన్ సెర్చ్

అసాంఘిక శక్తులను అరికట్టడానికి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. సింగరాయకొండ, ఒంగోలు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, పొదిలి, త్రిపురాంతకం, పీసీపల్లి, సీఎస్‌పురం, మర్రిపూడి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, కొమరోలు, పుల్లలచెరువు తదితర ప్రాంతాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. పాత నేరస్థుల కదలికల గురించి ఆరా తీశారు. పేలుడు పదార్థాలు ఏమైనా నిల్వ ఉంచారా అనే కోణంలో పరిశీలించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తిరుగుతున్న 193 బైకులు, ఒక ఆటోను సీజ్ చేశారు.


పొదిలిలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ప్రైవేటు వైద్యశాలల ఎన్‌వోసీలపై దృష్టి

- ఉన్నతాధికారుల ఆదేశాలతో కదిలిన వైద్యశాఖ అధికారులు
- డీఎంహెచ్‌వో నేతృత్వంలో ప్రోగ్రాం అధికారుల పరిశీలన

ఒంగోలు (కలెక్టరేట్), మే 20 : జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలకు అగ్నిమాపక శాఖ అనుమతులపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఎన్‌వోసీలు ఉన్నాయా? లేవా? అన్నది పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు కదిలారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ప్రైవేటు వైద్యశాలలు అధికంగా ఉండే ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, పొదిలి, దర్శి, గిద్దలూరు, కంభం, చీమకుర్తితోపాటు మండల కేంద్రాల్లో ఉండే ఆసుపత్రులపై కూడా దృష్టి సారించారు. రెండు రోజుల నుంచి ఆయా వైద్యశాలలను తనిఖీ చేసి ఎన్‌వోసీలను పరిశీలిస్తున్నారు. దీంతోపాటు వైద్యశాలల్లో అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకున్నారా? లేదా? అన్నది కూడా చూస్తున్నారు. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. అనంతరం అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీలు తీసుకోని ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

ప్రకాశం స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి చర్యలు


కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మే 20 : టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ స్ఫూర్తి తో జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాట యోధునిగా, ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రిగా పాలనలో ప్రకాశం పంతులు తన దైన ముద్ర వేశారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని వివిధ రంగాల్లో ఉన్నత స్థానానికి చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం పంతులు మునిమనమడు సంతోష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..


ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణ, వీరభద్రాచారి

నాగులుప్పలపాడు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని ప్రకాశం గ్రామాభ్యుదయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ భైరపునేని సూర్యనారాయణ నేతృత్వంలో ప్రకాశం పంతులు జన్మించిన వినోదరాయునిపాలెంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఉన్నం చంద్రరావు, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల సమక్షంలో జిల్లాకు వచ్చిన సర్వీసు ఓట్లను పరిశీలిస్తున్న ఝాన్సీలక్ష్మి

కలెక్టరేట్‌కు సర్వీసు ఓటర్ల బ్యాలెట్లు

ఒంగోలు(కలెక్టరేట్), మే 20 : వివిధ ప్రాంతాల్లో పనిచేసే కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు ఓటర్ల బ్యాలెట్‌లు జిల్లాకు వచ్చాయి. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కే ఝాన్సీలక్ష్మి నేతృత్వంలో సోమవారం రాజకీయ పార్టీలసమక్షంలో వాటిని పోస్టల్ బ్యాలెట్‌లో వేశారు. వివిధ ప్రాంతాల్లో పనిచేసే వారికి సర్వీసు ఓట్ల కింద బ్యాలెట్ పత్రాలను పంపారు. సర్వీసు ఓటర్లు తమ ప్రాంతాల్లోనే ఓట్లు వేసి తిరిగి తపాలా శాఖ ద్వారా ఒంగోలుకు పంపారు. ఇప్పటివరకు వచ్చిన సర్వీసు ఓట్లను రాజకీయపార్టీల ఆధ్వర్యంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విభజించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల్లో వేసి సీల్ వేశారు. జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉండగా సోమవారానికి సుమారు వెయ్యి ఓట్లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రాజకీయపార్టీల ప్రతినిధులు డీఎస్ క్రాంతికుమార్, రసూల్, బి.రాజశేఖర్, కాలేషా బేగ్, రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, దేవిరెడ్డి రామాంజనేయులు, శ్రీకాంత్, మణి, రాంబాబు, సూర్య తదితరులు ఉన్నారు.



ఎన్‌సీసీ శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఎన్‌సీసీ శిక్షణకు క్విస్ విద్యార్థులు

ఒంగోలు(విద్య), మే 20 : స్థానిక కర్నూలురోడ్డులోని క్విస్ హైస్కూలు విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అందులో భాగంగా ఆంధ్రా బెటాలియన్ 34వ ఎన్‌సీసీ గ్రూపులో 15 మంది విద్యార్థులు శిక్షణ పొందేందుకు అర్హత సాధించారు. స్థానిక ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో వీరికి శిక్షణ ఇస్తారు. సోమవారం నుంచి ఈనెల 29 వరకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు 15 మంది విద్యార్థులు సోమవారం శిబిరానికి చేరుకున్నారు. ఎన్‌సీసీ శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులను క్విస్ హైస్కూలు చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, డీన్ ఎస్. కామేశ్వరి, ఏవో సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.


వృద్ధురాలి కుమారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వృద్ధురాలి హత్యకేసు

విచారణలో పురోగతి

కొత్తపట్నం,మే 20: ఈనెల 18వతేదీ అర్ధరాత్రి కొత్తపట్నంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసు విచారణలో పోలీసులు పురోగతి సాధించినట్లు విశ్వసనీయ సమాచారం. హత్య జరిగిన రెండు రోజులకే పోలీసులు నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. కొత్తపట్నంలోని ఈతముక్కల రోడ్డులో నివాసం ఉండే గుడిపల్లి నాగేశ్వరమ్మ అర్ధరాత్రి హత్యకు గురయ్యింది. కల్లు విక్రయిస్తూ జీవనసం సాగిస్తున్న నాగేశ్వరమ్మను ఆమె చేతులకు ఉన్న నాలుగు రోల్డు గోల్డు గాజుల కోసమే హత్య చేసినట్లు పోలీసులు భావించి ఆ దిశగా విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ శ్రీధరరావు, డీఎస్పీ కిషోర్‌బాబు, ఇతర పోలీసు అధికారులు కొత్తపట్నం వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు విచారణను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను కూడా పిలిపించారు. కొత్తపట్నంలోని పలు సీసీకెమెరాల ఫుటేజ్‌ను కూడా పరిశీలించారు. కొత్తపట్నంలో నాగేశ్వరమ్మ వద్దకు తరచుగా కల్లు తాగే అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ హత్యకు పాల్పడి ఉంటాడని తొలుత పోలీసులు అనుమానించారు. కానీ పోలీసులు లోతుగా విచారణ చేపట్టి హత్యకు పాల్పడిన వారిని గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుల వి వరాలను పోలీసులు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

24 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కట్టుదిట్టంగా నిర్వహించాలి

పరీక్షల సహాయకమిషనర్ శివకుమార్

ఒంగోలు(విద్య), మే 20 : జిల్లాలో ఈనెల 24నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే శివకుమార్ కోరారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 3,871 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలుతో పాటు పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అత్యవసర సమయంలో వైద్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షల సమయంలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సమావేశంలో మార్కాపురం ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర రావు, డీసీఈబీ కార్యదర్శి వై. వెంకట్రావు, సంతనూతలపాడు ఎంఈవో డి. వెంకారెడ్డి తదితరులు ఉన్నారు.

22 పరీక్షా కేంద్రాలు

పది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలులో మూడు, సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, సింగరాయకొండ, కనిగిరి, పెద దోర్నాల, కంభంలో ఒక్కొక్కటి, తాళ్ళూరు, దర్శి, వైపాలెం, గిద్దలూరు, మార్కాపురం, పొదిలిలో రెండేసి పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

పరీక్షల షెడ్యూల్ ఇదీ

పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 3వతేదీ వరకు జరుగుతాయి. 24న తెలుగు, కాంపోజిట్ కోర్సు, 25న ద్వితీయ బాష హిందీ, 27న ఇంగ్లీషు, 28న గణితం, 29న ఫిజికల్‌సైన్స్, 30న బయాలాజికల్ సైన్స్, 31న సోషల్ స్టడీస్, జూన్ 1న కాంపోజిట్ కోర్సు పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1, జూన్ 3న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపరు-2 పరీక్ష జరగనుంది.

పోలీసుల కార్డన్ సెర్చ్

పలు వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

నాగులుప్పలపాడు, మే 20 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఎస్సైలు పోలీసు సిబ్బంది సోమవారం తెల్లవారుజాము నుంచి నాగులుప్పలపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలు, ముస్లిం కాలనీలలో నివాస గృహాలలో క్షుణ్ణంగా తనిఖీలు (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, మారణాయుధాల నిల్వల పైనా తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సైలు బ్రహ్మానాయుడు, మహేష్, దేవకుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీలో

పత్రాలు లేని 16 బైక్‌లు సీజ్

సింగరాయకొండ, మే 20 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధి వెంకటేశ్వర కాలనీలో సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటినీ పోలీసులు సోదా చేశారు. పత్రాలులేని 16 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం పలు ప్రాంతాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు నిర్వహించామని తెలిపారు. ఇళ్లలో నాటు బాంబులు, మరణాయుధాలు ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఘర్షణలకు దిగితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగరాయకొండ, టంగుటూరు ఎస్సైలు టి.శ్రీరామ్, పున్నయ్య, సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సింగరాయకొండ : సీజ్ చేసిన బైక్‌లతో సీఐ రంగనాథ్, ఎస్సైలు శ్రీరామ్, పున్నయ్య, సిబ్బంది

పెడదోవపడుతున్న యువత

- పట్టణంలో పెరుగుతున్న నేరప్రవృత్తి
- యథేచ్ఛగా గంజాయి అమ్మకాలు
- ఆన్‌లైన్ జూదాలతో అతలాకుతలం



మార్కాపురం, మే 20 : మార్కాపురం పట్టణంలో వందల సంఖ్యలో యువత ప్రస్తుతం గంజాయికి అలవాటుపడింది. ఇక్కడ అక్కడ అని కాకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గంజాయి సేవించే యువకులు ఎక్కువయ్యారు. గతంలో రైల్వే స్టేషన్ల సమీపంలో కొద్దిమంది వృద్ధులు మాత్రమే గంజాయి తాగేవాళ్లు. యువత గంజాయికి అలవాటుపడటానికి ప్రధాన కారణం మద్యం ధరలు ఆకాశాన్నంటడమే. మద్యం సేవించే వాళ్లు సరిపడినంత డబ్బులులేక గంజాయి వైపు మరలుతున్నారు. ఒక్కసారి గంజాయి సేవిస్తే దాని ప్రభావం ఒక రోజంతా ఉంటుండటంతో దానికి యువత బానిసలుగా మారుతున్నారు. పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలోని ఎస్టీలు అధికంగా ఉండే ప్రాంతం లో గంజాయి లభిస్తున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ముగ్గురు గంజాయి అమ్మేవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. అదే ప్రాంతంలో గతంలో ఒక మహిళ ఇంట్లోనే గంజాయి చెట్టు పెంచినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దాడిచేసి గంజాయి చెట్టును పెంచే వాళ్లను విచారించి యువతకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించుకుని కేసు నమోదుచేసి జైలు పంపారు. అప్పట్లో కొన్నాళ్ల పాటు గంజాయి అమ్మకాలు ఆగాయి. లాభసాటి వ్యాపారం కావడంతో మళ్లీ ఉధృతం గా అమ్మకాలు సాగిస్తున్నారు. జులాయిగా తిరిగే వాళ్లే కాక ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకునే వాళ్లు కూడా ఈ వ్యసనానికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

- పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ సమీపంలో ఈ మధ్య రెండు వర్గాలు తీవ్రంగా ఘర్షణపడ్డాయి. పూటుగా మద్యం సేవించిన యువకులు మాటామాటా పెరిగి రెండువర్గాలుగా విడిపోయి సీసాలతో కొట్టుకు న్నారు. అడ్డువెళ్లిన వారిని కూడా రక్తగాయాలయ్యేలా కొట్టినట్లు సమాచారం.
- స్థానిక పెద్దనాగులవరం వెళ్లే దారిలో కొచ్చెర్లకోట కాలువ సమీపంలో యువత పెద్ద సంఖ్యలో చేరి నిత్యం గంజాయి సేవిస్తునట్లు సమాచారం. మత్తులో తూగి అటుగా వెళ్లే వారిపై దాడులు చేయడం రివాజుగా మా రింది. బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్తే కొన్ని రోజుల పాటు ఆగి మళ్లీ ఆ ప్రాంతంలో గంజాయి తాగి అరాచకాలు చేయడం షరా మామూలే. మూడేళ్ల క్రితం గంజాయి తాగే యువతతో విసిగివేసారిన స్థానికులు అందరూ కలిసి వారిపై తిరగబడడంతో ఓ యువకుడు కూడా మృతి చెందాడు. కొన్నాళ్లు పరిస్థితి బాగానేవున్నా సంవత్సర కాలంగా మళ్లీ యువకులు మత్తులో జోగుతున్నారు.
- స్థానిక తర్లుపాడు రోడ్డులోని పెద్దట్యాంకు సమీపం లో రాత్రి 9 గంటలు దాటితే అటుగా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. పదుల సంఖ్యలో యువకులు ట్యాంకు కిందకు చేరి యథేచ్ఛగా మద్యం, గంజాయి సేవిస్తుంటారు. అంతేకాక ఆ మత్తులో రోడ్ల పై వెళ్లేవారిపై పలుమార్లు దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. అక్కడ కొందరు యువకులైతే ప్రధా న రహదారిపై బైకురేసు నిర్వహించడం అలవాటుగా మారింది. ఇంతా జరిగేది మార్కాపురం డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో కావడం విశేషం.
- స్థానిక కళాశాల రోడ్డులోని ఓ బార్‌లో పది రోజుల క్రితం పూటుగా మద్యం సేవించిన యువకులు హంగా మా చేసినట్లు సమాచారం. అర్ధరాత్రి దాటినా మద్యం అందించాల్సిందే అని అక్కడ పనిచేసే సిబ్బందిపై గొడవ పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో సీసాలు పగులకొట్టి రోడ్డుపైనే నానా యాగీ చేసినట్లు స్థానికుల సమాచారం.
- పట్టణ నడిబొడ్డున టీటీడీ కళ్యాణ మండపం ఎదురు సందులో చీకటిపడితేచాలు పదుల సంఖ్యలో యువకులు గుమిగూడుతారు. అక్కడ పాడుబడిన ఓ గృహంలో కూర్చుని గుట్టుగా గంజాయి సేవించడం అలవాటుగా చేసుకున్నారు. ఈ క్రమంలో సంవత్సరం క్రితం యువకుల మధ్య గొడవ జరిగింది. మత్తులో ఉన్న యువకులు రోడ్డుపైకి వచ్చి కర్రలతో ఇష్టారీతిన కొట్టుకున్నారు. భయభ్రాంతులకు గురైన చుట్టుపక్కల వాళ్లు పరుగులు తీశారు. పోలీసులు అక్కడకు వెళ్లి ఇద్దరిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.
- రెండు నెలల క్రితం ఓ యువకుడు ఆకస్మాత్తుగా మరణించాడు. చిన్న వయసులోనే బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు మృతి కారణంపై ఆరా తీశారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లో రెండు లక్షల వరకు పోగొట్టుకున్నట్లు తెలుసుకున్నారు. అప్పు చేసిన వారికి చెల్లించలేక మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి చనిపోయినట్లు తెలిసింది.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఇంకా బయటకు రాని ఘటనలు ఎన్నో నిత్యం చోటుచేసుకుంటున్నాయి. మద్యం, గంజాయి సేవనం, బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బులు పోగొట్టుకొని చివరికి నేర ప్రవృత్తివైపు మరలుతున్నారు. నియంత్రించాల్సిన పోలీసు, సెబ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతే కాక తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం కూడా యువత చెడుమార్గం పట్టేందుకు దోహదపడుతోంది.

ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు బెట్టింగులు

గతంలో వరల్డ్‌కప్‌లు, ఐపీఎల్ సీజన్‌లో మాత్రమే కొద్దిమొత్తంలో బెట్టింగులు నడిచేవి. కానీ నేడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చేసరికి సంవత్సరం పొడవునా బెట్టింగులు నడుస్తున్నాయి. కావాల్సినన్ని యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. చివరికి ఎన్నికల ఫలితాలపై కూడా ఆన్‌లైన్‌లో బెట్టింగులు నడుస్తుండటం విశేషం. పట్టణంలో రమారమి రోజుకు 10 లక్షలకుపైగానే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం. ఎలాంటి పోలీసుల దాడులు లేకపోవడం, చేతిలో సెల్‌ఫోన్ ఉంటే ఎక్కడి నుంచైనా బెట్టింగులు పెట్టుకొనే వెసలుబాటు ఉండటంతో యథేచ్ఛగా ఈ ప్రక్రియ సాగుతోంది. ప్రధానంగా యువత బెట్టింగులలో లక్షలు పోగొట్టుకుని చివరికి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

మూతపడిన దారం తయారీ కేంద్రాలు

ఉపాధి కోల్పోయిన మహిళలు

బేస్తవారపేట, మే 20 : జిల్లాలో రోజురోజుకు పట్టు సాగు తగ్గిపోతుంది. నాలుగేళ్ల క్రితం పరిశీలిస్తే మార్కాపురం డివిజన్‌లో సూమారు 2వేల ఎకరాల్లో పట్టు రైతులు మల్బరీ పంటను సాగు చేసేవారు. కొవిడ్ ప్రభావం అనంతరం ఎగుమతులు లేవు. స్థానికంగా మార్కెట్‌లో విక్రయించినా, రైతులకు సరైన ధరలు లభించడం లేదు. దీంతో ప్రస్తుతం ఆ పంట సాగుకు రైతులు ముఖం చాటేశారు. దీంతో పట్టు పరిశ్రమ నుంచి దారం తీసే రీలింగ్ పరిశ్రమలు మూతపడ్డాయి.మూడేళ్ల బేస్తవారపేట మండలంలో ఈ పట్టు పంట నుంచి దారం తయారు చేసే రీలింగ్ యూనిట్లు మూడు ఉండేవి. వీటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 70 శాతం రాయితీతో ఈ యూనిట్ల ను మంజూరు చేశాయి. దీంతో వందల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించడంతో పలువురికి జీవనోపాధి లభించింది. ఏడాది పాటు పట్టు నుంచి దారం తయారు చేశారు. పట్టు సాగు తగ్గడం, కిలో ముడి పట్టు రూ.300 నుంచి రూ.800 వరకు పెరగడంతో సోమవారపేట, బేస్తవారపేట, చెట్టిచెర్లలో ఉన్న మూడు కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో పలువురు మహిళలు ఉపాధి కోల్పోయారు.ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పట్టు పరిశ్రమను ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.


సోమవారపేటలో మూతపడిన రిలింగ్ యూనిట్

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మద్దిపాడు, మే 20: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండలంలో విద్యుత్ సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నాయని, వాటిని పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. సమావేశంలో సీతారామపురం సర్పంచి మండవ శివానందరావు మాట్లాడుతూ గ్రామాల్లో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయన్నారు.

రాచవారిపాలెం సర్పంచి నాగమల్లేశ్వరి కూడా విద్యుత్ సమస్యపై సమావేశంలో గళమెత్తారు. దీనిపై విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

అవీ..ఇవీ..

కొండపి కేంద్రంలో కిలో పొగాకు రూ.310


టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

కొండపి, మే 20 : కొండపి వేలం కేంద్రంలో మేలురకం పొగాకు అత్యధిక ధర కిలో రూ.310 పలికింది. సోమవారం ఎన్.ఎన్. కండ్రిగ, పెట్లూరు, వర్ధినేని వారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 908 బేళ్ల వేలానికి తీసుకువచ్చారు. వాటిలో 850 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు.

టంగుటూరులో కిలో రూ.306

టంగుటూరు : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.306 లభించింది. సోమవారం కె.ఉప్పలపాడు రైతులకు చెందిన 395 బేళ్లను అనుమతించారు. ఇందులో 384 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 11 బేళ్లను తిరస్కరించారు. 17 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై పున్నారావు

టంగుటూరు, మే 20 : గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను ఎస్సై పున్నారావు కోరారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయన వివిధ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు నమోదయ్యే కేసులు చాలా సీరియస్‌గా ఉంటాయని, విద్యార్థుల భవిష్యత్‌కు కూడా ఆటంకంగా మారతాయని ఆయన హెచ్చరించారు.

సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామి

పొన్నలూరు (కొండపి), మే 20: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెన్నిపాడు సమీపంలోని సంగమేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల సాధకుడు కొల్లి


కొల్లి నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు, మహిళలు

కొండపి, మే 20 : రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి సాగునీటి ప్రాజెక్టులు సాధించిన యోధుడు కొల్లి నాగేశ్వరరావు అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. సోమవారం కొండపిలో నాగేశ్వరరావు నాల్గో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వీరారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఉద్యమాలు నిర్వహించి, రైతుల తరఫున పోరాటాలు సాగించి కొల్లి విజయం సాధించా రన్నారు. పేదలకు భూములు పంపిణీ చేయించారని తెలిపా రు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మి, నాయకులు చంద్రయ్య, మాల కొండయ్య, సాయి, సుబ్బా రావు, అరుణ, శేషమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రారంభమైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

నాగులుప్పలపాడు, మే 20: ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 26 వరకు సాగనున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 25 న స్వామి వారి కల్యాణం, రథోత్సవం, అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవ స్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ పెంట్యాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మద్దిసాని నాగేశ్వరరావు, కాలనీ పెద్దలు

నాగులుప్పలపాడు, మే 20 : ఉప్పుగుండూరు గ్రామంలో స్థానిక విద్యానగర్ ఆధ్వర్యంలో జేవైఎస్& రాజేష్ ఫ్రెండ్స్ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, విద్యానగర్ కాలనీ పెద్దలు పోటీలను ప్రారంభించారు. తొలిరోజు రాకింగ్ స్టార్స్ వేటపాలెం, సీ కింగ్స్ ఉప్పుగుండూరు, జై భీమ్ లెవెన్స్ ఇనమన మెళ్ళూరు, పుచ్చం ఫ్రెండ్స్ చిన్నగంజాం, పరమేశ్వరరెడ్డి యూత్ చిన్నగంజాం, సుమన్ ఫ్రెండ్స్ చీరాల జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 40,000, రెండవ బహుమతిగా రూ. 30,000, మూడవ బహుమతిగా రూ. 20,000, నాలగవ బహుమతిగా రూ. 10,000 అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీసీఎంఎస్ పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(విద్య), మే 20 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) అధికార పర్సన్ ఇన్‌చార్జీగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీసీఎంఎస్‌లో జరిగిన భారీ కుంభకోణం, నిధుల స్వాహాను అరికట్టడంలో పాలక వర్గం విఫలంకావడంతో ప్రభుత్వం పాలకవర్గాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. పాలకవర్గాన్ని రద్దు చేసిన ప్రభుత్వం జేసీని పీఐసీగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన జూలై 19వరకు లేదా సొసైటీకి ఎన్నికలు నిర్వహించి నూతన పాలక వర్గం ఎన్నికయ్యేంత వరకు లేదా ప్రభుత్వం జారీ చేసే తదుపరి ఉత్తర్వుల వరకు కొనసాగుతారు.

డీఈడీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు(విద్య), మే 20 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ) 2022-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ సెమిస్టర్ చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె .శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. పరీక్షలు జూన్‌లో జరుగుతాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెండు కార్లు ఢీ - ముగ్గురికి గాయాలు

ఒంగోలు(క్రైం), మే 20: ఎదురెదురుగా వెళుతున్న రెండు కార్లు ఢీకొని ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. దీంతో ఒంగోలువైపు వెళుతున్న కారు బోల్తాపడింది. కారు నడుపుతున్న డ్రైవర్ రమేష్ మరో ఇరువురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. 108 సహకారంతో వారిని చికిత్స నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై వెంకటరావు పరిశీలించారు.

నెమలిగుండానికి నీరు

గిద్దలూరు, మే 20 : నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నీరు రంగనాయకస్వామి క్షేత్రంలోని రంగస్వామిగుండంలోకి చేరుతోంది. అడవిలోని కొండల నుంచి నీరు గుండంలోకి దారగా ఉబికి పడుతుండడంతో ఆ దృశ్యాలను చూసేందుకు ప్రకృతి ప్రియులు, భక్తులు రంగస్వామి క్షేత్రానికి పోటెత్తారు. కాగా నల్లమల అటవీ ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో అడవిలో ఉన్న జంతువులు, పక్షులు వేసవి గాలుల నుంచి రక్షణ పొందడమే కాకుండా సంవృద్ధిగా తాగునీరు లభించడంతో ఉపశమనం పొందాయి.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), మే 20 : మండలంలోని కోవిలంపాడు పంచాయతి మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండి ఆదాయాన్ని కమిటీ సభ్యులు లెక్కించారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,07,800, అడ్డా ప్రసాదం అమ్మకం ద్వారా రూ, 29,450, శాశ్వత అన్న దానానికి విరాళాలుగా రూ.86,182, మహాప్రాకార నిర్మాణానికి రూ.75 వేలు విరాళాలు వచ్చాయి. మహాప్రాకార నిర్మాణానికి వెలిగండ్ల మండలం వెదళ్ళచెరువు గ్రామానికి చెందిన నారాయణ, శ్రీదేవి దంపతులు రూ.75 వేలు, శాశ్వత అన్నదాన పథకానికి పామూరు మండలం తిరగళదిన్నె గ్రామానికి చెందిన ఒంటేరు నాగార్జున గంగమ్మ దంపతులు రూ. 25,116 విరాళం అందజేశారు.

సత్తా చాటిన బల్లికురవ ఎడ్లజత



బండ లాగుతున్న ఎడ్లు

సీఎస్‌పురం(పామూరు), మే 20: సీఎస్‌పురం మండలం రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థాన తిరునాళ్ల సందర్భంగా ఐదు జిల్లాల స్థాయిలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో బల్లికురవకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 1589 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 50 వేలు నగదును కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత 1551.3 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.40 వేలు, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.30 వేలు పొందాయి. అలాగే, పావూలూరి వీరస్వామిచౌదరికి చెందిన ఎడ్లజత 1023అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు, నంద్యాల జిల్లా బేతంచర్ల గ్రామానికి చెందిన మేకల వెంట్రాయుడు ఎడ్లజత 927 అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. ముందుగా ఈ పోటీలను అంబాల చినవెంకటరెడ్డి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో బహుమతుల దాతలు నారా పెద్దాసిద్ధారెడ్డి, చిన సిద్ధారెడ్డి, బాల సిద్ధారెడ్డి, సిద్ధారెడ్డి, దేవస్థాన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు

తాళ్లూరు, మే 20 : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని కొర్రపాటివారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోటశేషయ్య తన గేదెలను తీసుకుని పొలంలో మేపకానికి వెళ్లాడు. సాయంత్రం వేళ వీచిన గాలులకు పొలంలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలు మేత మేస్తున్న రెండు గేదెలకు తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిని అదిలించబోయిన గేదెల యజమాని శేషయ్య గాలికి వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి చేతికి, కాలికి స్వల్ప గాయాలయి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతి చెందిన రెండు గేదెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుంది. పొలంలో విద్యుత్తు తీగలు వదులుగా ఉండి, ప్రమాదాలు జరిగే అవకాశంఉందని విద్యుత్తుశాఖ అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శి స్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగి గేదెలు మృతి చెందాయని విమర్శిస్తున్నారు.

శ్రీ భీమలింగేశ్వరస్వామి వార్షికోత్సవాలు

23 వరకూ ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

పంగులూరు, మే 20 : మండల కేంద్రమైన పంగులూరులో గల ప్రసిద్ధ శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 వరకు జరుగనున్నాయి. ఈ వేడుకలు 20వ తేదీ సాయంత్రం నుంచి ప్రారంభంకాగా, వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా ఆలయంలోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ స్థాపన, మృత్సంగ్రహణ, అంకురారోపణ, వాస్తు పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. 21 మంగళవారం ఉదయం 7 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, సాయంత్రం 6 గంటల నుండి ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, రాయబారం, స్వామివారి దివ్య కల్యాణోత్సవం జరుగనున్నాయి.

రేపు పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం

శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా 22వ తేదీ పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 22వ తేదీన ఉదయం 6 గంటలకు నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటల నుంచి శ్రీ అవధూతేంద్ర భక్త మండలి వారిచే ఏకాహ కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు బలిహరణ కార్యక్రమాలు జరుగనున్నాయి. అనంతరం శ్రీదాత భారతీయ జానపద కళా క్షేత్రం అద్దంకి వారిచే కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి బలిహరణ, వసంత సేవ త్రిశూల స్నానం, పూర్ణాహుతి కార్యక్రమం జరుగనుండగా సాయంత్రం 7 గంటలకు ధ్వజారోహణ, మౌనబలి, ఏకాంత సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాలను బ్రహ్మశ్రీ శైవాగమ వేద పండితులు పేటేటి ఉదయభాస్కరశర్మ నిర్వహించనున్నట్లు తెలిపారు.

23న అన్నదానం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 23వ తేదీ 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా చోరీపై కేసు

వుల్లాయిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని వుల్లాయిపాలెం ఓ బూత్‌లో సీసీ కెమెరా చోరీకి గురైంది. సచివాలయ మహిళ పోలీస్ ధనలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాలపై పరిశీలన



ఇసుక తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

అద్దంకి, మే 20 : ఇసుక అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఇరువైపులా జరిగిన ఇసుక తవ్వకాలను, మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో జరిగిన ఇసుక తవ్వకాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మహబూబ్ సుభాని ఉన్నారు.

ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జిందాల్

మేదరమెట్ల, మే 20 : ఇసుకను అక్రమంగా తవ్వడం, తరలించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసులను కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. సోమవారం అనమనమూరు వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్, మైనింగ్ ఏడీ రాజేష్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో డ్రెడ్జింగ్ చేసి నిల్వ చేసిన ఇసుక కుప్పలను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఎక్కడెక్కడ తవ్వకాలు జరిగాయని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ ముంపులో రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు నిబంధనలు మేరకు ఇసుక తవ్వకాలు జరపలేదని విషయాన్ని ఆయన గుర్తించారు. తమ్మవరం వద్ద ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రిజర్వాయర్ నుంచి నీరు అందించే కాలువను పూడ్చి రోడ్డు నిర్మించడంపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలో రీచ్ లేని చోట ఎక్కడైన ఇసుక అక్రమ తవ్వకాలు జరపకుండా పోలీసులతో కలిపి టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అద్దంకి, కొరిశపాడు తహసీల్దార్‌లను ఆ యన ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో లోపలకు వెళ్లి డ్రెడ్జింగ్ చేసిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, బాపట్ల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, రేణంగివరం ఎస్ఐ తిరుపతిరావు, కొరిశపాడు తహసీల్దార్ సుశీల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మారిన ఎఫ్ఐఆర్ కాపీ

హాస్పిటల్‌లో బాధితురాలి ఆవేదన

వాస్తవం తెలుసుకుని తిరిగి వెళ్లిన వైనం



రోదిస్తున్న శైలజ

చీరాలటౌన్, మే 20 : దాడిలో గాయపడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ మారిందని వివాహిత చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద కొద్దిసేపు ఆవేదన చెందారు.వివరాల్లోకి వెళితే కొత్తపట్నంకు చెందిన సలిశం శైలజకు ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన అంజనేయులుతో సుమారు 13 ఏళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. భర్త అమాయకుడు కావడంతో ఈమె కుట్టు మిషన్ కుడుతోంది. అయితే అత్త పద్మావతి, మామ సూర్యనారాయణ పదేపదే గొడవలు పెట్టుకుంటున్నారు. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. ఈ క్రమంలో గత మంగళవారం శైలజపై కుట్టు మిషన్ పరికరంతో తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. అప్పుడు శైలజ తలకు తీవ్ర రక్త గాయమైంది. దీంతో స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేసిన వైద్యుల ఆమెకు రక్తం తక్కువగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించి నాలుగు రోజులు చికిత్స అందించారు. ఇదిలావుండగా చీరాల ఏరియా హాస్పిటల్‌లో చేరిన సమయంలో అక్కడి అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఒంగోలు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఇంకొల్లు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కాపీ మారిందని, నీపైనే కేసు నమోదు అయినట్లు స్థానికులు చెప్పారు. దీంతో అవగాహన లేని శైలజ చీరాల ఏరియా హాస్పిటల్ వద్దకు బంధువులతో చేరి రోదించింది. కానీ అవుట్‌పోస్ట్ పోలీసులు ఇంకొల్లు పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకోగా శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకే అత్త, మామలపై కేసు నమోదైంది. దీంతో వాస్తవం తెలుసుకున్న ఆమె అక్కడి నుంచి విరమించింది.

రోడ్డు ప్రమాదం.. ఆ కుటుంబాలకు శాపం!



దేవాంగనగర్ వద్ద రోడ్డు మలుపు కనిపించకుండా మార్జిన్‌లోకి వచ్చిన నిర్మాణాలు, చెట్లు

» ప్రమాద, వేగ సూచికలు లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం

కనిగిరి, మే 20: కనిగిరి పట్టణ సమీపంలోని దేవాంగ నగర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాలను రోడ్డు పాలు చేసింది. విధి వక్రించి కారు రూపంలో కుటుంబ పోషకులైన బత్తుల విష్ణునారాయణ, కస్తూరిలను పొట్టన పెట్టుకుంది. కారు ఆటోను ఢీకొట్టిన ఘటనలో మరో ఇద్దరిలో ఒకరు ఆటోడ్రైవర్ రామకృష్ణ ఒంగోలు కిమ్స్‌లో కోమాలో ఉండ గా, మరో మహిళ గురవమ్మ పరిస్థితి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. దీంతో ఆనాలుగు కుటుంబా లకు చెందిన కుటుంబసభ్యులు ఆగమ్యగోచరంలో కొట్టు మిట్టాడుతున్నారు.

పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన కస్తూరి, గురవమ్మలను రామకృష్ణ తన ఆటోలో కనిగిరి పట్టణం లోని శంఖవరం వద్దకు ఆదివారం తెల్లవారుజామున నా లుగు గంటలకు కుటుంబ పనుల నిమిత్తం వచ్చాడు. తిరిగి పని ముగించుకుని తెల్లవారుజామును ఐదు గం టలకు కాశిరెడ్డికాలనీ వెళ్ళేందుకు తిరుగు ముఖంపట్టా రు. బత్తుల విష్ణునారాయణ కూడా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కనిగిరి పట్టణంలోకి టీ తాగేందుకు వచ్చి ఇంటికి వెళ్ళేందుకు రామకృష్ణ నడుపు తున్న ఆటో ఎక్కి వారితో పాటు కాశిరెడ్డి కాలనీకి బయలుదేరారు. ఈక్రమంలో దేవాంగనగర్ వద్ద ఎదురుగా అ తివేగంగా వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈప్రమా దంలో విష్ణునారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మ రో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలుకు తరలించగా కస్తూరి మృతిచెందింది. మరో ఇద్దరు ఐసీ యూలో ఉన్నారు.

విష్ణునారాయణే కుటుంబానికి ఆదరువు

విష్ణునారాయణ చేనేత కుటుంబానికి చెందిన వాడు. చేనేతలో చేయి తిరిగిన నేతన్న. సరైన ఉపాధి లేక కుల వృత్తిని వీడి గత ఐదేళ్ళుగా ఆటో నడుపుకుంటున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉండగా కుమా ర్తెకు వివాహం చేశాడు. కుమారుడు మానసిక దివ్యాంగుడు. తన తండ్రి చనిపోయాడని కూడా తెలుసుకోలేని స్థితిలో ఆ కుమారుడి పరిస్థితి. విష్ణునారాయణ భార్య ఓ పక్క భర్త చనిపోయాడని, ఏ ఆదరణ లేని తన బిడ్డకు పెద్ద దిక్కు ఎవరూ అంటూ గుండెలవిసేలా రోదిస్తుంది. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయిన ఆకు టుంబం దిక్కుతోచని స్థితిలో నడిరోడ్డుపాలైంది.

కస్తూరి రెక్కాడితేనే ఆ ఇద్దరి చిన్నారుల డొక్క నిండేది..

కస్తూరి వయస్సు 25ఏళ్ళు, ఆమెకు ఆరేళ్ళ కొడుకు బాలు, నాలుగేళ్ళ కొడుకు రఘు ఉన్నారు. భర్త తాగుడికి బానిసై కుటుంబాన్ని పోషించకుండా ఉంటే కస్తూరి కొత్తూరు వద్ద ఓ హోటల్‌లో పని చేస్తూ రోజువారీ రూ.300 కూలీకి పనిచేస్తూ బిడ్డలను పోషించుకుంటుంది. రోడ్డు ప్రమాదంలో తన రెండు కాళ్ళు కోల్పోయి ఒంగోలులో చి కిత్స పొందుతూ తనువు చాలించింది. ఇప్పుడు ఆ ఇద్దరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. తల్లి ఇక ఇంటికి సజీవంగా తిరిగి రాదని తెలియని ఆ చిన్నారులు తన తల్లి హోటల్‌కు వెళ్ళింది తమకు తినేందుకు తెస్తుంది అంటూ తల్లికోసం ఇంటి ముందు దీనంగా కూర్చొని ఎదురుచూస్తున్నారు.

హోటల్‌లో పనిచేస్తేనే రోజు గడిచేది..

గురవమ్మ భర్త 20ఏళ్ళ క్రితమే గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో తన రెక్కల కష్టంతో హోటల్ పనిచేస్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. చేతికందిచ్చిన కుమారులిద్దరూ హైద్రాబాద్‌లో బేల్దారి పనులు చేస్తూ ఇటీవలే ఇంటికి వచ్చారు. ఏనాడు ఆమెకు చేదోడుగా కుమారులు నిలబడలేదు. గురవమ్మ తన తలరాతను నిందించుకుంటూ, హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. రోడ్డు ప్రమాదంలో గురవమ్మ ఛాతి చీల్చుకు పోయి ప్రాణాపాయ స్థితిలో ఒంగోలు రిమ్స్ ఐసీయూలో ఉంది. ఇప్పుడు కుమారులు దిక్కులేని వారయ్యారు.

ఆటోను నడుపుకుంటూ..

రామకృష్ణ తండ్రి కనిగిరి పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద టాయిలెట్స్‌లో పనిచేసేవాడు. ప్రమాదవశాత్తు ఐదేళ్ళ క్రితం ఓ రోజు జారీ ఆ టాయిలెట్స్‌లో జారీ పడటంతో తన రెండు కాళ్ళు పనిచేయక చేతి ఊతంతో జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు రామకృష్ణకు కు టుంబాన్ని పోషించే బాధ్యత ఏర్పడింది. వృద్ధ తల్లిదం డ్రులకు అతడే జీవనాధారం. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావటంతో ఆచేతనా స్థితిలో ఒంగోలు కిమ్స్‌లో కోమాలో ఉన్నాడు. కోమాలో ఉన్న కుమారుడి పరిస్థితిని తలచుకుని వృద్ధ తల్లిదండ్రులు రోదిస్తుండటం చూపురులను కలచివేస్తుంది.

ప్రమాద సూచికలు లేక...

పేరుకు జాతీయ రహదారి 565. నిర్మాణం జరిగే దశాబ్దకాలం దాటింది. పనులు పూర్తిగా జరగకపోవటంతో కనిగిరి పెద్దచెరువు వద్దకు వచ్చి ఆగి.. కనిగిరి కొత్తూరు వద్ద నుంచి మళ్ళీ నిర్మాణం జరిగింది. అసం పూర్తిగా ఉండటంతో హైవేకు ఏర్పాటుకావాల్సిన విధి విధానాలు ఏవి జరగలేదు. హైవే ఊళ్లోకి ప్రవేశించా లంటే ఊరికి 3కి.మీ. ముందు నుంచి రోడ్డు ఇరువైపులా ప్రమాద, వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్డుకు సెంటర్ డివైడర్‌లు ఉండి మధ్యన విద్యుత్ స్తంభాలతో లైట్లు ఉండాలి. ఊర్లోకి ప్రవేశించే వరకూ రోడ్డు మార్జిన్‌ను తెలిసేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను, రోడ్డు మార్జిన్ ఆక్రమణలు ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇవేమి ఈ హైవే రోడ్డులో పాటించలేదు. దీంతో రోడ్డు మలుపుల వద్ద అతివేగంగా వస్తూ నియంత్రించలేక వాహనాలు ప్రమాదాలకు మవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రానైట్ ముడిరాయి లారీల పట్టివేత

బల్లికురవ, మే 20 : పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు గ్రానైట్ ముడిరాయి లారీలను సోమవారం గుంటూరు విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు పట్టుకొన్నారు. బల్లికురవ గ్రానైట్ క్వారీల నుంచి మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న ముడిరాయి లారీలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వెంటనే లారీలపై కేసు నమోదు చేసి వెంటనే బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఆదివారం రాత్రి కిడ్నాప్ అయిన బాలుడు ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచాయతీ ఆంధ్రకేసరినగర్‌కు చెందిన మూకిరి నయోమి స్టూవర్టుపురానికి చెందిన వ్యాపారి వద్ద కొంత నగదు బాకీ తీసుకుంది. తిరిగి చెల్లించే క్రమంలో ఆలస్యం కావడంతో వ్యాపారి ఆమె మనవడు పాల్సన్‌ను మరో ఇద్దరి సహకారంతో కిడ్నాప్ చేశారు. అయితే విషయం తెలుసుకున్న ఈపూరుపాలెం పోలీసులు రంగంలోకి దిగారు. తమదైన శైలిలో వ్యాపారితో ఫోన్‌లో మాట్లాడగా సోమవారం మధ్యాహ్నానికి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

నాడు-నేడు పెండింగ్ పనులపై సమీక్ష

మార్టూరు, మే 20 : నాడు - నేడు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం నాలుగు మండలాల సీఆర్‌పీలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా ప్రతినిధి ఏఎల్‌ఎస్‌వో సాగర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు, ఇసుకకొరత, స్కూళ్లల్లో సివిల్ పనులు తదితర అంశాలపై ఆయన సీఆర్‌పీలతో చర్చించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి, సంత మాగులూరు మండలాలకు చెందిన సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మత్స్యకారుడు దుర్మరణం

రామాపురం(చీరాలటౌన్), మే 20 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి మత్స్యకారుడు దుర్మరణం చెందాడు. ఈసంఘటన సోమవారం రాత్రి వాడరేవు - రామాపురం రోడ్డులో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం ఊటుకూరి సబ్బయ్య పాలెంకు చెందిన ఊటుకూరి బాలాజీ (55) మత్స్యకారుడు. ఇతను ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ వాహనం అదుపుతప్పి బోల్తా పడి మృతి చెందారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బంగారు నగల పర్సు చోరీ

ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన

అద్దంకి, మే 20 : ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికురాలి వద్ద బంగారం వస్తువులు ఉన్న పర్సు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన చల్లా భాను ఓటు వేసేందుకు వచ్చి సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు అద్దంకి బస్టాండ్‌కు వచ్చారు. ఉదయం 10-30 గంటలకు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కిన తరువాత సంచి పరిశీలించగా బంగారు నగలు ఉన్న పర్సు కనిపించలేదు. సుమారు రూ.1.40 లక్షల విలువైన నగలు చోరీకి గురైనట్లు ప్రయాణికురాలు భాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి

చీరాలటౌన్, మే 20 : వ్యక్తిగత వివాదాలతో వృద్ధురాలిపై పలువురు తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన సోమవారం ఇంకొల్లు పరిధిలోని ఇందిర కాలనీలో చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాల ప్రకా రం కాలనీకు చెందిన 62 సంవత్సరాల పాలపర్తి రాణి ప్రమీళకు అదే ప్రాంతానికి చెందిన జేమ్స్, చంద్, మోజెస్ ఇరుగు పొరుగులు కావడంతో కొంతకాలంగా వ్యక్తిగత వివాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉదయం సుమారు ఏడుగంటల సమయంలో ఇంట్లోకి చొరబడి తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలి కుడిచేయి విరిగిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

హోమియో వైద్యం అందేదెప్పుడో..!

దొనకొండలో భవనం నిర్మించారు.. వైద్యశాల ఏర్పాటును మరిచారు

- వృథా అయిన ప్రజాధనం
- వైద్యుడులేక అలంకారప్రాయంగా మారిన వైనం



దొనకొండలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న హోమియో వైద్యశాల భవనం

దొనకొండ, మే 20: దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన హోమియో వైద్యశాల నిరుపయోగంగా మారింది. గత పదేళ్లుగా హోమియో వైద్యాధికారి లేక వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పదేళ్ళ క్రితం ఆరోగ్యకేంద్రంలోనే హోమియో వైద్యశాలను ఒక గదిలో ఏర్పాటుచేసి డాక్టర్ కోట్ల వెస్లీ వైద్యుడిగా నియమితులయ్యారు. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి ఇంగ్లీషు మందుల వాడకం పట్ల నమ్మకం లేని ఎందరో సుదూర ప్రాంతాలకు చెందిన రోగులు సహితం ఇక్కడికి వచ్చేవారు. డాక్టర్ వెస్లీ హోమియో వైద్యం పట్ల మొగ్గు చూపుతూ ప్రతి రోజు అధికసంఖ్యలో ఓపీ నమోదు జరుగుతుండేది. డాక్టర్ వెస్లీ ఇక్కడి నుంచి వెళ్లినతర్వాత హోమియో వైద్యం అందకుండా పోయింది. ఆయన వెళ్లిన తర్వాత అధికారులు లక్షల వ్యయంతో దొనకొండలో ప్రభుత్వ వైద్యశాల పక్కన హోమియో వైద్యశాల భవనం నిర్మించారేగాని నేటికి వైద్యుడి నియామకం జరపలేదు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన హోమియో వైద్యశాలలో ప్రస్తుతం నాడీపట్టే నాథుడేలేడు.

హోమియో వైద్యం పట్ల అపారనమ్మకంతో దీర్ఘకాలిక వ్యాధులకు సహితం ఉపశమనం పొందిన ఎందరో రోగులు నేటికీ ఎర్రగొండపాలెంలో నివాసం ఉంటున్న హోమియో వైద్యుడు డాక్టర్ వెస్లీ వద్దకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. తరచూ మండల ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఇంగ్లీషు మందులు గిట్టనివారు హోమియో వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో హోమియో వైద్యశాలకు వైద్యుడు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిర్లక్ష్యవైఖరి విడనాడి దొనకొండలోని హోమియో వైద్యశాలకు డాక్టర్, సిబ్బంది నియామకం చేపట్టి ఈప్రాంత ప్రజలకు మెరుగైన హోమియో వైద్యసేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్ని అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేదు

- షేక్ రసూల్‌బాషా, దొనకొండ



దొనకొండలో నిరుపయోగంగా ఉన్న హోమియో వైద్యశాలకు డాక్టర్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చి విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదు. డాక్టర్ వెస్లీ ఉన్న సమయంలో రోజుకు దాదాపు వంద వరకు ఓపీలు వచ్చేవి. ఎందరో దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం పొందారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే హోమియో వైద్యశాల నిరుపయోగంగా మిగిలింది. అధికారులు, పాలకులు పట్టించుకొని హోమియో వైద్యశాల ఏర్పాటు చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రభుత్వ వైద్యం ఎండమావేనా?

- మార్కాపురం సర్వజన ఆసుపత్రిలో రోగుల ఇక్కట్లు
- ఓపీ నమోదుకు ఎండలో క్యూ
- వసతులు కల్పించని ప్రభుత్వం
- ప్రతి సోమవారం 600 మంది వరకు ..
- మందులు, రక్తపరీక్షల కోసం తప్పని సుదీర్ఘ నిరీక్షణ


ఓపీ నమోదుకు వినియోగిస్తున్న ఏకైక కంప్యూటర్

మార్కాపురం, మే 20: మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పేదలకు వైద్యం ఎండమావిగా మారింది. ప్రభుత్వ వైద్యశాలలో రోగులు తమకున్న రోగాలకు చికిత్స కోసం ఎదురుచూడటం సర్వసాధారణం. కానీ మార్కాపురం వైద్యశాలలో తమ పేరు నమోదు చేయించకోవడమే ప్రహసంగా మారుతోంది. మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలను వైద్య కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలగా మార్చారు. తదనుగుణంగా వైద్యులను నియమించారు. దీంతో వివిధ విభాగాలలో నిష్ణాతులైన వైద్యులు విధుల్లో చేరారు. అప్పటి నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. అయితే అందుకనుగుణంగా రోగులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వ విఫలమైంది.

ఓపీ నమోదుకు ఎండలో క్యూ

మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవడానికి వచ్చేవారికి ఆదిలోనే కష్టాలు ప్రారంభమౌతాయి. ఆసుపత్రికి వచ్చిన రోగికి ఓపీ నమోదు తప్పనిసరి. ఇప్పటి వరకూ కేవలం పుస్తకాలలో రోగుల పేర్లు నమోదు చేసేవారు. కానీ ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రతి రోగి పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిబంధన పెట్టింది. అందుకు అనుగుణంగా కంప్యూటర్‌ను ఏర్పాటు చేసినా, డేటా ఎంట్రీ ఆపరేటర్ ను నియమించడం మరిచింది. ప్రస్తుతం కేవలం ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ మాత్రమే ఓపీ కౌంటర్‌లో పని చేస్తున్నారు. దీంతో ఇక్కడ ఓపీ నమోదే ప్రహసనంగా మారుతోంది. ఈ వైద్యశాలకు ప్రతి సోమవారం అధికసంఖ్యలో రోగులు వస్తుంటారు.


మందులు తీసుకునేందుకు క్యూలో ఉన్న రోగులు



ఆస్పత్రి వద్ద ఓపీ కోసం రోగుల క్యూ

దాదాపుగా 600 మంది వరకు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. వచ్చిన వారు తమ పేరు నమోదు చేసుకోవాలంటే ఉద యం 8 గంటల నుంచి 12 గంటల వరకూ సుమారు 4 గంటలు ఎండలో నిలబడక తప్పదు. రోగులు నిలబడ కుండా కుర్చీలు, ఎండ తగలకుండా షామీయానాలు కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

పరీక్షలు, మందుల కోసం నిరీక్షణ

వైద్యులు రోగ నిర్ధారణ కోసం సిఫార్సు చేసే పరీక్షల కోసం, రోగ నివారణకు సూచించే మందుల కోసం నిరీక్షణ తప్పని పరిస్థితి ఉంది. ఆసుపత్రికి వైద్యానికి పలు రకాల వ్యాధులతో వస్తుంటారు. వాటిలో కొన్ని ముట్టుకుంటే, మరికొన్ని గాలి ద్వారా వ్యాపించే రోగాలు కూడా ఉండవచ్చు. అలా రోగాలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. అయితే ఆసుపత్రి ఆవరణలో ఆటువంటి రోగాలు వ్యాపించకుండా కనీస చర్యలు తీసుకోవడం లేదు. రోగులకు రక్త పరీక్షలకు అవసరమైన సామగ్రి, సిబ్బంది కొరత కారణంగా ఫలితాల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోగులకు అవసరమైన చర్యలు తీసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- రాజకీయ పార్టీ నేతల సమావేశంలో సీఐ సోమయ్య


సమావేశంలో పాల్గొన్న సీఐ

గిద్దలూరు టౌన్, మే 20 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా రాజకీయ పార్టీలు, నేతలు సహకరించాలని అర్బన్ సీఐ సోమయ్య అన్నారు. సోమవారం గిద్దలూరు పోలీసుస్టేషన్ ఆవరణలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాయన్నారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆగిన అమ్మకాలు.. తొలగిన ఫ్లెక్సీ

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కల్యాణ మండపం వద్ద తొలగించిన ఎగ్జిబిషన్ సేల్ ఫ్లెక్సీ

మార్కాపురం, మే 20: స్థానిక టీటీడీ కళ్యాణ మండపాన్ని సబ్‌లీజుకు తీసుకున్న వ్యక్తి ఇష్టానుసారం అద్దెలకిస్తున్న వైనంపై ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో 'స్వామికార్యాలు వద్దు.. స్వకార్యాలే ముద్దు..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా కల్యాణ మండపంలో జరుగుతున్న ఎగ్జిబిషన్ సేల్ అమ్మకాలను సోమవారం నిలుపుదల చేయించారు. అంతేకాక కళ్యాణ మండపం పేరు కూడా కన్పించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. త్వరలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కాంట్రాక్టర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీటీడీ కళ్యాణ మండపాల నిర్వహణ అధికారులు తెలిపారు.

కార్డన్ సెర్చ్‌లో బైక్‌లు సీజ్


కార్డన్‌సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

మార్కాపురం, మే 20: పట్టణ శివారు కాలనీల్లో సోమవారం మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లునాయక్‌లు సిబ్బందితో కలిసి ఎస్టేట్, ఏకలవ్య కాలనీల్లో ఇంటింటికి తిరిగి తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఇళ్లవద్ద వున్న ప్రతి వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. మొత్తం 17 వాహనాలకు సంబంధించి సరైనపత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. అనంతరం వాహనాలను మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.

కొమరోలు : మండలంలోని తాటిచర్ల గ్రామంలో సోమవారం పోలీసు కార్డన్ సెర్చ్ నిర్వహించి 12 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై మధుసుధన్‌రావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాటిచర్లలో తనిఖీలు చేశారు. వాహన పత్రాలు ఉన్న వారు తీసుకెళ్లవచ్చని సూచించారు.

పట్టణంలో పోలీసుల కార్డన్ సెర్చ్

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టణంలోని జగనన్న కాలనీ, అర్బన్‌కాలనీ ప్రాంతాలలో ఉదయం 6 నుండి 8గంటల వరకు సోదాలు చేపట్టారు. సరైన పత్రాలు లేని రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కంభం : కంభం అర్బన్ కాలనీలో సోమవారం ఉదయం కంభం సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి గృహంలో పోలీసులు సోదాలు నిర్వహించి సరియైన ధృవపత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐ రామకోటయ్య మాట్లాడుతూ జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు నిర్వహించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంభం ఎస్సై పులి రాజేష్, బేస్తవారపేట ఎస్సై నరసింహులు, అర్థవీడు ఎస్సై అనిత, మూడు మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : సరైన పత్రాలు లేని 26 వాహనాలను పోలీసులు సోమావారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మల్లిఖార్జున్‌రావ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి పట్టణంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 26 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు ఎస్ఐలు కోటయ్య, మాధవరావు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : మండలంలోని కొలుకుల గ్రామంలో సోమవారం కార్డెన్ సెర్చ్‌లో వాహనాలను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 10 మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ రాములు నాయక్, ఎస్.ఐ సుదర్శన్ తెలిపారు. అపరాధం విధించామని అపరాద రుసుము చెల్లించి, అనుమతి పత్రాలు ధ్రువీకరించుకున్న తర్వాత వాహనాలు విడుదల చేస్తామన్నారు. మండలంలో వాహనాలు నడిపే యజమానులు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ ధ్రువీకరణ పత్రాలు, తనిఖీ సమయంలో అధికారుల వద్ద ధ్రువీకరించుకోవాలన్నారు. తనిఖీల్లో స్థానిక పోలీసులు కానిస్టేబుల్స్ పాల్గొన్నట్లు తెలిపారు.

మూతపడిన దారం తయారీ కేంద్రాలు

ఉపాధి కోల్పోయిన మహిళలు


సోమవారపేటలో మూతపడిన రిలింగ్ యూనిట్

బేస్తవారపేట, మే 20 : జిల్లాలో రోజురోజుకు పట్టు సాగు తగ్గిపోతుంది. నాలుగేళ్ల క్రితం పరిశీలిస్తే మార్కాపురం డివిజన్‌లో సూమారు 2వేల ఎకరాల్లో పట్టు రైతులు మల్బరీ పంటను సాగు చేసేవారు. కొవిడ్ ప్రభావం అనంతరం ఎగుమతులు లేవు. స్థానికంగా మార్కెట్‌లో విక్రయించినా, రైతులకు సరైన ధరలు లభించడం లేదు. దీంతో ప్రస్తుతం ఆ పంట సాగుకు రైతులు ముఖం చాటేశారు. దీంతో పట్టు పరిశ్రమ నుంచి దారం తీసే రీలింగ్ పరిశ్రమలు మూతపడ్డాయి.

మూడేళ్ల బేస్తవారపేట మండలంలో ఈ పట్టు పంట నుంచి దారం తయారు చేసే రీలింగ్ యూనిట్లు మూడు ఉండేవి. వీటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 70 శాతం రాయితీతో ఈ యూనిట్లను మంజూరు చేశాయి. దీంతో వందల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించడంతో పలువురికి జీవనోపాధి లభించింది. ఎడాది పాటు పట్టు నుంచి దారం తయారు చేశారు. పట్టు సాగు తగ్గడం కిలో ముడిపట్టు రూ.300 నుంచి రూ.800 వరకు పెరగడంతో ఇవి క్రమేపి మూతపడేపడ్డాయి. ఇక ఈ ప్రాంతంలో మిరప సాగుతో కూలి ధరలు అమాతం పెరగడంతో ఇక్కడి యూనిట్లపై ప్రభావం చూపింది. దీంతో బేస్తవారపేటలో దారం తయారు చేస్తున్న సోమవారపేట, బేస్తవారపేట, చెట్టిచెర్లలో ఉన్న మూడు కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో పలువురు మహిళలు ఉపాధి కోల్పోయారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పట్టు పరిశ్రమను ప్రోత్సహించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, పలువురు కోరుతున్నారు.

అనుమతి లేని లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి


మండలంలో అనుమతి లేకుండా వేసిన లే అవుట్లు

త్రిపురాంతకం, మే 20: వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలంటే అందుకు ముందస్తు అనుమతి అవసరం. దీని కోసం ప్రభుత్వానికి కొంత సొమ్ము చెల్లించి అనుమతి పొందిన తరువాత మాత్రమే వ్యవసాయ భూమిని మార్పు చేయాలి. కానీ మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాలలో అలా అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా లే అవుట్లు వేసి క్రయ, విక్రయాలు జరుపుతున్నారు. త్రిపురాంతకం మండలంలో గతంలో వేసిన లే అవుట్లకు అధికారులు ఫీజులు వసూలు చేశారు. ప్రస్తుతం మళ్లీ నూతన లేఅవుట్లు భారీగా వెలుస్తున్నాయి. రియల్ బూమ్ సృష్టించి, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తుంగలో తొక్కి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. అయితే పలుచోట్ల సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు, నాయకులకు ఇది వరంగా మారుతోంది. లే అవుట్లలో సగానికి కూడా ముందస్తు అనుమతులు తీసుకోవడంలేదు. నిబంధనల ప్రకారం తొలుత వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలు, ప్లాట్లుగా లేఅవుట్లు వేయటానికి భూమి మార్పిడికి రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. భూమి విలువలో 10 శాతాన్ని చెల్లించాలి. తరువాత ఖాళీ భూమిలో లే అవుట్లు వేయటానికి స్థానిక పంచాయతీకి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు లేఅవుట్ ఫీజు కింద ఎకరాకు గ్రామ స్థాయిని బట్టి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత దరఖాస్తును జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారులకు పంపిస్తారు. అక్కడ నిర్ణీత ఫీజు చెల్లించిన తర్వాత తాత్కాలిక అనుమతి ఇస్తారు. తాత్కాలిక అనుమతి వచ్చిన తరువాత లే అవుట్లు వేయాలి. 33 అడుగులకు తగ్గకుండా అంతర్గత రోడ్లు, 44 అడుగుల ప్రధాన రహదారి, డ్రైనేజీ వేయాలి. 10 శాతం భూమిని సామాజిక అవసరాలకు కేటాయించాలి. అప్పుడే లే అవుట్‌కు తుది అనుమతి వస్తుంది. ఇళ్ల స్థలాలు, ప్లాట్లను ప్రజలకు విక్రయించాలి. అయితే స్థిరాస్థి వ్యాపారుల్లో చాలా మంది ఈ నిబంధనలు పాటించటం లేదు. నేరుగా ఇళ్ళ స్థలాల విక్రయాలను జరుపుతున్నారు. విషయం తెలియని ప్రజలు స్థలాలను కొనుగోలు చేసి భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో పంచాయతీలకు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుంది.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, మే 20 : పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలకు చెందిన 1995-98 బికాం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరి గింది. 25 ఏళ్లక్రితం విద్యార్థి దశలోని జ్ఞాపకాలను పంచుకున్నారు. అధ్యాపకలు రాఘవరావు, బాలిరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన శివపురం భాస్కర్‌రావు, ప్రసాద్, మధు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్ దగ్ధం


కాలిపోతున్న మోటార్‌బైక్

పొదిలి, మే 20 : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రన్నింగ్‌లో ఉన్న మోటార్‌బైక్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.., రాజంపల్లి గ్రామం నుంచి మోటార్‌బైక్‌పై ఇద్దరు వ్యక్తులు పనిమీద పొదిలికి వస్తున్నారు. ఈ క్రమంలో వైద్యశాల వద్దకు రాగానే బైక్‌లో సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గుర్తించి వెంటనే అప్రమత్తమై బైక్‌దిగి పక్కకు వెళ్లామని యజమాని తెలిపారు. మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా, దగ్గర లో నీళ్ల లేకపోవడంతో వదిలేశామని బైకు పూర్తిగా కాలిబూడిదైందన్నారు.

అవీ..ఇవీ..

అండర్ బ్రిడ్జి తాత్కాలికంగా మూసివేత

గిద్దలూరు, మే 20 : రైల్వే డబ్లింగ్ పనులు, బ్రిడ్జి మరమ్మతులతో పట్టణ శివార్లలోని రైల్వే అండర్ బ్రిడ్జిని తాత్కాలికంగా రెండు వారాలపాటు మూసివేస్తున్నారు. గిద్దలూరు నుంచి కొండపేట రోడ్డులోని అండర్ బ్రిడ్జిని ఈ నెల 21 నుంచి జూన్ 3వ తేదీ వరకు రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కొండపేట, అంబవరం, వెంగలరెడ్డిపల్లి, జయరాంపురం, వెల్లుపల్లి గ్రామస్థులు అండర్ బ్రిడ్జిని మూసివేస్తున్నందున పట్టణంలోని పాములపల్లి రైల్వేగేటు మీదుగా గిద్దలూరుకు చేరాలని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఏపీజీబీ ఆర్‌ఎంగా రఘురాం బాధ్యతలు



మార్కాపురం వన్‌టౌన్, మే 20: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్‌గా ఎం.రఘురాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప కేంద్ర కార్యాలయం నుంచి బదిలీపై ఈయన మార్కాపురం వచ్చారు. ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసప్రసాద్ కడప ఆర్‌ఎంగా బదిలీపై వెళ్లారు.

విద్యార్థులకు పోటీలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బేస్తవారపేట, మే 20 : గ్రంథాలయంలో వేసవి శిక్షణతరగతులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజకరమని గ్రంథపాలకుడు పీవీ.సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు స్పోకేన్ ఇంగ్లీషు, డ్రాయింగ్ నేర్పించారు. ఈ సందర్భంగా పి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు కొంత సమయం గ్రంథాలయానికే కేటాయిస్తే పోటీపరీక్షలను సులభంగా ఎదుర్కోవచ్చన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన

మార్కాపురం వన్‌టౌన్, మే 20: విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని విద్యార్థులకు యోగా శిక్షణ నిర్వహించారు. పుస్తకాలు చదవడం, కథలు వినడం, పుస్తకాలలోని మెలుకువలు అర్థం చేసుకోవడం నేర్పించారు.


వేసవి శిక్షణ శిబిరం

గిద్దలూరు, మే 20 : స్థానిక శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులతో కథలు చెప్పించి చదివించి రాయించారు. అలాగే చెస్, వైకుంఠపాలి, ఖోఖో ఆటలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ టీచర్ పోలిరెడ్డి పాల్గొన్నారు.

నెమలిగుండానికి నీరు

గిద్దలూరు, మే 20 : నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నీరు రంగనాయకస్వామి క్షేత్రంలోని రంగస్వామిగుండంలోకి చేరుతోంది. అడవిలోని కొండల నుంచి నీరు గుండంలోకి దారగా ఉబికి పడుతుండడంతో ఆ దృశ్యాలను చూసేందుకు ప్రకృతి ప్రియులు, భక్తులు రంగస్వామి క్షేత్రానికి పోటెత్తారు. కాగా నల్లమల అటవీ ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో అడవిలో ఉన్న జంతువులు, పక్షులు వేసవి గాలుల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా సంవృద్ధిగా తాగునీరు లభించడంతో అడవిలోని జీవరాసులు ఉపశమనం పొందాయి.

హనుమంత వాహనంపై సత్యదేవుడు



మార్కాపురం వన్‌టౌన్, మే 20: పట్టణంలోని 9వ వార్డులో వెలసిన రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరిశంకరశర్మ స్వామి మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యదేవునికి నగరోత్సవం నిర్వహించారు.

పంటనష్టం వివరాలు సేకరించాలి

గిద్దలూరు, మే 20 : 2023-24 రబీ సీజన్‌లో లోటు వర్షపాతంతో గిద్దలూరును కరువు మండలంగా ప్రకటించినందున ఆ సీజన్‌లో 33 శాతం కన్నా అధికంగా నష్టపోయిన పంట వివరాలు వెంటనే తీసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. గిద్దలూరు మండల రైతు భరోసా సిబ్బందితో అయన సమావేశమై ఈ నెల 24వ తేదీలోగా నష్టపోయిన పంటల వివరాలను సామాజిక తనిఖీ కోసం ఆర్‌బీకేలలో ప్రచురించాలని పేర్కొన్నారు. ఏవో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పప్పుశనగ, మినుములు, జొన్న, వరిగ, నువ్వులు, ఉలవలు, ఆముదం తదితర పంటలు 33 శాతం కన్నా అధికంగా నష్టపోయినందున ఆ రైతుల వివరాలు ఆధార్, బ్యాంక్ అకౌంట్ నివేదికలు తయారు చేసి ఏవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, మే 20 : పట్టణంలో 13 మద్యం ఫుల్ సీసాలు కలిగిన వ్యక్తిని ఎస్ఈబీ సీఐ కొండారెడ్డి అదుపులోకి తీసుకుని, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. రాచర్ల గ్రామానికి చెందిన కోటేశ్వరరావు పట్టణంలో అతడిని అనుమానంతో తనిఖీ చేయగా 13 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

పెడదోవపడుతున్న యువత

- పట్టణంలో పెరుగుతున్న నేరప్రవృత్తి
- యథేచ్ఛగా గంజాయి అమ్మకాలు
- ఆన్‌లైన్ జూదాలతో అతలాకుతలం



మార్కాపురం, మే 20

● పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ సమీపంలో ఈ మధ్య రెండు వర్గాలు తీవ్రంగా ఘర్షణపడ్డాయి. పూటుగా మద్యం సేవించిన యువకులు మాటామాటా పెరిగి రెండువర్గాలుగా విడిపోయి సీసాలతో కొట్టుకున్నారు. అడ్డువెళ్లిన వారిని కూడా రక్తగాయాలయ్యేలా కొట్టినట్లు సమాచారం.

● స్థానిక పెద్దనాగులవరం వెళ్లే దారిలో కొచ్చెర్లకోట కాలువ సమీపంలో యువత పెద్దసంఖ్యలో చేరి నిత్యం గంజాయి సేవిస్తునట్లు సమాచారం. మత్తులో తూగి అటుగా వెళ్లే వారిపై దాడులు చేయడం రివాజుగా మారింది. బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్తే కొన్ని రోజుల పాటు ఆగి మళ్లీ ఆ ప్రాంతంలో గంజాయి తాగి అరాచకాలు చేయడం షరా మామూలే. మూడేళ్ల క్రితం గంజాయి తాగే యువతతో విసిగివేసారిన స్థానికులు అందరూ కలిసి వారిపై తిరగబడడంతో ఓ యువకుడు కూడా మృతి చెందాడు. కొన్నాళ్లు పరిస్థితి బాగానేవున్నా సంవత్సర కాలంగా మళ్లీ యువకులు మత్తులో జోగుతున్నారు.

● స్థానిక తర్లుపాడు రోడ్డులోని పెద్దట్యాంకు సమీపంలో రాత్రి 9 గంటలు దాటితే అటుగా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. పదుల సంఖ్యలో యువకులు ట్యాంకు కిందకు చేరి యథేచ్ఛగా మద్యం, గంజాయి సేవిస్తుంటారు. అంతేకాక ఆ మత్తులో రోడ్లపై వెళ్లేవారిపై పలుమార్లు దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. అక్కడ కొందరు యువకులైతే ప్రధాన రహదారిపై బైక్‌రేసు నిర్వహించడం అలవాటుగా మారింది. ఇంతా జరిగేది మార్కాపురం డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో కావడం విశేషం.

● స్థానిక కళాశాల రోడ్డులోని ఓ బార్‌లో పది రోజుల క్రితం పూటుగా మద్యం సేవించిన యువకులు హంగామా చేసినట్లు సమాచారం. అర్థరాత్రి దాటినా మద్యం అందించాల్సిందే అని అక్కడ పనిచేసే సిబ్బందిపై గొడవ పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో సీసాలు పగులకొట్టి రోడ్డుపైనే నానా యాగీ చేసినట్లు స్థానికుల సమాచారం.

● పట్టణ నడిబొడ్డున టీటీడీ కళ్యాణ మండపం ఎదురు సందులో చీకటిపడితేచాలు పదుల సంఖ్యలో యువకులు గుమిగూడుతారు. అక్కడ పాడుబడిన ఓ గృహంలో కూర్చుని గుట్టుగా గంజాయి సేవించడం అలవాటుగా చేసుకున్నారు. ఈ క్రమంలో సంవత్సరం క్రితం యువకుల మధ్య గొడవ జరిగింది. మత్తులో ఉన్న యువకులు రోడ్డుపైకి వచ్చి కర్రలతో ఇష్టారీతిన కొట్టుకున్నారు. భయభ్రాంతులకు గురైన చుట్టుపక్కల వాళ్లు పరుగులు తీశారు. పోలీసులు అక్కడకు వెళ్లి ఇద్దరిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

● రెండు నెలల క్రితం ఓ యువకుడు అకస్మాత్తుగా మరణించాడు. చిన్న వయసులోనే బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు మృతి కారణంపై ఆరా తీశారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లో రెండు లక్షల వరకు పోగొట్టుకున్నట్లు తెలుసుకున్నారు. అప్పు చేసిన వారికి చెల్లించలేక మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి చనిపోయినట్లు తెలిసింది.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఇంకా బయటకు రాని ఘటనలు ఎన్నో నిత్యం చోటుచేసుకుంటున్నాయి. మద్యం, గంజాయి సేవనం, బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బులు పోగొట్టుకొని చివరికి నేర ప్రవృత్తివైపు మరలుతున్నారు. నియంత్రించాల్సిన పోలీసు, సెబ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాక తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం కూడా యువత చెడుమార్గం పట్టేందుకు దోహదపడుతోంది.

● గుట్టుగా గంజాయి అమ్మకం

మార్కాపురం పట్టణంలో వందల సంఖ్యలో యువత ప్రస్తుతం గంజాయికి అలవాటుపడింది. ఇక్కడ అక్కడ అని కాకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గంజాయి సేవించే యువకులు ఎక్కువయ్యారు. గతంలో రైల్వే స్టేషన్ల సమీపంలో కొద్దిమంది వృద్ధులు మాత్రమే గంజాయి తాగేవాళ్లు. యువత గంజాయికి అలవాటుపడటానికి ప్రధాన కారణం మద్యం ధరలు ఆకాశాన్నంటడమే. మద్యం సేవించే వాళ్లు సరిపడినంత డబ్బులులేక గంజాయి వైపు మరలుతున్నారు. ఒక్కసారి గంజాయి సేవిస్తే దాని ప్రభావం ఒక రోజంతా ఉంటుండటంతో దానికి యువత బానిసలుగా మారుతున్నారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని ఎస్టీలు అధికంగా ఉండే ప్రాంతంలో గంజాయి లభిస్తున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ముగ్గురు గంజాయి అమ్మేవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. అదే ప్రాంతంలో గతంలో ఒక మహిళ ఇంట్లోనే గంజాయి చెట్టు పెంచినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దాడిచేసి గంజాయి చెట్టును పెంచే వాళ్లను విచారించి యువతకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించుకుని కేసు నమోదుచేసి జైలు పంపారు. అప్పట్లో కొన్నాళ్లపాటు గంజాయి అమ్మకాలు ఆగాయి. లాభసాటి వ్యాపారం కావడంతో మళ్లీ ఉధృతంగా అమ్మకాలు సాగిస్తున్నారు. జులాయిగా తిరిగేవాళ్లే కాక ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకునే వాళ్లు కూడా ఈ వ్యసనానికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు బెట్టింగులు

గతంలో వరల్డ్‌కప్‌లు, ఐపీఎల్ సీజన్‌లో మాత్రమే కొద్దిమొత్తంలో బెట్టింగులు నడిచేవి. కానీ నేడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చేసరికి సంవత్సరం పొడవునా బెట్టింగులు నడుస్తున్నాయి. కావాల్సినన్ని యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. చివరికి ఎన్నికల ఫలితాలపై కూడా ఆన్‌లైన్‌లో బెట్టింగులు నడుస్తుండటం విశేషం. పట్టణంలో రమారమి రోజుకు 10 లక్షలకుపైగానే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం. ఎలాంటి పోలీసుల దాడులు లేకపోవడం, చేతిలో సెల్‌ఫోన్ ఉంటే ఎక్కడి నుంచైనా బెట్టింగులు పెట్టుకొనే వెసలుబాటు ఉండటంతో యథేచ్ఛగా ఈ ప్రక్రియ సాగుతోంది. ప్రధానంగా యువత బెట్టింగులలో లక్షలు పోగొట్టుకుని చివరికి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



ఎన్వీ రమణను సన్మానిస్తున్న గొట్టిపాటి లక్ష్మి దంపతులు

మాజీ చీఫ్ జస్టిస్‌ను సన్మానించిన డాక్టర్ లక్ష్మి

దర్శి, మే 20: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణను టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, కుటుంబసభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో జరిగిన ఓకార్యక్రమంలో ఎన్‌వీ రమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనను డాక్టర్ గొట్టి లక్ష్మి దంపతులు, డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, కడియాల రమేష్ మాజీ చీఫ్ జస్టిస్ రమణను కలిశారు. అనంతరం ఆయన్ని దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఏపీటీఎఫ్ లక్ష్యం



కేవీజీ కీర్తి, వెంకటరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి, మే 20: ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఏపీటీఎఫ్ అహర్నిశలు కృషి చేస్తుందని ఆసంఘం రాష్ట్ర కౌన్సిలర్ కేవీజీ కీర్తి పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కౌన్సిలర్ కీర్తి, జిల్లా అధ్యక్షుడు వి.వెంకటరావును సోమవారం దర్శిలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వి.బాలాజీరావు, ఏ.గురవయ్య, నాగరాజు, కె.వెంకటేశ్వరరావు, ఏ.గురులింగం, పి.శ్రీనివాసులు, ఎం.సాంబయ్య, ఎం.సుబ్బయ్య కె.చెంచయ్య టి.తిరుపతి స్వాములు, రాజశేఖర్, మీనగ శ్రీనివాసరావు, ఏడుకొండలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

పీసీపల్లి, మే 20: మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సంబంధిత కాగితాలు లేని అనుమానాస్పద వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్నారు. గతంలో పోలీసు తనిఖీల సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోతే కొంత అపరాధ రుసుం వేసి పంపించేవారు. ప్రస్తుతం కాగితాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలిస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎస్సై రమేష్‌బాబును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలతో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. సంబంధిత పత్రాలు లేని వాహనాల సమాచారాన్ని ట్రాన్స్‌పోర్ట్ అధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు.

పామూరులో మోస్తరు వర్షం



పామూరులో కురుస్తున్న వర్షం

పామూరు, మే, 20: పామూరులో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండతీవ్రతతో పాటు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. సీఎస్‌పురం మండలంలో నూ వర్షం కురిసింది.

కురిచేడులో.. కురిచేడు, మే 20: కురిచేడులో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం కూడా మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. దుక్కులు దున్నడానికి పనిముట్లు సిద్ధం చేసుకుంటున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖాధికారులు తెలియజేస్తుండటంతో రైతులు సంతోషపడుతున్నారు. సోమవారం కురిసిన వర్షంతో రైతులు పొలం పనులు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నేతలు

వెలిగండ్ల, మే 20: మండలంలోని గన్నవరం పంచాయతీకి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త వేమవరపు మరియమ్మ ఆదివారం బస్సు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు సోమవా రం ఆగ్రామానికి వెళ్లి ఆమె భౌతికాయానికి నివాళులర్పించారు. చంద్రన్న బీమా సభ్యత్వం ఉండటం వల్ల అమె కుటుంబానికి రావాల్సిన ఆర్థికసహాయం కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ద్వారా త్వరగా అందే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రావి గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు



మాట్లాడుతున్న సీఐ రాంనాయక్

సీఎస్‌పురం(పామూరు), మే 20: రాజకీయ ఘర్షణలకు పాల్పడితే అట్టివారిపై కేసులు నమోదు చేస్తామని పామూరు సీఐ ఎం.రాంనాయక్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన సీఎస్‌పురంలో సోమవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ప్రజలతో మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకొని అందరూ కలసిమెలసి ఉండాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం అందించాలని సూచించారు. పాత నేరస్థులు ఇళ్లవద్ద ఉన్నారా, వేరే ప్రాంతాలకు వెళ్లేరా అనే వివరాలు సేకరించారు. అనుమానాస్పదంగా పార్క్ చేసిఉన్న వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రేమ్‌కుమార్, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన వసతి

దర్శి, మే 20: లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు సోమవారం భోజన వసతి కల్పించారు. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు జిల్లాలోని మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రెండవ కౌన్సెలింగ్ కోసం ఇక్కడకు వచ్చారు. లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షుడు తమ్మవరపు ఫణిబాబు, కార్యదర్శి పానుగంటి సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో సుమారు 400 మంది విద్యార్థులు, తల్లితండ్రులకు భోజన వసతి కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు లయన్స్‌క్లబ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు విద్యాసాగర్ రెడ్డి, భూదాటి ఆంజనేయులు, అంబటి గోవిందరెడ్డి, గుడిపల్లి శ్రీధర్‌బాబు, టి.రమేష్. జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పీసీపల్లి, మే 20: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను 50శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి జి.వెంకటస్వామి చెప్పారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మం డలంలోని రైతుభరోసా కేంద్రాల్లో 37క్వింటాళ్ల జనుములు, జీలుగలు, పిల్లిపె సరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకు లు రైతులకు తెలియపరిచి అవసరమైన రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే గత రబీ కాలాన్ని కరువుగా ప్రకటిం చిన నేపథ్యంలో పంటనష్టపోయిన రైతుల జాబితాను ఈనెల 25లోగా తహసీల్దార్‌కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య పాల్గొన్నారు.

హోమియో వైద్యం అందేదెప్పుడో..!

- దొనకొండలో భవనం నిర్మించారు.. వైద్యశాల ఏర్పాటు మరిచారు
- వృథా అయిన ప్రజాధనం
- వైద్యుడులేక అలంకారప్రాయంగా మారిన వైనం

దొనకొండ, మే 20: దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన హోమియో వైద్యశాల నిరుపయోగంగా మారింది. గత పదేళ్లుగా హోమియో వైద్యాధికారి లేక వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పదేళ్ళ క్రితం ఆరోగ్యకేంద్రంలోనే హోమియో వైద్యశాలను ఒక గదిలో ఏర్పాటుచేసి డాక్టర్ కోట్ల వెస్లీ వైద్యుడిగా నియమితులయ్యారు. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి ఇంగ్లీషు మందుల వాడకం పట్ల నమ్మకం లేని ఎందరో సుదూర ప్రాంతాలకు చెందిన రోగులు సహితం ఇక్కడికి వచ్చేవారు. డాక్టర్ వెస్లీ హోమియో వైద్యం పట్ల మొగ్గ చూపుతూ ప్రతిరోజు అధికసంఖ్యలో ఓపీ నమోదు జరుగుతుండేది. డాక్టర్ వెస్లీ ఇక్కడినుంచి వెళ్లినతర్వాత హోమియో వైద్యం అందకుండా పోయింది. ఆయన వెళ్లిన తర్వాత అధికారులు లక్షల వ్యయంతో దొనకొండలో ప్రభుత్వ వైద్యశాల పక్కన హోమియో వైద్యశాల భవ నం నిర్మించారేగాని నేటికి వై ద్యుడి నియామకం జరపలేదు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన హోమియో వైద్యశాలలో ప్రస్తుతం నాడీ పట్టే నాథుడేలేడు.

ఎన్ని అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేదు

- షేక్ రసూల్‌బాషా, దొనకొండ



దొనకొండలో నిరుపయోగంగా ఉన్న హోమియో వైద్యశాలకు డాక్టర్‌ను ఏర్పాటుచేసి వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చి విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదు. డాక్టర్ వెస్లీ ఉన్న సమయంలో రోజుకు దాదాపు వంద వరకు ఓపీలు వచ్చేవి. ఎందరో దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం పొందారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే హోమియో వైద్యశాల నిరుపయోగంగా మిగిలింది. అధికారులు, పాలకులు పట్టించుకొని హోమియో వైద్యశాల ఏర్పాటు చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది

హోమియో వైద్యం పట్ల అపారనమ్మకంతో దీర్ఘకాలిక వ్యాధులకు సహితం ఉపశమనం పొందిన ఎందరో రోగులు నేటికీ ఎర్రగొండపాలెంలో నివాసం ఉంటున్న హోమియో వైద్యుడు డాక్టర్ వెస్లీ వద్దకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. తరచూ మండల ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఇంగ్లీషు మందులు గిట్టనివారు హోమియో వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో హోమియో వైద్యశాలకు వైద్యుడు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిర్లక్ష్యవైఖరి విడనాడి దొనకొండలోని హోమియో వైద్యశాలకు డాక్టర్, సిబ్బంది నియామకం చేపట్టి ఈప్రాంత ప్రజలకు మెరుగైన హోమియో వైద్యసేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. .



నిరుపయోగంగా హోమియో వైద్యశాల భవనం

రోడ్డు ప్రమాదం.. ఆ కుటుంబాలకు శాపం!

- ప్రమాద, వేగ సూచికలు లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం

కనిగిరి, మే 20: కనిగిరి పట్టణ సమీపంలోని దేవాంగ నగర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాలను రోడ్డు పాలు చేసింది. విధి వక్రించి కారు రూపంలో కుటుంబ పోషకులైన బత్తుల విష్ణునారాయణ, కస్తూరిలను పొట్టన పెట్టుకుంది. కారు ఆటోను ఢీకొట్టిన ఘటనలో మరో ఇద్దరిలో ఒకరు ఆటోడ్రైవర్ రామకృష్ణ ఒంగోలు కిమ్స్‌లో కోమాలో ఉండగా, మరో మహిళ గురవమ్మ పరిస్థితి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. దీంతో ఆనాలుగు కుటుంబాలకు చెందిన కుటుంబసభ్యులు ఆగమ్యగోచరంలో కొట్టుమిట్టాడుతున్నారు.

పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన కస్తూరి, గురవమ్మలను రామకృష్ణ తన ఆటోలో కనిగిరి పట్టణంలోని శంఖవరం వద్దకు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కుటుంబ పనుల నిమిత్తం వచ్చాడు. తిరిగి పని ముగించుకుని తెల్లవారుజామును ఐదు గంటలకు కాశిరెడ్డికాలనీ వెళ్ళేందుకు తిరుగు ముఖంపట్టారు. బత్తుల విష్ణునారాయణ కూడా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కనిగిరి పట్టణంలోకి టీ తాగేందుకు వచ్చి ఇంటికి వెళ్ళేందుకు రామకృష్ణ నడుపుతున్న ఆటో ఎక్కి వారితో పాటు కాశిరెడ్డి కాలనీకి బయలుదేరారు. ఈక్రమంలో దేవాంగనగర్ వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో విష్ణునారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలుకు తరలించగా కస్తూరి మృతిచెందింది. మరో ఇద్దరు ఐసీయూలో ఉన్నారు.

విష్ణునారాయణే కుటుంబానికి ఆదరువు

విష్ణునారాయణ చేనేత కుటుంబానికి చెందిన వాడు. చేనేతలో చేయి తిరిగిన నేతన్న. సరైన ఉపాధి లేక కుల వృత్తిని వీడి గత ఐదేళ్ళగా ఆటో నడుపుకుంటున్నాడు. ఆయనకు భార్య కుమార్తె, కుమారుడు ఉండగా కుమార్తెకు వివాహం చేశాడు. కుమారుడు మానసిక దివ్యాంగుడు. తన తండ్రి చనిపోయాడని కూడా తెలుసుకోలేని స్థితిలో ఆ కుమారుడి పరిస్థితి. విష్ణునారాయణ భార్య ఓ పక్క భర్త చనిపోయాడని, ఏ ఆదరణ లేని తన బిడ్డకు పెద్దదిక్కు ఎవరూ అంటూ గుండెలవిసేలా రోదిస్తుంది. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయిన ఆకుటుంబం దిక్కుతోచని స్థితిలో నడిరోడ్డుపాలైంది.

కస్తూరి రెక్కాడితేనే ఆ ఇద్దరి చిన్నారుల డొక్క నిండేది..

కస్తూరి వయస్సు 25ఏళ్ళు. ఆమెకు ఆరేళ్ళ కొడుకు బాలు, నాలుగేళ్ళ కొడుకు రఘు ఉన్నారు. భర్త తాగుడికి బానిసై కుటుంబాన్ని పోషించకుండా ఉంటే కస్తూరి కొత్తూరు వద్ద ఓ హోటల్‌లో పనిచేస్తూ రోజువారీ రూ.300 కూలీకి పనిచేస్తూ బిడ్డలను పోషించుకుంటుంది. రోడ్డు ప్రమాదంలో తన రెండు కాళ్ళు కోల్పోయి ఒంగోలులో చికిత్స పొందుతూ తనువు చాలించింది. ఇప్పుడు ఆ ఇద్దరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. తల్లి ఇక ఇంటికి సజీవంగా తిరిగి రాదని తెలియని ఆ చిన్నారులు తన తల్లి హోటల్‌కు వెళ్ళింది తమకు తినేందుకు తెస్తుంది అంటూ తల్లికోసం ఇంటి ముందు దీనంగా కూర్చొని ఎదురుచూస్తున్నారు.

హోటల్‌లో పనిచేస్తేనే రోజూ గడిచేది..

గురవమ్మ భర్త 20ఏళ్ళ క్రితమే గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో తన రెక్కల కష్టంతో హోటల్ పనిచేస్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. చేతికందిచ్చొని కుమారులిద్దరూ హైద్రాబాద్‌లో బేల్దారి పనులు చేస్తూ ఇటీవలే ఇంటికి వచ్చారు. ఏనాడు ఆమెకు చేదోడుగా కుమారులు నిలబడలేదు. గురవమ్మ తన తలరాతను నిందించుకుంటూ, హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. రోడ్డు ప్రమాదంలో గురవమ్మ ఛాతి చీల్చుకు పోయి ప్రాణాపాయ స్థితిలో ఒంగోలు రిమ్స్ ఐసీయూలో ఉంది. ఇప్పుడు ఆ ఇద్దరు కుమారులు దిక్కులేని వారయ్యారు.

ఆటోను నడుపుకుంటూ..

రామకృష్ణ తండ్రి కనిగిరి పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద టాయిలెట్స్‌లలో పనిచేసేవాడు. ప్రమాదవశాత్తు ఐదేళ్ళ క్రితం ఓ రోజు జారీ ఆ టాయిలెట్స్‌లో జారీ పడటంతో తన రెండు కాళ్ళు పనిచేయక చేతి ఊతంతో జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు రామకృష్ణకు కుటుంబాన్ని పోషించే బాధ్యత ఏర్పడింది. వృద్ధ తల్లిదండ్రులకు అతడే జీవనాధారం. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావటంతో ఆచేతనా స్థితిలో ఒంగోలు కిమ్స్‌లో కోమాలో ఉన్నాడు. కోమాలో ఉన్న కుమారుడి పరిస్థితిని తలచుకుని వృద్ధ తల్లిదండ్రులు రోదిస్తుండటం చూపరులను కలచివేస్తుంది.



దేవాంగనగర్ వద్ద రోడ్డు మలుపు తెలియకుండా మార్జిన్‌లోకి వచ్చిన నిర్మాణాలు, చెట్లు

ప్రమాద సూచికలు లేక గాలిలో కలుస్తున్న ప్రాణాలు

పేరుకు జాతీయ రహదారి 565. నిర్మాణం జరిగే దశాబ్దకాలం దాటింది. పనులు పూర్తిగా జరగకపోవటంతో కనిగిరి పెద్దచెరువు వద్దకు వచ్చి ఆగి.. కనిగిరి కొత్తూరు వద్ద నుంచి మళ్ళీ నిర్మాణం జరిగింది. అసంపూర్తిగా ఉండటంతో హైవేకు ఏర్పాటుకావాల్సిన విధివిధానాలు ఏవి జరగలేదు. హైవే ఊళ్లోకి ప్రవేశించాలంటే ఊరికి 3కి.మీ. ముందు నుంచి రోడ్డు ఇరువైపులా ప్రమాద, వేగ నియంత్రణ సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి.

రోడ్డుకు సెంటర్ డివైడర్‌లు ఉండి మధ్యన విద్యుత్ స్తంభాలతో లైట్లు ఉండాలి. ఊర్లోకి ప్రవేశించే వరకూ రోడ్డు మార్జిన్‌ను తెలిసేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను, రోడ్డు మార్జిన్ ఆక్రమణలు ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇవేమి ఈ హైవే రోడ్డులో పాటించలేదు. దీంతో రోడ్డు మలుపుల వద్ద అతివేగంగా వస్తూ నియంత్రించలేక వాహనాలు ప్రమాదాలకు మవుతున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక శక్తులకు చెక్..!

- అడిషనల్ డీఎస్పీ అశోక్‌బాబు
- కనిగిరిలో మాక్‌డ్రిల్

కనిగిరి, మే 20: అసాంఘిక శక్తులకు కట్టడిచేసి చెక్ పెట్టనున్నట్లు అడిషనల్ డీఎస్పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక చర్చి సెంటర్‌లో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈమాక్ డ్రిల్‌లో అసాంఘిక శక్తుల దాడులు నుంచి ఎదుర్కొనే సన్నివేశాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు చూపించటంతో పాటు ప్రజలు తమను తాము రక్షించుకునే ప్రతిచర్యలపై కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై కేసులు నమోదు చేయటంతోపాటు కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఎక్కడా కూడా ఎన్నికల విషయాలను, మెజార్టీలను ప్రస్తావిస్తూ చర్చలు చేసే వారిపై నిఘా ఉన్నట్లు తెలిపారు. అలాంటి వివరాలను పొందుపరచి పోలింగ్ రోజు అదుపులోకి తీసుకుంటామన్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను ఈసీ తీవ్రంగా పరిగణిస్తుందని అశోక్‌బాబు చెప్పారు. ఈసమయంలో ప్రజలెవరూ అనాలోచితంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన కొన్ని రోజుల వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందని డీఎస్పీ అశోక్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ రామరాజు, సీఐలు వెంకటేశ్వరరావు, రామానాయక్, ఎస్ఐలు త్యాగరాజు, శివనాగరాజు, ఫైర్ ఎస్ఐ రామకృష్ణ, ఆర్మడ్ రిజర్వుడు, ఫైర్, అంబులెన్స్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిమాపక ప్రమాదాల నివారణ సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది



అసాంఘిక శక్తుల దాడిని ఎదుర్కొనే సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న ఆర్మడ్ రిజర్వుడు పోలీసులు

పోలీసుల మాక్‌డ్రిల్‌ను ఆసక్తిగా తిలకించిన ప్రజలు

హింసాత్మక ఘటనలను సృష్టించే అసాంఘిక శక్తులను పోలీసులు ఎదుర్కొనే సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లు మాక్‌డ్రిల్‌లో చూపించారు. అల్లరిమూకలు చేసే అగ్నిప్రమాదాలు, బాంబులు నుంచి ప్రజలను కాపాడే సనివేశాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. పోలీలసులపై ఎదురుదాడికి దిగే వారినుంచి పోలీసులు తమను తాము రక్షించుకుంటూ ప్రజలకు రక్షణ కల్పించే తీరును ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు.

అసాంఘిక శక్తుల దాడుల్లో గాయపడిన వారిని, అగ్నిప్రమాదాలకు లోనైన వారు ప్రాణాపాయ స్థితిలోకి వెళితే రక్షించే సన్నివేశాలను, ప్రజలకు రక్షణ కల్పించి అసాంఘిక శక్తులను సిబ్బంది ఎదుర్కొనే సన్నివేశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ప్రజలకెంతో భరోసా కల్పించాయి.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), మే 20: మండలంలోని కోవిలంపాడు పంచాయతి మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండి ఆదాయాన్ని కమిటీ సభ్యులు లెక్కించారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.1,07,800, అద్దూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.29,450, శాశ్వత అన్నదానానికి విరాళాలుగా రూ.86,182, మహాప్రాకార నిర్మాణానికి రూ.75 వేలు విరాళాలు వచ్చాయి. మహాప్రాకార నిర్మాణానికి వెలిగండ్ల మండలం వెదళ్ళచెరువు గ్రామానికి చెందిన నారాయణ, శ్రీదేవి దంపతులు రూ.75 వేలు, శాశ్వత అన్నదాన పథకానికి పామూరు మండలం తిరగళదిన్నె గ్రామానికి చెందిన ఒంటేరు నాగార్జున గంగమ్మ దంపతులు రూ. 25,116 విరాళం అందజేశారు.

కురిచేడు హైస్కూల్‌లో ఇంటర్ తరగతులు

కురిచేడు, మే 20: కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి జూనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సాయి తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రూప్‌నకు 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

తాళ్లూరు, మే 20: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని కొర్రపాటివారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోట శేషయ్య తన గేదెలను తీసుకుని పొలంలో మేపకానికి వెళ్లాడు. సాయంత్రం వేళ వీచిన గాలులకు పొలంలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలు మేత మేస్తున్న రెండు గేదెలకు తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిని అదిలించబోయిన గేదెల యజమాని శేషయ్య గాలికి వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి చేతికి, కాలికి స్వల్ప గాయాలయి ప్రమాధం నుండి బయట పడ్డాడు. మృతి చెందిన రెండు గేదెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుంది.

పొలంలో విద్యుత్తు తీగలు వదులుగా ఉండి, ప్రమాదాలు జరిగే అవకాశంఉందని విద్యుత్తుశాఖ అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈప్రమాదం జరిగి గేదెలు మృతి చెందాయని విమర్శిస్తున్నారు.



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు

సత్తాచాటిన బల్లికురవ ఎడ్ల జత

సీఎస్‌పురం(పామూరు), మే 20: సీఎస్‌పురం మండలం రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థాన తిరునాళ్ల సందర్భంగా ఐదు జిల్లాల స్థాయిలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండ లాగుడు పోటీల్లో బల్లికురవకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 1589 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 50 వేలు నగదును కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1551.3 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.40 వేలు, గిద్దలూరు మండలం కొండపేట కు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.30 వేలు పొందాయి.

అలాగే, పావులూరి వీరస్వామిచౌదరికి చెందిన ఎడ్లజత 1023అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు, నంద్యాల జిల్లా బేతంచర్ల గ్రామానికి చెందిన మేకల వెంత్రాయుడు ఎడ్లజత 927 అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. ముందుగా ఈ పోటీలను అంబాల చినవెంకటరెడ్డి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో బహుమతుల దాతలు నారా పెద్దాసిద్ధారెడ్డి, చిన సిద్ధారెడ్డి, బాల సిద్ధారెడ్డి, సిద్ధారెడ్డి, దేవస్థాన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.




బండ లాగుతున్న ఎడ్లు



కట్టలకు ఎక్కడపడితే అక్కడ గండ్లు.. కాల్వల లోపల పూడికలు.. షట్టర్‌లు దెబ్బతినిపోయి, తూములు పూడిపోయి, చుక్కనీరు చివరి వరకు వెళ్లాలంటే కష్టకాలమే. ప్రభుత్వం ఇస్తున్న చిల్లర విదిలింపులకు ఒక్క గండీ పూడ్చలేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. పనులకోసం నీటిపారుదల శాఖ కు మరమ్మతుల కోసం ఒక్క రూపాయి నిధులు ఇచ్చిన పాపాన పోలేదు. ఓ అండ్ ఎం నిదులే దిక్కు, అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాదు... వారికి తోచినంత, చేతికి వచ్చినంత... అన్న చందంగానే జరుగుతూ వచ్చింది.

- ఖరీఫ్ వచ్చేసింది... కాల్వల పనులేవీ!
- 2024-25 ఖరీఫ్ సీజన్‌కు నీటిపారుదల శాఖ సన్నద్ధత ఏదీ!
- ఐదేళ్లుగా రైతుల కష్టాలు వర్ణనాతీతం
- కాల్వల పనులు చేయడానికి ఓ అండ్ ఎం నిధులే దిక్కు
- వాటిలోనూ 80 శాతం పైగా నేతల జేబుల్లోకే..



కాల్వల గోడలు, తూములు వాలిపోయిన దృశ్యం



ప్రభుత్వం పనులు చేయకపోవటంతో సాగునీటి సంఘాల స్ఫూర్తితో రైతులే ఎక్స్‌కవేటర్‌తో కాల్వల పూడిక తీయించుకుంటున్న దృశ్యం

కాల్వలు.. కడగండ్లు

మళ్లీ 2024-25 ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. కాల్వలన్నీ పనుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. కానీ నిధుల మంజూరు ఊసేలేదు. ఎన్నికలు జరిగినా, పాలన విషయంలో ఆలస్యం కావటం కానీ, పట్టించుకోకుండా వదిలేయటం కానీ చేస్తే, ఒక సీజన్ పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అదే జరిగితే తిండిగింజలకూ కటకటలాడాల్సిందే. ఇవేమీ ఇప్పటి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవటంలేదు. కాలానుగుణంగా జరగాల్సిన పనులపై దృష్టిపెట్టిన పరిస్థితి లేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో వరి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఈ ఏడాదయినా సాగునీరు సక్రమంగా అందుతుందన్న నమ్మకం లేకుండా పోతోంది.

నీటి సంఘాలుంటే ప్రతి కాల్వపైనా అజమాయిషీ

గతంలో సాగునీటి సంఘాలున్నప్పుడు చాలావరకు సాగునీటి కష్టాలు తొలగిపోయాయి. అత్యవసర, సాధారణ మరమ్మతులను విభజించి, వచ్చిన నిధులతో కాల్వల పనులను రైతులే చేసుకోవటంతో వారి కష్టాలకు వారే పరిష్కారం చూసుకునేవారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు సాగునీటి సంఘాల కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. రైతులే నాయకులుగా, రైతులే ఓటర్లుగా మంచి వ్యక్తిని ఎన్నుకుని, వారి ద్వారానే పనులు చేయించుకునే విధంగా కొత్త విధానానికి అప్పట్లో శ్రీకారం చుట్టారు. దీనివల్ల రైతుల కష్టాలకు చాలావరకు ముగింపు దొరికినట్టయింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.73 లక్షల ఎకరాలు సాగవుతుంటే, ఇదంతా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉంది. వీటికి కొమ్మమూరు, పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలు, నిజాంపట్నం కాల్వల ద్వారా, వాటి పంట కాల్వల ద్వారా నీరందుతుంది. అయితే ప్రధాన కాల్వలే కాకుండా ప్రతి పంట కాల్వపైనా సాగునీటి సంఘాలకు అజమాయిషీ ఉండేది. ప్రతి అడుగు వదలకుండా రైతులు కాల్వలపై ఇబ్బందులను చెప్పేవారు కనుక మరమ్మతులు చేయటం కూడా తేలికయ్యేది. రైతులే పనులు చేయించుకుంటారు కనుక నిధుల దుర్వినియోగం విషయం అటుంచితే, ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేది. ఒకవేళ సంఘంలో ఎవరైనా దుర్వినియోగం చేసేందుకు కానీ, జేబులో వేసుకునేందుకు కానీ ప్రయత్నం చేస్తే మిగిలిన రైతులు నిలదీస్తారని ఎవరూ సాహసించేవారు కాదు. దీంతో కాల్వల కష్టాలు తీరటంతోపాటు ప్రతి ఎకరాకూ నీరందేది.

తెనాలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి కాల్వపై రైతుల భాగస్వామ్యంతో ఒక సంఘం.... ఆ కాల్వపై ఎక్కడ ఏమేం పనులు చెయ్యాలి? వాటిలో అత్యవసరమేంటనేది నిర్ణయించేది కూడా వాళ్లే. ఇక్కడ రాజకీయాలతో పనిలేదు. కేవలం రైతుల తీర్మానాలే ప్రభుత్వానికి శిరోదార్యం. నిధులు మంజూరు చేయ టం, దగ్గరుండి రైతులే ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయించుకోవటం వంటి మాటలు వింటుంటే ఎంత బాగుంది! ఇప్పుడు కాల్వలున్న దుస్థితిలో, వాటి ద్వారా సాగునీరు రాక, పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు పడ్డ అవస్థల తరుణంలో ఈ మాటలు కళ్లెదుట కనిపిస్తుంటే నిజంగా సంతోషమే రైతుల ముఖంలో కనిపిస్తుంది. అయితే ఇవన్నీ ఒకప్పుడు రైతులు చూసినవే, స్వయంగా దగ్గరుండి పనులు చేయించుకున్నవే. కానీ ఈ ఐదేళ్లలో రైతుల కష్టాలు పట్టించుకునే నాథుడు లేడు. సాగునీటి సంఘాలుంటే వారి దోపిడీకి అడ్డుగా ఉంటుందనుకున్నారో! లేక నిధులు ఇవ్వలేని పరిస్థితుల్లో రైతులు నిలదీస్తారనుకున్నారో కానీ, జగన్ సర్కారు రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సాగునీటి సంఘాలకు నిర్దాక్షిణ్యంగా తీసేసింది. వాటి స్థానంలో వైసీపీ నాయకులే కాల్వల పనులుచేసే కాంట్రాక్టర్‌లయ్యారు. కాల్వల పనుల కోసం విదిలించే నాలుగు మెతుకులూ వారే తన్నుకుపోతే, చివరకు రైతులకు సాగునీటి కష్టాలు, కడగండ్లే మిగిలాయి. ఇప్పటికి ఐదు ఖరీఫ్, రబీ సీజన్‌ల నుంచి వీరి కష్టాలకు పరిష్కారమే లేకుండా పోయింది. ఒక్క ఎకరా ఎండినా ఊరుకునేది లేదని గెలిచిన మొదటి సంవత్సరం గొప్పగా హెచ్చరించిన ముఖ్యమంత్రి తర్వాత అసలు రైతుల కష్టాలనే పక్కనపెట్టి, వారికి రైతు భరోసా కేంద్రాలు, ఇతర కొత్త వసతుల కల్పన పేరుతో కొత్త కష్టాలను సృష్టించారు. అవికూడా వారికి దోపిడీ కేంద్రాలుగానే మిగిలిపోయాయి. దీంతో రైతుల కష్టాలకు అంతే లేకుండాపోయింది.



టీడీపీ ప్రభుత్వ కాలంలో ప్రతి కాల్వపైనా రైతులకోసం ఏర్పాటుచేసిన బోర్డ్

పనులు చేయకుండానే నిధులు మింగేసి!

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి కాల్వల మరమ్మతులు, అత్యవసర రిపేర్‌లను పూర్తి చేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత ఐదు సీజన్‌లుగా ఒక్కపనికూడా లేదు. దీనికి కారణం... నిధుల లేమి. ప్రభుత్వం రైతులకోసం కేటాయిస్తానన్న నిధుల మూటలు అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయ్యే చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతులకోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వ విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ సర్కారు వచ్చాక అవన్నీపోయి చివరకు ఓ అండ్ ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా నీటిపారుదల శాఖ రూ.100 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపితే, వాటిలో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల లోపే నిధులు మంజూరు చేశామనిపించేవారు. ఆ నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్న ప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్టు చూపించి చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. వీటిపై రైతులు ప్రశ్నించినా, ఎవరికైనా ఫిర్యాదు చేసినా వారిపై దౌర్జన్యాలు చేసిన సంఘటనలూ లేకపోలేదు. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు రూ.22కోట్లు ప్రభుత్వం ఓ అండ్ ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం అవచేశారు. అయితే ఒక్క కాల్వలోనూ తూటుకాడ నిర్మూలనకు మందులు పిచికారి చేసింది లేదు. ఇక పూడిక తీతంటారా! నీరు వదిలాక లోపల ఏముందనేది కనిపించేది కాదుకదా! ఏం చెప్పినా, ఎంత దోచేసినా అడిగే దిక్కే లేకపోవటంతో నిధులన్నీవారి జేబుల్లోకి, రైతుల కష్టాలు మాత్రం కన్నీటి రూపంలో పంటలను కాపాడుకునేందుకు ఏరులయ్యే పరిస్థితి. గత మూడు ఖరీఫ్ సీజన్‌లనుంచి అయితే మరీ దారుణంగా కాల్వల చివరి భూములకు నీరు అందక వేల ఎకరాలు బీళ్లుగా వదిలేసిన పరిస్థితి.

డెల్టా ఆధునికీకరణ..

డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు కాల్వపై రూ.400 కోట్ల విలువైన పనులు జరగనేలేదు. ఆ నిధులు అప్పట్లో మురిగిపోయాయి. అయితే తర్వాత కాల్వ కట్టలు ఛిద్రమైపోయి గండ్లు పడటం, పంటలు దెబ్బతినటం షరామామూలయింది. బాపట్ల ప్రాం తంలో భారీ గండిపడినప్పుడు ప్రభుత్వం నిధులు సరిపడా ఇవ్వలేకపోవటం, పనులు సరిగా జరగక ఏటా ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే సాగునటి సంఘాలు ఈ తరుణంలో ఉంటే, రైతులే దగ్గరుండి పనులు చేయించుకుంటారు కనుక కష్టాలకు చాలా వరకు చరమగీతం పాడేవారు. ఈ ప్రభుత్వ కాలంలో పనులు చేసేవారంతా రైతువారీ కాకపోవటంతో అంతా లాభాపేక్షతో దోచుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో రైతుల కష్టాలు మాత్రం ఈ ఖరీఫ్‌కు కూడా తీరని పరిస్థితి. మరో నెలలో 2024-25 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్ మొదలవుతుంటే, ఇంతవరకు కాల్వల విషయం పట్టించుకున్న నాధుడులేడు. చాలా కాల్వలపై అత్యవసర మరమ్మతులు ఎన్నో ప్రభు త్వం విడుదలచేసే నిధుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఎన్నికలతో సంబంధం లేకుండా ముందస్తుగా తీసుకోవలసిన నిర్ణయమైనా నీటిపారుదల శాఖ కూడా మమ్ముల్ని కదిపేవారులేరు. మాకు ఏ ఇబ్బంది లేదన్నట్టు రైతుల కష్టాలను వారివే వదిలేసి చోద్యం చూస్తున్నారు. రేపటి రోజున ప్ర భుత్వ మారితే మళ్లీ సాగునీటి సంఘాలు వస్తే మా కష్టాలు తీరతాయనేది రైతుల ఆశా భావం. అయితే ఇప్పుడు 2024-25 ఖరీఫ్ సీజన్ వచ్చేయటంతో నీటి సంఘాలు కాకపోయినా, కనీసం అధికారులయినా పనులు చేయించేందుకు ముందస్తు మేలుకొలుపు అవసరమే. గతేడాదిలా కాల్వలకు నీరొదిలే సమయంలో కాకుండా ముందుగా నిధులు అందితేనే పనులు కాస్తయినా జరిగేది. ఈ సీజన్‌కు కనీసం ఓ అండ్ ఎం నిధులయినా మంజూరు చేస్తేనే కాల్వల్లో నీరు పారేది. లేకుంటే సాగునీటి కష్టాలు ఏటా ఉన్నవాటికంటే మరింత జఠిలమైనట్టే. మరి అధికారులు దీనిపై వెంటనే దృష్టిపెడతారో! లేదో?



కెనాల్‌పై పనులు చేసే వారు లేక అధ్వానంగా కట్టలు

బాపట్లదే.. తొలి ఫలితం

- అద్దంకిలో అత్యధికంగా 21 రౌండ్లు
- జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 1510 పోలింగ్ స్టేషన్లు
- అత్యధికంగా అద్దంకిలో 298 కేంద్రాలు..
- అత్యల్పంగా బాపట్లలో 202
- ఏర్పాట్లపై దృష్టి పెట్టిన అధికారులు



బాపట్ల, మే20(ఆంధ్రజ్యోతి): కౌంటింగ్‌కు సంబం ధించి ఏర్పాట్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా వేగవంతం చేశారు. దీనిలో భాగంగా కౌంటింగ్‌ను పోలింగ్ స్టేషన్ల వారీగా రౌండ్‌కు 14 చొప్పున లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు ఇదేవిధంగా ఏర్పాట్లు చేస్తారు. జిల్లాలో 1510 పోలింగ్ స్టేషన్లు ఉండగా అత్యధికంగా అద్దంకిలో 298 ఉన్నాయి. తర్వాత స్థానాల్లో పర్చూరు 295, రేపల్లె 264, వేమూ రు 233, చీరాల 218, బాపట్లలో 202 పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ పరిధిలోని సంత నూతలపాడు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కూడా బాపట్ల ఇంజ నీరింగ్ కళాశాలలోనే జరగనుంది. కౌంటింగ్ ప్రక్రియ రోజు స్ట్రాంగ్ రూంలకు అనుసంధానంగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రక్రియలో యం త్రాంగం నిమగ్నమై ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తిచేసిన అధికారులు నియోజకవర్గాల వారీగా కేటాయింపు కార్యక్రమం మీద దృష్టిపెట్టారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా ఈసీ నుంచి కూడా సంబంధిత సాఫ్ట్‌వేర్ రానుందనేది సమాచారం. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి ఓట్లలెక్కింపులో భాగం గా 250 మంది సిబ్బంది సేవలను వాడు కోనున్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగా చూస్తే తొలి ఫలితం బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానిదే అవనుంది. ఇక్కడ అతి తక్కువగా 202 పోలింగ్ స్టేషన్లు మాత్రమే ఉండగా 14 రౌండ్లలోనే లెక్కింపు పూర్తి కానుంది. మలి ఫలి తం చీరాలది కానుంది. ఇక్కడ 218 కేంద్రాలు ఉండగా 16 రౌండ్లలో ఫలితం తేలనుంది. వేమూరులో 233 పో లింగ్ స్టేషన్లకుగాను 17 రౌండ్లు పూర్త య్యాక విజేత ఎవరో తేలనున్నారు. రేపల్లెలో 264 కేంద్రాల్లో పోలింగ్ జరగ్గా 19 రౌండ్లలో ఓట్లు లెక్కించి ఫలితం వెల్లడించనున్నారు. పర్చూరులో 295, అద్దంకిలో 298 కేంద్రాలలో ఓటింగ్ జరగ్గా ఈ రెండు చోట్ల 21 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో తుది ఫలితం ఈ రెండు చోట్ల వెల్లడి కానుంది.

దారి.. అధ్వానం

- తీరంలో రహదారులు గుంతలమయం
- నిత్యం ప్రమాదాలు
- దృష్టి సారించని అధికారులు



సింగుపాలెం అడ్డరోడ్డు సమీపంలో అధ్వానంగా ప్రధాన రహదారి

రేపల్లె, మే 20: తీర ప్రాంతంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా తయారై ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో ప్రధాన రహదారులపై భారీగా గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలిచి నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రేపల్లె నుంచి గంగడిపాలెం వెళ్ళే ప్రధాన ఆర్అండ్‌బి రహదారిలో నల్లూరిపాలెం, సింగుపాలెం, పోటుమెరక మధ్య భారీగా గుంతలు ఏర్పడ్డాయి. సగానికిపైగా రహదారి కోతలకు గురైంది. తుమ్మల మంచినీటి ఒవర్‌హెడ్ టాంక్ వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. మృత్యుంజయపాలెం నుంచి గంగడిపాలెం వెళ్ళే ప్రదాన రహదారి, గంగడిపాలెం నుంచి అడవిపాలెం మీదుగా రాజుకాల్వ వరకు ప్రదాన రహదారి దెబ్బతింది. బొబ్బర్లంక నుంచి గంగడిపాలెం వరకు రహదారి అంతా గుంతల మయంగా ఏర్పడి రోడ్డుకు ఇరువైపులా తుమ్మచెట్లు ఇరువైపులా భారీగా పెరిగాయి. నిజాంపట్నం మండలం మంత్రిపాలెం నుంచి అడవులదీవి వెళ్ళే రహదారి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిజాంపట్నం వెళ్ళే ప్రధాన రహదారి ఇసుకపల్ల సమీపం, గుడ్డికాయలంక, లాకుల వద్ద, సజ్జావారిపాలెం వెళ్ళే, పల్లపట్ల సమీపంలో, కొమరవోలు అడ్డరోడ్డు వద్ద, రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి ఛిద్రమైంది. రేపల్లె నుంచి పల్లెకూన వెళ్ళే రహదారి గుంతలవడి ప్రమాదభరితంగా మారింది. పెనుమూడి నుంచి ఓలేరు వెళ్ళే ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారవటంతో ఈ మధ్యకాలంలోనే లారీ, బైక్‌లు, కార్లు, ప్రమాదాలకు గురై ఐదుగురు మృతిచెందారు. అసలే వర్షాకాలం కావటంతో రహదారిపై వర్షపునీరు నిలవటంతో గుంతల లోతు తెలియక ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణీకులు రహదారులు మరమత్తులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలులేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృషిసారించి రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.



కోసుకుపోయిన అడవుల దీవి రహదారి

యంత్రాంగం.. ఇసుక బాట

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇసుక రీచ్‌లలో తనిఖీలు
- క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదిక
- ప్రతి వారం ఇదే రీతిన తనిఖీలు ఉంటాయని ప్రకటన

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సంబంధిత శాఖలకు నివేదిక ఇవ్వాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సోమవారం ఇసుక రీచ్‌ల బాట పట్టింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌తో పాటు ఆర్డీవోలు, తహసీల్దార్లతో పాటు పలు శాఖల యంత్రాంగం తనిఖీల్లో పాల్గొంది. జిల్లాలోని కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు, కొరిశపాడు, అద్దంకి మండలాల పరిధిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి వారం తనిఖీలను జరుగుతాయని, వాటి ఆధారంగా నివేదికను అందిస్తామని అధికారులు చెబుతున్నారు

అంతా దోచేశాక హడావిడి..

ఇసుక రీచ్‌ల తనిఖీల పేరిట జిల్లాలో జరుగుతున్న హడావిడి పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల పాటు సహజ వనరుల విధ్వంసం జరిగిందని, రాజకీయ ఒత్తిళ్లతో అటువైపు చూసే సాహసం కూడా అధికారులు చేయలేదని అంతా దోచేశాక ఇప్పుడు అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామనే ప్రకటనలు పట్ల జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని వైసీపీ పెద్దలు కోట్లు దండుకున్నారని, జరిగిన దోపిడీపై విచారణ చేయాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. సుప్రీంకోర్టుకు అధికారులు ఇచ్చే నివేదికలో ప్రస్తుతం రీచ్‌ల దగ్గర పరిస్థితితో పాటు గతంలో జరిగిన దోపిడీ, పర్యావరణానికి ఏ విధంగా హాని తలపెట్టారు అనే అంశాలను కూడా అందులో పొందుపర్చాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు

ఇసుక అక్రమ తవ్వకాలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కొల్లూరు: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుల్లంక, పెదలంక గ్రామాల పరిధిలోని జేపీ వెంచర్స్ జీసీకేసీ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలను కలెక్టర్, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. జువ్వలపాలెంలో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అని ఓ మత్స్యకారుని అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో జేపీ వెంచర్స్ ఇసుక తవ్వకాల నిమిత్తం గుర్తించిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరిగినట్లు మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ కలెక్టర్‌కు చెప్పారు. గాజుల్లంక వద్ద కృష్ణానదిలో జరిగిన ఇసుక తవ్వకాలను కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఈ పరిధిలో ఉంటే వీటిని అడ్డం పెట్టుకుని గాజుల్లంక నుంచి ఈపూరు వరక తవ్వకాలు జరిపారని కొందరు వ్యక్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఈపూరు వద్ద పెదలంక పరిధిలో జరిగిన తవ్వకాల వద్దకు కలెక్టర్ వెళ్లారు. అక్కడ తవ్వకాలు పూర్తి స్థాయిలో జరిగిన ప్రాంతానికి కలెక్టర్, ఎస్పీలను మైనింగ్, రెవెన్యూ అధికారులు తీసుకు వెళ్లకపోవడం గమనార్హం. ఆయా ప్రదేశాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై కేసులు నమోదు చేయాలని ఆర్డీవో హేలాషారోన్‌కు సూచించారు. పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి, ఆర్‌డబ్ల్యు ఎస్, ఇరిగేషన్, రివర్ కన్జర్వేషన్, పొల్యూషన్, తదితర శాఖల అధికారులతో పాటు తహసీల్దార్ పుల్లారావు, ఏఈ సురేష్, ఆర్ఐ త్రివేణి, పోలీసు శాఖ, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలు బయటపడకుండా..

కలెక్టర్, ఎస్పీల కళ్లకు ఇసుక అక్రమ తవ్వకాలు కనబడకుండా మైనింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. జువ్వలపాలెం, గాజుల్లంక ప్రాంతాల్లో అక్రమ తవ్వకాల అనవాళ్లు కనిపించకపోవడంతో ఆయా ప్రాంతాలను ఉన్నతాధికారులకు చూపించారు. ఈ క్రమంలో భారీగా ఇసుక అక్రమ తవ్వకాలు అరవింద వారధి దిగువన ఉన్న పెసర్లంక గ్రామ పరిధిలో జరిగాయని కలెక్టర్ దృష్టికి రావడంతో మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ కొంత కంగారుకు గురయ్యారు. కలెక్టర్ ఆ ప్రాంతంలోనూ పరిశీలన చేద్దామని చెప్పడంతో చేసేదేమీ లేకపోవడంతో ఇసుక తవ్వకాలు కనిపించని దారిలో వారిని తీసుకు వెళ్లారు. పెసర్లంక అరవింద వారధి వద్దకు తీసుకు వెళితే జీసీకేసీ ఆధ్వర్యంలో ఎటువంటి అనుమతులు లేని చోట పట్టా భూముల్లో సైతం గత మూడు నెలలుగా భారీ యంత్రాలతో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలు కలెక్టర్, ఎస్పీ దృష్టికి వచ్చేవని మైనింగ్ ఏడీపై స్థానికులు ఆరోపణలు గుప్పిస్తున్నారు.



జువ్వలపాలెం వద్ద అక్రమ ఇసుక తవ్వకాల గురించి మత్స్యకారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకల్ జిందాల్

హోమియో వైద్యం అందేదెప్పుడో..!

దొనకొండలో భవనం నిర్మించారు..
వైద్యశాల ఏర్పాటును మరిచారు
- వృథా అయిన ప్రజాధనం
- వైద్యుడులేక అలంకారప్రాయంగా మారిన వైనం


దొనకొండలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న హోమియో వైద్యశాల భవనం

దొనకొండ, మే 20: దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన హోమియో వైద్యశాల నిరుపయోగంగా మారింది. గత పదేళ్లుగా హోమియో వైద్యాధికారి లేక వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పదేళ్ల క్రితం ఆరోగ్యకేంద్రంలోనే హోమియో వైద్యశాలను ఒక గదిలో ఏర్పాటుచేసి డాక్టర్ కోట్ల వెస్లీ వైద్యుడిగా నియమితులయ్యారు. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి ఇంగ్లీషు మందుల వాడకం పట్ల నమ్మకం లేని ఎందరో సుదూర ప్రాంతాలకు చెందిన రోగులు సహితం ఇక్కడికి వచ్చేవారు. డాక్టర్ వెస్లీ హోమియో వైద్యం పట్ల మొగ్గు చూపుతూ ప్రతిరోజు అధికసంఖ్యలో ఓపీ నమోదు జరుగుతుండేది. డాక్టర్ వెస్లీ ఇక్కడినుంచి వెళ్లినతర్వాత హోమియో వైద్యం అందకుండా పోయింది. ఆయన వెళ్లిన తర్వాత అధికారులు లక్షల వ్యయంతో దొనకొండలో ప్రభుత్వ వైద్యశాల పక్కన హోమియో వైద్యశాల భవనం నిర్మించారేగాని నేటికి వైద్యుడి నియామకం జరపలేదు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన హోమియో వైద్యశాలలో ప్రస్తుతం నాడీపట్టే నాథుడేలేడు. హోమియో వైద్యం పట్ల అపారనమ్మకంతో దీర్ఘకాలిక వ్యాధులకు సహితం ఉపశమనం పొందిన ఎందరో రోగులు నేటికీ ఎర్రగొండపాలెంలో నివాసం ఉంటున్న హోమియో వైద్యుడు డాక్టర్ వెస్లీ వద్దకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. తరచూ మండల ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఇంగ్లీషు మందులు గిట్టనివారు హోమియో వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో హోమియో వైద్యశాలకు వైద్యుడు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిర్లక్ష్యవైఖరి విడనాడి దొనకొండలోని హోమియో వైద్యశాలకు డాక్టర్, సిబ్బంది నియామకం చేపట్టి ఈప్రాంత ప్రజలకు మెరుగైన హోమియో వైద్యసేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్ని అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేదు

- షేక్ రసూల్‌బాషా, దొనకొండ

దొనకొండలో నిరుపయోగంగా ఉన్న హోమియో వైద్యశాలకు డాక్టర్‌ను ఏర్పాటుచేసి వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చి విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదు. డాక్టర్ వెస్లీ ఉన్న సమయంలో రోజుకు దాదాపు వంద వరకు ఓపీలు వచ్చేవి. ఎందరో దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం పొందారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే హోమియో వైద్యశాల నిరుపయోగంగా మిగిలింది. అధికారులు, పాలకులు పట్టించుకొని హోమియో వైద్యశాల ఏర్పాటు చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు

తాళ్లూరు, మే 20 : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని కొర్రపాటివారిపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోటశేషయ్య తన గేదెలను తీసుకుని పొలంలో మేపకానికి వెళ్లాడు. సాయంత్రం వేళ వీచిన గాలులకు పొలంలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలు మేత మేస్తున్న రెండు గేదెలకు తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిని అదిలించబోయిన గేదెల యజ మాని శేషయ్య గాలికి వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి చేతికి, కాలికి స్వల్ప గాయాలయి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతి చెందిన రెండు గేదెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుంది. పొలంలో విద్యుత్తు తీగలు వదులుగా ఉండి, ప్రమాదాలు జరిగే అవకాశంఉందని విద్యుత్తుశాఖ అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శి స్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గేదెలు మృతి చెందాయని విమర్శిస్తున్నారు.

కిలో పొగాకు రూ.310


టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

కొండపి, మే 20 : కొండపి వేలం కేంద్రంలో మేలురకం పొగాకు అత్యధిక ధర కిలో రూ.310 పలికింది. సోమవారం ఎస్.ఎన్.కండ్రిగ, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 908 బేళ్లు వేలానికి తీసుకువచ్చారు. వాటిలో 850 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు.

టంగుటూరులో కిలో రూ.306

టంగుటూరు : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.306 లభించింది. సోమవారం కె.ఉప్పలపాడు రైతులకు చెందిన 395 బేళ్లను అనుమతించారు. ఇందులో 384 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 11 బేళ్లను తిరస్కరించారు.

సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామి

పొన్నలూరు (కొండపి), మే 20: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెన్నిపాడు సమీపంలోని సంగమేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి ఉన్నారు.

దాహం కేకలు

నగరంలో నీటి సమస్య మరింత తీవ్రం
తాగునీరు కోసం రోడ్డెక్కిన కొప్పోలు ప్రజలు
పదిరోజులుగా నీరు లేక నానా అగచాట్లు
ఒంగోలులో అస్తవ్యస్తంగా నీటి సరఫరా
శివారు కాలనీల్లో పరిస్థితి దారుణం


తాగునీరు అందించాలని రాస్తారోకో చేస్తున్న కొప్పోలు వాసులు

ఒంగోలు (కార్పొరేషన్), మే 20: పాలకుల నిర్లక్ష్యంతో ఒంగోలు నగరంలో నీటి కటకట నెలకొంది. జనం దాహార్తితో అల్లాడుతున్నారు. శివారు ప్రాంతాలకు సరఫరా అంతంతమాత్రంగా మారింది. బిందెడు నీటి కోసం బండెడు కష్టాలను నగరవాసులు అనుభవిస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతోనే నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. సరైన విధానం లేకపోవడంతో కొన్నిచోట్ల నాలుగురోజులకొకసారి, ఐదు రోజులకు ఇస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నగర జనాభా 3లక్షలకు చేరింది. కానీ అందుకు తగ్గట్లు తాగునీటి అవసరాల తీర్చేందుకు జలవనరుల ఏర్పాటు నేటికి నోచుకోలేదు. దీంతో నగరంలోనే కాకుండా ఇటీవల విలీనమైన గ్రామ పంచాయతీల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. మునిసిపాలిటీ ఏర్పడిన నాటి పైపులైన్లతోనే అధికారులు కాలం వెల్లబుచ్చుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు వందల సంఖ్యలో దర్శనమిచ్చే లీకులతో సగం నీరు రోడ్లపాలవుతున్నాయి. అయినా నగర పాలక ఇంజనీరింగ్ వ్యవస్థలో స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తాగునీటి కోసం కొప్పోలు గ్రామ ప్రజలు రోడ్డెక్కారు. పది రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహించారు. ఖాళీబిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలియజేశారు.

నగరంలో అస్తవ్యస్తంగా సరఫరా

గత కొద్ది రోజులుగా నగరంలో తాగునీరు సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గతంలో రెండు రోజులకొకసారి నీరు అందిస్తుండగా, ఇటీవల కాలంలో మూడురోజులకొకసారి సరఫరా చేస్తున్నారు. మోటార్లు పాడయ్యాయని, కరెంటు పోయిందని, పైపులైను లీకులు వచ్చాయని ఏదో ఒక కారణం చూపుతూ తాగునీటి సరఫరాలో వేళలు మార్చి వేశారు. అయితే తాగునీటి సరఫరాలో ఆలస్యంపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు రోజంతా తాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కొన్నిసార్లు నాలుగు రోజులకు, పనులు పూర్తికాకపోతే ఐదురోజులకు ఇస్తుండటం గమనార్హం.

శివారు కాలనీల్లో వేధిస్తున్న నీటి సమస్య

నగరంలో 50 శివారు కాలనీల్లో నీటి సమస్య వేధిస్తోంది. ఆ కాలనీలకు సరైన పైపులైన్ వ్యవస్థ లేదు. ప్రత్యేకించి వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ప్రాంతాల్లోనే తాగునీటి పైపులైన్లు అటుఇటు మార్చుచేశారు. శివారు కాలనీలను పట్టించుకోలేదు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ప్రైవేటు ట్యాంకర్లు ఆధారమయ్యాయి. అయితే రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు. ముందే వచ్చిన వేసవితో తాగు నీటి అవసరాలు పెరిగాయి. దీంతో కాలనీల్లో నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతున్నారు.

ట్యాంకర్ల సరఫరా ఇష్టారాజ్యం

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో హోదాకు తగ్గట్లు నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై మూలన పడి ఉన్నాయి. దీంతో 35 ప్రైవేటు ట్యాంకర్లే ఏళ్లతరబడి తాగునీరు సరఫరా చేస్తున్నాయి. కార్పొరేషన్‌లో ఉన్న శివారు ప్రాంతాలకు, పది పంచాయతీలకు ఆ ట్యాంకర్లతోనే రోజుకు రెండువందల ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారు. దాంతో అటు శివారు కాలనీలు, ఇటు గ్రామప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

నగరంలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మంచినీళ్ల కోసం మహిళలు కుస్తీలు పడుతున్నారు. బిందెడు నీటి కోసం ట్యాంకర్ల వద్ద బారులు తీరుతున్నారు. కొన్నిప్రాంతాల్లో వేళాపాలా లేని సరఫరాతో జనం జాగారం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజలను నీళ్ల కష్టాల్లోకి నెట్టేసింది. ఒంగోలు ప్రజల తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారంగా ఉన్న రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అంతంతమాత్రంగా ఉంది. రోజురోజుకు తాగునీటి అవసరాలు పెరుగుతున్నా కార్పొరేషన్ ఇంజనీరింగ్ వ్యవస్థ నిర్లక్ష్యం వీడటం లేదు. దీంతో నగరంలో జనం నీటి కోసం గగ్గోలు పెడుతూ రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన కొప్పోలు ప్రజలు

పది రోజులుగా తాగునీరు రాకపోవడంతో సోమవారం నగర పరిధిలోని కొప్పోలు ప్రజలు రోడ్డెక్కారు. ఒంగోలు-కొత్తపట్నం రోడ్డుపై ఖాళీబిందెలతో నిరసన తెలియజేశారు. ఊరంతా రోడ్డుపైకి చేరి, అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రెండుగంటలపాటు రోడ్డుపై నిరసన తెలిపిన వారు తాగునీటి సరఫరా అస్త్యవస్తంగా మారిందని మండిపడ్డారు. పదిరోజులుగా నీరు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులను అడిగితే రెండు మూడు రోజులకొకసారి ట్యాంకర్లు పంపుతారని, అది కూడా పలుకుబడి ఉన్నవారికేనని తెలిపారు. సాధారణ ప్రజల గోడు మాత్రం పట్టడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేయగా, వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు కొప్పోలు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా జనం ఆందోళనను విరమించలేదు. అయితే కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ గతంలో ఎప్పుడో వేసిన పైపులైను కారణంగా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కొత్త పైపులైను మార్చి పూర్తిస్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అందుకు అంగీకరించని కొప్పోలు గ్రామ ప్రజలు స్పష్టమైన హామీలు ఇవ్వాలని, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు తమ తప్పిదాన్ని అంగీకరించి, త్వరలోనే పనులు చేపడతామని తెలియజేయడంతో జనం ఆందోళన విరమించారు.

కొత్తగా చేతిపంపుల ఏర్పాటు ఊసే లేదు

నగరంలో చేతిపంపులు పనిచేయడం లేదు. ప్రతి వార్డులో పదుల సంఖ్యలోనే ఉండగా వాటి నిర్వహణ కోసం ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆయన పర్యవేక్షణలో మరో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే నిత్యం బోరింగ్ (చేతిపంపు)లు మరమ్మతులతో బిజీగా ఉన్నట్లు నటిస్తున్న యంత్రాంగం పట్టుమని బిందెడు నీళ్లు కూడా వాటి ద్వారా ఇవ్వలేకపోతున్నారు. ఒంగోలులోనే దాదాపు 850 చేతిపంపులు కార్పొరేషన్ రికార్డుల్లో ఉండగా, వాటి మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు కోసం బడ్జెట్‌లో రూ.10లక్షలు మంజూరవుతున్నాయి. కానీ అవి ఏమవుతున్నాయని అడిగితే చెప్పడం కష్టమేనని ఇంజనీరింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు.

కొండెక్కిన కూరగాయలు

బీన్స్ కిలో రూ.140, పచ్చిమిర్చి కిలో రూ.100
అన్నిరకాల ధరలు పెరుగుదల
సామాన్యుడు కొనడం కష్టమే


కూరగాలు కొంటున్నమహిళలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 20 : కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమోటాల ధరలు మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. అదే విధంగా అన్నిరకాల ధరలు పెరిగిపోయాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో ధరలు భగ్గుమంటుండటంతో చిరు వ్యాపారులు వ్యాపారం చేయడమే మాని వేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలులో ఏ రోజుకారోజు కూరలు కొనుగోలు చేయడం ఎక్కువ. తోపుడుబండ్లతో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. కొత్త మార్కెట్‌లోనే కిలో బీన్స్ రూ.150 పలుకుతుండగా, పచ్చిమిర్చి కిలో రూ.100 ఉంది. పెద్ద చిక్కుళ్లు కిలో రూ.100, క్యారెట్ కిలో రూ.80 పలుకుతోంది. టమోటాలు రూ.30 నుంచి రూ.35 పలుకుతుండగా రిటైల్‌గా కిలో రూ.40నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ఈ ధరల దెబ్బకు నిరంతరం మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద తోపుడు బండ్లపై విక్రయించే వ్యాపారులు గత రెండు రోజుల నుంచి తమ వ్యాపారాలను మానేశారు.

బీన్స్	: 150
పెద్దచిక్కుళ్లు	: 100.00
పచ్చిమిర్చి	: 100.00
క్యారెట్	: 80.00
దొండ	: 60.00
బంగాళదుంప	: 50.00
క్యాబేజి	: 50.00
గోరుచిక్కుళ్లు	: 50.00
బెండ	: 50.00
టమోటా	: 40.00
చామదుంప	: 50.00

సత్తా చాటిన బల్లికురవ ఎడ్లజత


బండ లాగుతున్న ఎడ్లు

సీఎస్‌పురం(పామూరు), మే 20: సీఎస్‌పురం మండలం రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థాన తిరునాళ్ల సందర్భంగా ఐదు జిల్లాల స్థాయిలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో బల్లికురవకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 1589 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 50 వేలు నగదును కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1551.3 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.40 వేలు, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.30 వేలు పొందాయి. అలాగే, పావూలూరి వీరస్వామిచౌదరికి చెందిన ఎడ్లజత 1023అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు, నంద్యాల జిల్లా బేతంచర్ల గ్రామానికి చెందిన మేకల వెంట్రాయుడు ఎడ్లజత 927 అడుగులు లాగగా ప్రోత్సహం కింద రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు. ముందుగా ఈ పోటీలను అంబాల చిన వెంకటరెడ్డి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో బహుమతుల దాతలు నారా పెద్దాసిద్ధారెడ్డి, చిన సిద్ధారెడ్డి, బాల సిద్ధారెడ్డి, సిద్ధారెడ్డి, దేవస్థాన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుతుపవనాలు

ఇప్పటికే జిల్లాలో వర్షాలు
తగ్గిన ఎండల తీవ్రత
పలుప్రాంతాల్లో జలకళ
పశ్చిమ ప్రాంతానికి ఊరట
ఓ మోస్తరు వర్షాలకు అవకాశం
ఈ ఏడాది సాగుకు భరోసా
దున్నకాలకు సిద్ధమవుతున్నరైతాంగం


పామూరులో కురుస్తున్న వర్షం

ఒంగోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సకాలంలో అది కూడా సాధారణం కన్నా కాస్తంత అధికంగానే కురిసే అవకాశం కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు సాధారణం కన్నా కాస్తంత ముందుగానే రావడం, ఇప్పటికే జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురవడం జిల్లా ప్రజల్లో, ప్రత్యేకించి రైతులలో ఆశలు కల్పిస్తున్నాయి. వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి రుతుపవనాలు ముందుగానే అండమాన్ తీరాన్ని తాకగా జూన్ 1 నాటికి కేరళలోకి తొలివారంలో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. దీనికితోడు మరో రెండు రోజులలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఆ తర్వాత తుఫాన్‌గా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ద్రోణి ప్రభావం ఉండటంతో జిల్లాలో గత వారంరోజులుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. అత్యధిక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. పశ్చిమాన మండు వేసవిలోనూ జలకళ కనిపిస్తోంది. భైరవకోన జలపాతం నీటితో కనువిందు చేస్తుండగా గుండ్లకమ్మలోకి నీటి ప్రవాహం వస్తోంది. తాజా వర్షాలతో గిద్దలూరు నియోజకవర్గంలోని నెమలిగుండ్ల రిజర్వాయర్‌కు కూడా నీరు చేరుతుండగా తూర్పు, పశ్చిమ తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ వాగులు, వంకలు, కుంటల్లోకి నీరు చేరి వేసవి వేళ పశువులు, ఇతరత్రా వాటికి ఊరట లభించింది.

చల్లబడ్డ వాతావరణం

ఇదిలా ఉండగా వారం క్రితం వరకు తీవ్ర ఎండలతో మండిపోయిన జిల్లా ప్రజలకు తాజా వాతావరణ పరిస్థితి కొంతమేర ఊరట కలిగిస్తోంది. వారం క్రితం వరకు పశ్చిమాన 43 నుంచి 46 డిగ్రీలు, తూర్పుప్రాంతంలో 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ప్రస్తుతం ఎక్కడ 40 కూడా లేదు. కొద్దిచోట్ల 37 నుంచి 39 డిగ్రీలు ఉంటుండగా అధిక ప్రాంతాల్లో మిట్టమధ్యాహ్నం కూడా 35 నుంచి 37 డిగ్రీలలోపుగానే ఉంటున్నాయి. అలా ఉష్ణోగ్రతలు తగ్గడం, పలుచోట్ల ఒక మోస్తరు వర్షాలు పడుతుండటం, వచ్చే నెల రెండవ వారంలోపు రుతుపవనాలు వచ్చి వర్షాలు సాధారణంగా పడే అవకాశం వంటి సంకేతాలతో ఈ ఏడాది సాగుపై భరోసా కలుగుతోంది. అదేవిధంగా రెతులు దున్నకాలకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 25 నుంచి రోహిణీ కార్తె రానుండగా నెలాఖరులో మరోసారి ఎండల తీవ్రత ఉండే అవకాశం ఉంది. అయితే వాతావరణ మార్పుతో జల్లులు పడి ఆ తీవ్రత అంతగా ఉండకపోవచ్చని సమాచారం.

అప్రమత్తమైన పోలీసు!

ప్రజలలో అవగాహనకు మాక్ డ్రిల్
ముఖ్యమైన ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
రాత్రుళ్లు పలుప్రాంతాల్లో పల్లెనిద్ర

ఒంగోలు(క్రైం), మే 20: జిల్లా పోలీసు యంత్రాగం అప్రమత్తమైంది. ఎన్నికల అనంతరం, కౌంటింగ్ తర్వాత ఎలాంటి అవాంచనీయ సంఘటనల జరగకుండా ఉండేందుకు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే శాఖలోని కిందిస్థాయి పోలీసు అధికారులను అలర్ట్ చేశారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి అనే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. అలరిమూకల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం ఒంగోలులో, సోమవారం కనిగిరిలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్

అసాంఘిక శక్తులను అరికట్టడానికి కార్డన్ సెర్చ్ పేరుతో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తిరుగుతున్న బైకులు 193, ఒక ఆటోను సీజ్ చేశారు. సింగరాయకొండ, ఒంగోలు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, పొదిలి, త్రిపురాతకం, పీసీపల్లి, సీఎస్‌పురం, మద్దిపాడు, మార్కాపురం, కంభం, గిద్దలూరు, కొమరోలు, పుల్లలచెరువు ప్రాంతాలలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో అనుమానితుల ఇళ్లను సోదాలు చేస్తున్నారు. ఇంకా పాత నేరస్థుల కదలికల గురించి ఆరా తీస్తున్నారు. పేలుడు పదార్థాలు ఏమైనా నిల్వ ఉంచారా అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు.



పోలీసు అధికార్ల పల్లెనిద్ర

పోలీసు అధికారులు ప్రతిరోజు ఒక గ్రామంలో నిద్రపోయే విధంగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలను ఎంచుకొని అక్కడ రాత్రులు పోలీసులు బస చేస్తున్నారు. అక్కడ పరిస్థితులను తెలుసుకోవడంతోపాటుగా గ్రామాల్లోని ప్రజలకు శాంతిభద్రతల విషయంలో భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆలోచింపజేస్తున్న మాక్‌డ్రిల్

పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించడంతోపాటుగా అసాంఘిక శక్తుల భరతం పడతామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదివారం ఒంగోలులో, సోమవారం కనిగిరిలో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించారు. అల్లర్లు సృష్టిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. వాటర్‌క్యాన్ల ద్వారా అల్లరి మూకలను అణిచివేయడం, టియర్ గ్యాస్ వదలి గుంపులను చెదరగొట్టడం, అవసరమైతే కాల్పులు ఎలా జరుపుతారో అనేది ప్రజలకు చూపిస్తు మాక్‌డ్రిల్ చేస్తున్నారు.

కనిగిరిలో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

అక్కడ ప్రమాదం జరిగితే అంతే సంగతులు..!

» తరచూ ఘటనలు

» ప్రాణాలతో బయటపడ్డ వారు తక్కువ మందే

అద్దంకి, మే 20 : నామ్ రోడ్డులో పలు చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలో కలిసినట్లే అనే భావన వాహనచోదకులలో నెలకొంది. ప్రధానంగా అద్దంకి మండలం చక్రాయపాలెం - శాంతినగర్ మధ్య ప్రమాదకర మలుపు ఉంది. భవనాసి చెరువు నిర్మాణం జరగకముందు (సుమారు 1916కి ముందు) నర్సారావుపేట రోడ్డు (ప్రస్తుతం నామ్ రోడ్డు) అద్దంకి నుంచి శింగరకొండ సమీపంలో గుండా భవనాసి చెరువు మధ్యలో గుండా ఉండేది. భవనాసి చెరువు నిర్మాణంతో గతంలో ఉన్న రోడ్డు పూర్తిగా ముంపునకు గురై చెరువు మధ్యలో గుండా ఏర్పడింది. దీంతో కొండచుట్టూ తిప్పి గోపాలపురం మీదుగా భవనాసి కట్ట కిందగా చక్రాయపాలెం మీదుగా శ్మశానం వద్ద పాత రోడ్డులో కలిసే విధంగా ఏర్పాటు చేశారు. అనంతరం నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో కూడా కొంత మేర అలైన్‌మెంట్ మార్పు చేసి అభివృద్ధి చేశారు. దీంతో



నామ్ రోడ్డులో చక్రాయపాలెం వద్ద మలుపులో బోల్తా పడిన కారు (ఫైల్)

చక్రాయపాలెం శ్మశానం సమీపంలో ఉన్న మలుపు మాత్రం అదే విధంగా ఉంచి రోడ్డు నిర్మాణం చేశారు. నామ్ రోడ్డు నిర్మాణం చేయక ముందు నుంచే చక్రాయపాలెం సమీపంలోని మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఈ క్రమంలో దశాబ్దన్నర కిందట జరిగిన ఆటో ప్రమాదంలో గోవాడకు చెందిన 8 మంది మృతి చెందారు. అనంతరం మరోసారి జరిగిన ప్రమాదంలో అద్దంకి పట్టణానికి చెందిన 4గురు మృత్యుఒడికి చేరారు. ఇలా తరచూ ప్రమాదాలు జరగడం వాహనచోదకులు మృతి చెందడం జరుగుతూనే ఉంది. దీనికి ప్రధాన కారణం మలుపు ప్రమాదకరంగా ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు కాక రోడ్డు మార్జిన్‌లో గుండా పొలాలకు దూసుకు పోయి ప్రమాదాలకు గురవుతున్నాయి. నామ్ రోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు ఇతర ప్రాంతాలకు చెందిన కొత్తవారు ఉండడంతో ప్రమాదకర మలుపును గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు ప్రమాదకర మలుపునకు ముందు వాహనచోదకులు గుర్తించే విధంగా హెచ్చరిక బోర్డులు నామమాత్రంగా ఉండడంతో గుర్తించలేకపోతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదం జరిగితే వాహనచోదకులతో పాటు అందులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలతో బయటపడడం కష్టమేనన్న అభిప్రాయం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపును ముందే వాహనచోదకులు గుర్తించే విధంగా హెచ్చరిక బోర్డులు ఎక్కువగా ఏర్పాటు చేయాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

శ్రీ భీమలింగేశ్వరస్వామి వార్షికోత్సవాలు

23 వరకూ ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

పంగులూరు, మే 20 : మండల కేంద్రమైన పంగులూరులో గల ప్రసిద్ధ శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 వరకు జరుగనున్నాయి. ఈ వేడుకలు 20వ తేదీ సాయంత్రం నుంచి ప్రారంభంకాగా, వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా ఆలయంలోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ స్థాపన, మృత్సంగ్రహణ, అంకురారోపణ, వాస్తు పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. 21 మంగళవారం ఉదయం 7 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, సాయంత్రం 6 గంటల నుండి ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, రాయబారం, స్వామివారి దివ్య కల్యాణోత్సవం జరుగనున్నాయి.

22న పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం

శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా 22వ తేదీ పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 22వ తేదీన ఉదయం 6 గంటలకు నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటల నుంచి శ్రీ అవధూతేంద్ర భక్తమండలి వారిచే ఏకాహ కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు బలిహరణ కార్యక్రమాలు జరుగనున్నాయి. అనంతరం శ్రీదాత భారతీయ జానపద కళాక్షేత్రం అద్దంకి వారిచే కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి బలిహరణ, వసంత సేవ త్రిశూల స్నానం, పూర్ణాహుతి కార్యక్రమం జరుగనుండగా సాయంత్రం 7 గంటలకు ధ్వజారోహణ, మౌనబలి, ఏకాంత సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాలను బ్రహ్మశ్రీ శైవాగమ వేద పండితులు పేటేటి ఉదయభాస్కరశర్మ నిర్వహించనున్నట్లు తెలిపారు.

23న అన్నదానం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 23వ తేదీ 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

28న నాంచారమ్మ తిరునాళ్ల

పర్చూరు, మే 20 : పర్చూరు గ్రామదేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల ఈనెల 28న జరుగుతుందని ఆలయ వంశపారంపర్య అర్చకులు సోమవారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున శిడిమహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు

నేడు పూనూరులో స్వామివార్ల కల్యాణోత్సవం

యద్దనపూడి, (మార్టూరు) మే 20 : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి త్రిపురసుందరీ సమేత త్రిపురాంతక స్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామిల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ బీ ఆంజనేయప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి అమ్మవారు అయ్యవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్వామివారి రథోత్సవం, గురువారం వసంతోత్సవ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. .

కౌంటింగ్ రోజు జాగ్రత్తలు పాటించండి



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐలు

చీరాలటౌన్, మే 20 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సమయంలో ఎక్కడా ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా జాగ్రత్తలు పాటించాలని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేటపాలెం, రామాపురం ప్రాంతాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ హింసాత్మక ప్రదేశాలను ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, శివకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన బల్లికురవ ఎడ్ల జత

సీఎస్‌పురం(పామూరు), మే 20: సీఎస్‌పురం మండలం రామా పురం గ్రామంలో శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థాన తిరునాళ్ల సం దర్భంగా ఐదు జిల్లాల స్థాయిలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండ లాగుడు పోటీల్లో బల్లికురవకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. బల్లికురవ మండలం పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 1589 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 50 వేలు నగదును కైవసం చేసుకున్నాయి

గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాలపై పరిశీలన

అద్దంకి, మే 20 : ఇసుక అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఇరువైపులా జరిగిన ఇసుక తవ్వకాలను, మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో జరిగిన ఇసుక తవ్వకాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మహబూబ్ సుభాని తదితరులు ఉన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జిందాల్

మేదరమెట్ల, మే 20 : ఇసుకను అక్రమంగా తవ్వడం, తరలించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసులను కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. సోమవారం అనమనమూరు వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్, మైనింగ్ ఏడీ రాజేష్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో డ్రెడ్జింగ్ చేసి నిల్వ చేసిన ఇసుక కువ్వలను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఎక్కడెక్కడ తవ్వకాలు జరిగాయని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ ముంపులో రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు నిబంధనలు మేరకు ఇసుక తవ్వకాలు జరపలేదని విషయాన్ని ఆయన గుర్తించారు. తమ్మవరం వద్ద ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రిజర్వాయర్ నుంచి నీరు అందించే కాలువను పూడ్చి రోడ్డు నిర్మించడంపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలో రీచ్ లేని చోట ఎక్కడైన ఇసుక అక్రమ తవ్వకాలు జరపకుండా పోలీసులతో కలిపి టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అద్దంకి, కొరిశపాడు తహసీల్దార్‌లను ఆ యన ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో లోపలకు వెళ్లి డ్రెడ్జింగ్ చేసిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి, బాపట్ల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, రేణంగివరం ఎస్ఐ తిరుపతిరావు, కొరిశపాడు తహసీల్దార్ సుశీల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చీరాల పరిధిలోని లాడ్జిలు, కల్యాణ మండపాలు, రిసార్ట్స్‌లలో పోలీసుల ముమ్మర తనిఖీలు



లాడ్జిలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ శేషగిరిరావు

చీరాలటౌన్, మే 20 : ఎన్నికల కౌంటింగ్ సమయం ఆసన్నమవుతుండడంతో చీరాల పోలీసులు అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల పట్టణం, సముద్రతీర ప్రాంతాల్లోని లాడ్జిలు, రిసార్ట్స్, కల్యాణ మండపాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని అనుమానితుల వివరాలు సేకరించారు. అంతేకాకుండా రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే తనిఖీ సమయంలో వ్యక్తుల వివరాలతో పాటు గతంలో ఏదైనా కేసుల్లో వీరి ప్రాధాన్యతపై కూడా ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవిధమైన తనిఖీలు నిత్యం ఉంటాయని చెప్పారు. కావున నేర నియంత్రణకు ప్రయత్నిస్తే చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. అనుమానితుల్ని గుర్తిస్తే 100, 112 నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. తనిఖీలలో వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఆయా స్టేషన్‌ల పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

పెదనక్కలపాలెంలో డీఎస్పీ విచారణ

ఇంకొల్లు, మే 20 : మండలంలోని పెదనక్కలపాలెంలో ఎన్నికల రోజున జరిగిన ఘటనపై ఇరువర్గాలు ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పెదనక్కలపాలెం గ్రామంలో విచారణ చేసారు. ఇరువర్గాలతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఇంకొల్లు ఎస్ఐ మల్లికార్జునరావు ఉన్నారు.



బైకును అందజేస్తున్న టీడీపీ నాయకులు

దివ్యాంగుడికి బైకును అందజేసిన గొట్టిపాటి

బల్లికురవ, మే 20 : మండలంలోని వల్లాపల్లి ముస్లింకాలనీకి చెందిన పూర్తి వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుడు షేక్ జాన్‌బాషాకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మూడుచక్రాల బైకును సోమవారం గ్రామ టీడీపీ నేతల ద్వారా అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో వల్లాపల్లి ముస్లిం కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే రవికుమార్‌కు దివ్యాంగుడు జాన్‌బాషా కలిశారు. ఆయనను చూసిన ఎమ్మెల్యే బైకు ఇస్తానని, ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, ఎన్నికలు ముగిశాక ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు టీడీపీ గ్రామ నేతల ద్వారా బైకును జాన్‌బాషాకు అందజేశారు. టీడీపీ నేత చింతల అమరనాథ్ బైకుకు ఇన్సూరెన్స్, ట్యాక్స్‌ను కట్టి కొంత సహకారం అందజేశారు. కార్యక్రమంలో నేతలు పరుసు ప్రసాద్, పత్తిపాటి వెంకట్రావు, షేక్ అల్లాఉద్దీన్, మందా వీరాంజనేయులు పాల్గొన్నారు.

మత్స్యకారుడు మృతి

రామాపురం(చీరాలటౌన్), మే 20 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి మత్స్యకారుడు దుర్మరణం చెందాడు. ఈసంఘటన సోమవారం రాత్రి వాడరేవు - రామాపురం రోడ్డులో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం ఊటుకూరి సబ్బయ్య పాలెంకు చెందిన ఊటుకూరి బాలాజీ (55) మత్స్యకారుడు. ఇతను ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ వాహనం అదుపుతప్పి బోల్తా పడి మృతి చెందారు. ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బంగారు నగల పర్సు చోరీ

ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన

అద్దంకి, మే 20 : ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికురాలి వద్ద బంగారం వస్తువులు ఉన్న పర్సు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన చల్లా భాను ఓటు వేసేందుకు వచ్చి సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు అద్దంకి బస్టాండ్‌కు వచ్చారు. ఉదయం 10-30 గంటలకు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కిన తరువాత సంచి పరిశీలించగా బంగారు నగలు ఉన్న పర్సు కనిపించలేదు. సుమారు రూ.1.40 లక్షల విలువైన నగలు చోరీకి గురైనట్లు ప్రయాణికురాలు భాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా చోరీపై కేసు

పుల్లాయిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పుల్లాయిపాలెం ఓ బూత్‌లో సీసీ కెమెరా చోరీకి గురైంది. దీంతో సచివాలయ మహిళ పోలీస్ ధనలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలరు

» ప్రకాశం పంతులు మునిమనవరాలు

» టంగుటూరికి ఘనంగా నివాళి



టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రకాశం మిత్రమండలి సభ్యులు

అద్దంకిటౌన్, మే 20 : విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనవరాలు సుభాషిణి అన్నారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి హాజరయ్యారు. ముందుగా బంగ్లారోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను పలువురు సభ్యులు కొనియడారు. అనంతరం శ్రీనివాస కల్యాణ మండపంలో అద్దంకి మండలంలో పదివ తరగతిలో 550కి పైగా మార్కులు వచ్చిన విద్యార్థినీవిద్యార్థులకు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె ఆకాక్షించారు. ఊటుకూరి కృష్ణసుభాన్, రావూరి రంగయ్య సౌజన్యంతో 31 మంది విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. అ లాగే మిగిలనవారికి బహుమతులను, వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ క్రమంలో ఆత్మీయ అతిథిగా ఉటుకూరి ఉమ అన్నపూర్ణ, వీరవల్లి రుద్రయ్య, దివాకర్ దత్తు, జ్యోతిష్మతి, మహమ్మద్ రఫీ, ఇలపావులూరి శేషతల్పసాయి, కోశాధికారి ఉటూకూరి రామకోటేశ్వరావు, తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తరగతులను నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు

వేసవి శిక్షణతో విజ్ఞానం

బల్లికురవ. మే 20 : వేసవిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియెగం చేసుకోవాలని బల్లికురవ శాఖ గ్రంథ పాలకుడు అడ్డగడ్డ రమేష్‌బాబు కోరారు. సోమవారం బల్లికురవ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను యేఏన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పాఠశాలలు తెరిచే వరకు విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేలా ప్రతి రోజూ కథల పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించటం చేస్తున్నామని, అలాగే క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లూజు విక్రయాలు చేయొద్దు

పెట్రోల్ బంక్ యజమానులకు నోటీసులు

మార్టూరు, మే 20 : వాహనదారులకు ఖాళీ క్యానుల్లో, ఖాళీ బాటిల్లో లూజుగా పెట్రోల్, డీజిల్‌ను పోయవద్దని మండలంలోని పెట్రోలు బంకు యజమానులకు సోమవారం నోటీసులను జారీ చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు లూజు విక్రయాలు చేయొద్దని కేవలం వాహనాల్లో మాత్రమే వాటిని పోయాలని, తదుపరి ఉత్తర్యులు వచ్చే వరకు పెట్రోలు బంకుల యజమానులు సహకరించాలని రాజశేఖర్ రెడ్డి కోరారు.

వృద్ధురాలిపై దాడి

వ్యక్తిగత వివాదాలే కారణం



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

చీరాలటౌన్, మే 20 : వ్యక్తిగత వివాదాలతో వృద్ధురాలిపై పలువురు తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన సోమవారం ఇంకొల్లు పరిధిలోని ఇందిర కాలనీలో చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాల ప్రకారం కాలనీకు చెందిన 62 సంవత్సరాల పాలపర్తి రాణి ప్రమీళకు అదే ప్రాంతానికి చెందిన జేమ్స్, చంద్, మోజెస్ ఇరుగు పొరుగులు కావడంతో గతకొంత కాలంగా వ్యక్తిగత వివాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉదయం సుమారు ఏడుగంటల సమయంలో ఇంట్లోకి చొరబడి తీవ్రంగా దాడిచేసి గా యపరిచారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలి కుడిచేయి విరిగిపోయింది. దీంతో కు టుంబ సభ్యులు ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మారిన ఎఫ్ఐఆర్ కాపీ

» హాస్పిటల్‌లో బాధితురాలి ఆవేదన

» వాస్తవం తెలుసుకుని తిరిగి వెళ్లిన వైనం



రోదిస్తున్న శైలజ

చీరాలటౌన్, మే 20 : దాడిలో గాయపడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ మారిందని వివాహిత చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద కొద్దిసేపు ఆవేదన చెందారు. వివరాల్లోకి వెళితే కొత్తపట్నంకు చెందిన సలిశం శైలజకు ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన ఆంజనేయులుతో సుమారు 13 ఏళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. భర్త అమాయకుడు కావడంతో ఈమె కుట్టు మిషన్ కుడుతోంది. అయితే అత్త పద్మావతి, మామ సూర్యనారాయణ పదేపదే గొడవలు పెట్టుకుంటున్నారు. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. ఈ క్రమంలో గత మంగళవారం శైలజపై కుట్టు మిషన్ పరికరంతో తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. అప్పుడు శైలజ తలకు తీవ్ర రక్త గాయమైంది. దీంతో స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేసిన వైద్యుల ఆమెకు రక్తం తక్కువగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించి నాలుగు రోజులు చికత్స అందించారు. ఇదిలావుండగా చీరాల ఏరియా హాస్పిటల్‌లో చేరిన సమయంలో అక్కడి అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కానీ ఒంగోలు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఇంకొల్లు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కాపీ మారిందని, నీపైనే కేసు నమోదు అయినట్లు స్థానికులు చెప్పారు. దీంతో అవగాహన లేని శైలజ చీరాల ఏరియా హాస్పిటల్ వద్దకు బంధువులతో చేరి రోదించింది. కానీ అవుట్‌పోస్ట్ పోలీసులు ఇంకొల్లు పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకోగా శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకే అత్త, మామలపై కేసు నమోదైంది. దీంతో వాస్తవం తెలుసుకున్న అమె అక్కడి నుంచి విరమించింది.

గ్రానైట్ ముడిరాయి లారీల పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ ముడిరాయి లారీలు

బల్లికురవ. మే 20 : పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు గ్రానైట్ ముడిరాయి లారీలను సోమవారం గుంటూరు విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు పట్టుకొన్నారు. బల్లికురవ గ్రానైట్ క్వారీల నుంచి మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న ముడిరాయి లారీలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వెంటనే లారీలపై కేసు నమోదు చేసి వెంటనే బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

నాడు-నేడు పెండింగ్ పనులపై సమీక్ష

మార్టూరు, మే 20 : నాడు - నేడు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం నాలుగు మండలాల సీఆర్‌పీలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా ప్రతినిధి ఏఎల్ఎస్‌వో సాగర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు, ఇసుక కొరత, స్కూళ్లల్లో సివిల్ పనులు తదితర అంశాలపై ఆయన సీఆర్‌పీలతో చర్చించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి, సంతమాగులూరు మండలాలకు చెందిన సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఆదివారం రాత్రి కిడ్నాప్ అయిన బాలుడు ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ ఆంధ్రకేసరినగర్‌కు చెందిన మూకిరి నయోమి స్టూవర్టుపురానికి చెందిన వ్యాపారి వద్ద కొంత నగదు బాకీ తీసుకుంది. తిరిగి చెల్లించే క్రమంలో ఆలస్యం కావడంతో వ్యాపారి ఆమె మనవడు పాల్సన్‌ను మరో ఇద్దరి సహకారంతో కిడ్నాప్ చేశారు. అయితే విషయం తెలుసుకున్న ఈపూరుపాలెం పోలీసులు రంగంలోకి దిగారు. తమదైన శైలిలో వ్యాపారితో ఫోన్‌లో మాట్లాడగా సోమవారం మధ్యాహ్నానికి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే బాకీ తీసుకున్న వారికి గట్టిగా మందలించారు.





జల సంక్షోభం!


భానుడు భగ్గుమంటున్నాడు.. పొయ్యి మీద పెట్టిన పెనంలా జిల్లా మండిపోతోంది. ఉక్క పోతతో జిల్లాప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో జల సంక్షోభం ఏర్పడింది. ప్రధాన నీటి వనరులయిన సోమశిల, కండలేరు, రాళ్లపాడు కలిగిరి రిజర్వాయర్లలోని నీటిమట్టాలు కనిష్ఠానికి పడిపోయాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తడారి నెర్రెలిచ్చిన నేలకు చాలడం లేదు. ఈక్రమంలో గతానికి భిన్నంగా జిల్లాలో రెండో పంటకు విరామం ప్రకటించి, బోర్ల కింద ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఇరిగేషన్ యంత్రాంగం ప్రకటించింది. గతేడాది ఆశించిన రీతిలో వర్షాలు కురవక పోవడం, శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రాకపోవడం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టకపోవడమే నీటి ఇబ్బందులకు కారణాలు అయ్యాయి.

జిల్లాలోని ప్రధాన జలవనరుల్లో నీటినిల్వ (టీఎంసీలలో)

జలవనరు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
సోమశిల	77.988	7.691
కండలేరు	68	6
రాళ్లపాడు	1.05	0.4
కనిగిరి	3.45	0.4
గండిపాళెం	1.88	0.205

- కనిష్ఠ మట్టానికి సోమశిల, కండలేరు డ్యాంలు
- రెండో పంట కింద ఆరుతడి పైర్ల సాగు
- వాటికీ తప్పని నీటి ఇబ్బందులు
- ముందస్తు ప్రణాళిక లేకనే ఈ దుస్థితి

అనంతసాగరం, మే 20 : సోమశిల జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు. గతేడాది ఈ సమయానికి 30 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ప్రస్తుతం 7.691 టీఎంసీలకు పడిపోయింది. సహజంగా సోమశిల డ్యామ్ పరిధిలో నీటి లభ్యతను బట్టి మొదటి పంటకు నవంబరులో, రెండో పంట కింద ఏప్రిల్ 15 నుంచి నీరు ఇవ్వాలి. అయితే, ఈఏడాది మొదటి పంట అవసరాలకు నీటి కేటాయింపులు చేసి వరిసాగుకు చర్యలు చేపట్టారు. ఇక రెండో పంటకు వచ్చేసరికి నీరు లేక సాగుకు విరామం ప్రకటించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమశిల జలాశయంలో నీటినిల్వ కనిష్ఠానికి పడిపోయింది. కేవలం తాగునీటి అవసరాలకు వినియోగించుకొనే పరిస్థితి ఉండగా, జూన్‌లో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంటే నీటి ఇబ్బందులు జఠిలమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఎండలు మండి పోతుండటం, చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోవడంతో ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలు ప్రశ్నార్థకంగా మిగిలాయి. పశువులకు నీరు దొరక్క పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల గ్రాసం కూడా దొరక్క మూగజీవాలను అమ్ముకునే పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. కాగా, కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాలు కురవకపోతే మంచినీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. రాళ్లపాడు రిజర్వాయర్ పూర్తిస్థామర్థ్యం 1.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.4 టీఎంసీల నీరు మాత్రమే ఉంది.



అనంతసాగరం : కనిష్ఠ మట్టానికి చేరుకున్న సోమశిల జలాశయం

● ఆరుతడి పంటల సాగుకు సూచన

నీటి ఇబ్బందుల కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ఈ సీజన్‌లో ఆరుతడి పంటలైన జొన్న, సజ్జ, మొక్క జొన్న, మినుము, అలసంద, వేరుశనగ, నువ్వులు, పెసర, నువ్వు తదితర పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈపంటలకు నీటి ఖర్చు 5 నుంచి 6 రెట్లు తక్కువగా ఉంటుందని, సాగు ఖర్చులు కూడా తక్కువని, ఆదాయం మాత్రం వరిపైరుకి సమానంగా కానీ, అంతకంటే ఎక్కువగా వచ్చే వీలుందని అధికారులు తెలియచేశారు. అయితే సాగుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా నీట ఇబ్బందులపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కలిగించాల్సి ఉంది.



ఉదయగిరి రూరల్ : గండిపాళెం రిజర్వాయర్‌లో క్లస్టర్ గేటుకు దిగువన ఉన్న నీరు

డెల్టాలో ప్రత్యామ్నాయం లేదా!?

- రబీ అనంతరం బీళ్లుగా పొలాలు
- ఎంఎస్‌పీ నిర్ధారణపై మీనమేషాలు
- రైతుల అభివృద్ధిని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అల్లూరు : డెల్టాలో వరికి ప్రత్యామ్నాయ పంటలు లేనట్టేనా..? ఈ ప్రశ్న ప్రతి రైతులోనూ మెదలుతోంది. గతంలో వరిసాగు చేసి ఘోరంగా దెబ్బతిన్న రైతులు ప్రస్తుతం రెండు పంటల తరువాత కోలుకుంటున్నారు. అయితే ప్రత్యామ్నాయ పంటలు వేసే అవకాశం లేక... ఒకప్పుడు సోమశిల ఆయకట్టు పరిధిలో రెండోకారు పంటకు సాగునీటి కోసం రైతులు ధర్నాలు చేపట్టారు. ఈ ఏడాది జలాశయాలు అడుగంటడంతో రెండోకారు పంట వేయలేదు. డెల్టా ప్రాంతమైన సుమారు 2.34 లక్షల ఎకరాల్లో కేవలం వరి పైరునే రైతులు సాగుచేస్తున్నారు. ప్రత్నామ్నాయ పంటల వైపు దృష్టి సారించడం లేదు.

● అధికారుల విఫలయత్నం

ఇతర పంటలపై రైతులు ఆసక్తి కనపరచేందుకు అధికారులు విఫలయత్నాలు చేశారు. శాస్త్రవేత్తలను తీసుకొచ్చి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కానీ ఆ చర్యలు ఫలితాన్నివ్వలేదు. కష్టపడిన రైతుకు గిట్టుబాటు ధర లభిస్తే ఎవరి సిఫారసు లేకుండా పంటలు పండించేందుకు స్వతహాగా సిద్ధపడతాడు. రెండో పంట లేని కాలంలో ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితోనో లేక నీటితో అవసరం లేకుండానో రెండు నెలల కాలం పంటలను వేసుకొని రైతులు పంటలు పండించుకుంటారు. అయితే ప్రస్తుతం ఈ పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

● వాణిజ్య పంటలకు అవకాశం

డెల్టాలో సారవంతమైన భూములు ఉన్నాయి. వివిధ వాణిజ్య పంటలు వేసేందుకు అవకాశం ఉన్నా రైతులు ఆదిశగా ముందుకు రావడం లేదు. గతంలో జలాశయాల్లో సాగునీరు పుష్కలంగా ఉంది. కానీ సాగు వ్యయం అధికమవడంతో రైతులు భరించలేని పరిస్థితుల్లో ఉండిపోయారు. కానీ వాణిజ్య పంటలు పండించిన రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో జలాశయాల్లో సాగునీరు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు వేసుకుంటే కొంతమేర రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరు.

● ఎంఎస్‌పి నిర్ధారణపై మీనమేషాలు

రైతులు పండించిన ధాన్యానికి ఒక నిర్దిష్ట ధరను ప్రభుత్వం నిర్ణయించి రైతులను నష్టపోకుండా చేసే ప్రక్రియను ఎంఎస్‌పీ (మినిమమ్ సెల్లింగ్ ప్రైస్) అంటారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని చేపట్టడం లేదు. ఈ విధానాన్ని పకడ్బందీగా చేపడితే రైతులు రారాజులవ్వడం ఖాయం.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన లేదు

డెల్టా ప్రాంతం రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన లేదు. మా ప్రాంతంలో ఎలాంటి పంటలు వేసుకోవాలో తెలియక ఆ వైపు ఆలోచించలేకున్నాం. అవగాహనా లోపంతో పంటలు వేస్తే నష్టాలు చేకూరితే తట్టుకోవడం కష్టం. అందుకే ఆ దిశగా ధైర్యం చేయలేకున్నాం. అధికారులు అవగాహన కల్పిస్తే బావుంటుంది.



\- జరుగుమల్లి చిరంజీవి, రైతు, అల్లూరు

వరిసాగే ఆధారం

డెల్టా రైతులమైన మేము కేవలం వరిసాగుపైనే ఆధారపడుతున్నాం. ఏడాదిలో ఒక్క పంటకే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు వేయమని అధికారులు అంటున్నారేతప్ప పండించిన ధాన్యానికి గిట్టుబాటును కల్పించలేకపోతున్నారు. వారు ఈ విధంగా ఉంటే ప్రత్యామ్నాయ పంటలు ఎలా వేయగలం.



\- తోట శ్రీహరి, గ్రద్దగుంట, అల్లూరు మండలం

మంచినీటి ఇబ్బందులు రానీయొద్దు!

- పరీక్షలు నిర్వహించి నాణ్యమైన నీటిని అందించాలి
- సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (జడ్పీ), మే 20 : వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వేసవిలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉంటూ అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీలలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు. నీటి నాణ్యతను కూడా పరీక్షించి, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని, తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని, గ్రామాల్లో పని చేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. అందుకనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ వెంకట్రావు, ఇరిగేషన్, తెలుగుగంగ ప్రజెక్టు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కృష్ణమోహన్, రమణారెడ్డి, ఎస్‌కే మర్దన్ అలీ, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

దేవతలారా రారండి!

- పెంచలకోనలో వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై నృసింహుడి వైభోగం



దేవేరులతో కలిసి శేషవాహనంపై విహరిస్తున్న పెంచల స్వామి



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు (డక్కిలి), మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగుర వేసి సకల దేవతులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కోడిముద్ద ప్రసాదం కోసం మహిళా భక్తులు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనాలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరిన స్వామివారు కోనవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు స్వామిఅమ్మవార్లకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, 11.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ జరగనుంది.



హనుమపై శ్రీహరి విహారం

నెల్లూరు రూరల్, మే 20 : వేదగిరిపై జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీనరసింహుడు హనుమంతుడిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్లను అలంకరణ మండపానికి తీసుకొచ్చిన అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు చప్పర ఉత్సవాన్ని నిర్వహించిన అర్చకులు, ఆపై గిరిప్రదక్షిణ చేపట్టారు. ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకుడు భాస్కరచార్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో రేపు సంబరం

- 8, 9 స్నాతకోత్సవాలు ఒకేసారి నిర్వహణ
- పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

వెంకటాచలం, మే 20 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) 8, 9వ స్నాతకోత్సవాలు ఈ నెల 22వ తేదీన నెల్లూరు శివార్లలోని ఆ వర్సిటీలో జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎస్‌యూ ఉపకులపతి జీఎం సుందరవల్లి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. గతేడాది వర్సిటీలో సిబ్బంది అంతా కలిసి వర్సిటీకి న్యాక్ గ్రేడ్ సాధించడంలో నిమగ్నమైనందున స్నాతకోత్సవం నిర్వహించలేదన్నారు. న్యాక్‌లో ఏ గ్రేడ్ రావడం శుభపరిణామమని, ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా రెండు స్నాతకోత్సవాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జీ సతీష్‌రెడ్డి కూడా హాజరుకానున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని అపోలో హస్పిటల్‌లో వైద్యసేవలు అందించే ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు ఈసీ వినయ్ కుమార్‌కి గౌరవ డాక్టరేట్ అందిస్తున్నామన్నారు. స్నాతకోత్సవ వేదిక వద్ద ప్రత్యక్షంగా 275 మంది డిగ్రీలు (పీహెచ్‌డీలు 19, పీజీ డిగ్రీలు 236, బంగారు పతకాలు 20) అందుకోనున్నారని తెలిపారు. పరోక్షంగా పోస్టు ద్వారా 3361 మంది డిగ్రీలు (పీహెచ్‌డీలు 2, యూజీ డిగ్రీ 3162, పీజీ డిగ్రీ 196) అందుకోనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు, కావలి వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీహెచ్ విజయ, టీ వీరారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారిని ఆర్ మధుమతి తదితరులున్నారు.

కాగా, స్నాతకోత్సవానికి గవర్నర్ రానుండటంతో ఏర్పాట్లపై కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



గవర్నర్ పర్యటనపై కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న వీసీ

నేటి రాత్రి గవర్నర్ రాక!

నెల్లూరు (వ్యవసాయం) : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు గుంటూరు నుంచి రైలులో బయలుదేరి రాత్రి 9.24 గంటలకు నెల్లూరుకు చేరుకుని ఓ హోటల్‌లో బస చేస్తారు. బుధవారం ఉదయం 11.30 నుంచి 12.55 గంటల వరకు వీఎస్‌యూ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు నెల్లూరు నుంచి రైలులో విజయవాడకు బయలుదేరి వెళతారు.

'స్వచ్ఛత' లక్ష్యానికి తూట్లు!

- తుప్పు పడుతున్న బ్యాటరీ ఆటోలు, రిక్షాలు, రీ సైక్లింగ్ యంత్రాలు
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- రూ. లక్షల ప్రజాధనం దుర్వినియోగం


ఉదయగిరిలో తుప్పుపట్టిన బ్యాటరీ ఆటోలు

ఉదయగిరి, మే 20: గత టీడీపీ ప్రభుత్వహయాంలో స్వచ్ఛ భారత్ పేరుతో అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసి, చెత్త తరలింపునకు బ్యాటరీ ఆటోలు, రిక్షాలు, రీసైక్లింగ్ యంత్రాలను మంజూరు చేసింది. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యతలను గ్రామ సర్పంచ్‌లకు అప్పగించింది. నిర్వహణకు నిధులు మంజూరు చేసేది. ఇలా ఉదయగిరి మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో లక్షలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే చెత్తను కేంద్రాలకు తరలించేందుకు బ్యాటరీ ఆటోలు, రిక్షాలు లక్షల నిధులు వెచ్చించి పంచాయతీలకు అప్పగించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆర్థిక భరోసా వస్తుందనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే నేడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇవి వినియోగంలో లేక శిథిలావస్థకు చేరాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ హరిత రాయబారులు చెత్తను రిక్షాలతోనే సేకరిస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు పూర్తిగా నిరుపయోగంగా మారడంతో చెత్తను రోడ్ల వెంబడి పడేస్తున్నారు. ఆటోలను మరమ్మతులు చేయించి గ్రామ పంచాయతీలకు అప్పగించి వినియోగంలోకి తీసుకొస్తే పథకం లక్ష్యం నెరవేరుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చెదలు పట్టిన రీసైక్లింగ్ యంత్రాలు

నేడు దుత్తలూరు మండల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 20: స్థానిక సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం


వింజమూరులో కేక్ కట్ చేస్తున్న జూ.ఎన్టీఆర్ అభిమానులు

వింజమూరు, మే 20: పట్టణంలోని వాసు సెల్పన్ ప్లాజా వద్ద నందమూరి తారకరామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని నీలం బాసు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కోసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం స్థానికులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా నీలం వాసు మాట్లాడుతూ మా అభిమాన నాయకుడి జన్మదిన వేడుకలను అభిమానుల సహకారంతో జరుపుకోవడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు బ్రహ్మయ్య, రాకేష్, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మహేష్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, కాకర్ల గెలుపు తథ్యం

సీతారామపురం, మే 20: ఈ మారు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం విజయం సాధించడం ఖాయమని మండల సీనియర్ నాయకులు తమ్మిశెట్టి రమణయ్య, కిష్ట సుబ్బరాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్క పేదవాడికి లబ్ధి చేకూరుతుందన్నారు. 4వ తేదీ వచ్చే పోలింగ్ ఫలితాల్లో తెలుగుదేశం 126 స్థానాల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అవుతారని జోస్యం చెప్పారు. అలాగే నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే వారిని గెలిపిస్తాయన్నారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మే 20: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో రహమతుల్‌లిల్ ఆలమీన్ ట్రస్టు, చిన్న మసీదు ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 80 చిన్నారులకు ఖత్నా చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఏ వహిద్, దస్తగిరి అహ్మద్, యస్దాన్, ఉమాయిన్, జాఫర్‌మొహిద్దీన్, చిన్న మసీదు ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


ఉదయగిరిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉదయగిరి రూరల్, మే 20: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్, సినిమాహాలు వీధి, హరిజనపాళెం ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాలు, ఘర్షణలకు దిగరాదన్నారు. అనంతరం ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణపై అవగాహన కల్పించారు.

మద్యం దుకాణాల వేళలు మార్పు

ఉదయగిరి రూరల్, మే 20: ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ సమయాలను మార్పు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ పీర్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ఉదయం 11నుంచి రాత్రి 9గంటలకు నడుస్తున్నట్లు చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11నుంచి రాత్రి 8గంటల వరకే కొనసాగుతాయన్నారు.

వైభవంగా హనుమంత సేవ

సీతారామపురం, మే 20: పండ్రంగి సమీపంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి హనుమంత సేవ, ధ్వజారోహణం సోమవారం రాత్రి కనుల పండువగా సాగింది. పరమటి వీధి నుంచి కోటవీధి మీదుగా జెండాను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు.


జెండాను ఊరేగిస్తున్న భక్తులు

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ


మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ

ఉదయగిరి, మే 20: మండల రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నట్లు సోమవారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ తెలిపారు. పది కేజీల జీలుగలు, జనుములు రూ.440లు చెల్లించి రైతుభరోసా కేంద్రాల్లో పొందవచ్చు అన్నారు. ఎకరాకు ఒక సంచి పచ్చిరొట్ట ఎరువులు తీసుకోవాలని, ప్రతి రైతుకు ఐదెకరాల వరకు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మకూరు: వాశిలి, వెంకట్రావుపల్లి రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు దేవసేనమ్మ మాట్లాడారు. భూసార పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ, జీవ ఎరువుల వాడకం పెంచుకోవాలన్నారు. వివిధ పంటల్లో విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడకుండా పశువుల ఎరువు, అజోస్పైరిల్లింగ్ వాడడంతో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మర్రిపాడు: పీఎం ప్రాణం పథకంపై సోమవారం భీమవరంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార సంరక్షణకు రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు వేసుకొని భూసారం పెంచుకోవాలని తెలిపారు. పచ్చి రొట్టె ఎరువులు కావాల్సిన రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్టర్ చేసుకొని పొందాలన్నారు. జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పెంచలయ్య, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డీఈవో గోపాల్


డిప్యూటీ డీఈవో గోపాల్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, మే 20: ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇన్‌చార్జ్ డిప్యూ డీఈవోగా ఉన్న రఘురామయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపాల్ ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామవాసి. ఆయన నెల్లూరు విద్యాశాఖ కార్యాలయంలో సూపరిండెండెంట్‌గా పనిచేస్తూ నంద్యాల జిల్లా ఏడీగా పదోన్నతిపై వెళ్లారు. అక్కడ నుంచి ఆత్మకూరుకు మొదటి ఉపవిద్యాశాధికారిగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆత్మకూరు డివిజన్‌లో విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈవో నజీర్‌బాష, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సన్మానించి అభినందలు తెలిపారు.

సాగరంలో తీరని ట్రాఫిక్ సమస్య


రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉంచిన వాహనాలు

అనంతసాగరం, మే 20: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార సముదాయాలు, వైన్‌షాపు వద్ద సాయంత్రం పూటరద్దీ నెలకొంటుంది. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. దీంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకుంటుంది. అసలే రోడ్డు మీదకు ఆక్రమణలు చొచ్చుకొని వచ్చి వుండగా దానికి తోడు వాహనాలు అడ్డగోలుగా పెడుతుండడంతో అసౌకర్యం కలిగిస్తుందని వాపోతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి వృథా పట్టదా..?


ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయ సమీపంలో లీకేజీతో వృథాగా పోతున్న నీరు

ఉదయగిరి రూరల్, మే 20: పట్టణంలో తాగునీటిని సరఫరా చేసే పైపులు ధ్వంసం కావడం, కొళాయిలకు డమ్మీలు లేకపోవడం, వాల్వులు, సింథటిక్ ట్యాంకుల వద్ద లీకేజీలు ఉండటంతో నీరంతా వృథా అవుతోంది. ఈ సమస్యతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ప్రధానంగా మెయిన్‌బజార్, అగ్రహారం, నాగులబావి వీధి, కోళ్ల వీధి, చిన్నమసీదు, అటవీశాఖ కార్యాలయం, యాదవపాళెం, వాయుగండ్లవారి వీధి తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. గత కొంతకాలంగా ఉన్నా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి నీటిని వృథాను అరికట్టేం దుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేతిబోర్లు, వాటర్‌ప్లాంట్ వద్ద నీరు వృథా..!

ఆత్మకూరు: నియోజకవర్గ పరిధిలో 17,917 చేతిపంపులున్నాయి. ఆత్మకూరు మండలంలో 256 బోర్లు, ఏఎస్‌పేటలో 456, అనంతసాగరంలో 548, మర్రిపాడులో 725, చేజర్లలో 466, సంగం మండలంలో 224 బోర్లు ఉన్నాయి. వీటితో ప్రజలు తాగునీరు, ఇతర అవసరాలను తీర్చుకుంటున్నారు. చేతిపంపు కొట్టేటప్పుడు బిందెలు నిండిన ప్రతిసారీ కొంతనీరు వృథా అవుతుంది. ఆ నీరు మురుగు కాలువల్లోకి లేక వృథాగా బోరు చుట్టూ చేరుతుంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ప్రతిబోరు ద్వారా ఒకరోజుకు 30లీటర్ల నీరు వృథా అవుతోంది. ఈ లెక్కన నియోజకవర్గం మొత్తం మీద ప్రతిరోజు 1.5లక్షల లీటర్ల నీరు వృథాగా పోతుంది. ఇందులో భూగర్భంలోకి ఇంకేది 20శాతం కంటే తక్కువే. మిగిలిన నీరంతా వృథా అవుతుంది. అలాగే ప్రతి చేతిపంపు వద్ద ఇంకుడుగుంతను ఏర్పాటు చేయగలిగితే వృథా అవుతున్న నీటిని భూగర్భంలోకి పంపవచ్చు. ఇలా చేస్తే భూగర్భజలాలు పుష్కలంగా పెరిగే అవకాశం ఉంది. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ల వద్ద ప్రతిరోజూ ఫిల్టర్ అయిన నీరు వృథాగా పోతుంది. జిల్లా మొత్తం ఉన్న వాటర్‌ప్లాంట్లతో ప్రతిరోజూ వృథా అయ్యే నీరు ఓ అంచనా ప్రకారం 5 లక్షల లీటర్లకు పైగా ఉండవచ్చు. ప్రతి వాటర్‌ప్లాంట్ వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడంతో వృథా నీటిని భూగర్భంలోకి పంపి నీటి వనరులను పెంచుకోవచ్చు. ప్రతి ఇంట్లో ఓ ఇంకుడుగుంత, ప్రతి పొలంలో ఓ పారంపాండ్ లాగే ప్రతి చేతిపంపు, ప్రతి మినరల్‌వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసేలా అధికారులు, పాలకులు చొరవ చూపాల్సిన ఎంతైనా ఉంది.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కందుకూరులో కొనుగోళ్ల సందడి !

- హోమ్‌నీడ్స్, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు కళకళ
- గృహోకరణాల కొనుగోలుకు జనం క్యూ


ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో కొనుగోలుదారుల సందడి

కందుకూరు, మే 20: ఎన్నికల హడావిడి ముగిసి వారమైంది. కందుకూరులో గృహోకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్ల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. రెండునెలలుగా ఎన్నికల సందడితో రాజకీయ పార్టీల కార్యాలయాలు, రచ్చబండల వద్ద కనిపించిన జనం ఎన్నికలు ముగిసిన నాటి నుంచి వివిధ దుకాణాల్లో కనిపిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే కొనుగోళ్ల పెరగటం వెనుక బలమైన కారణం ఉంది. ఎన్నికల సందర్భంగా ఇరుపార్టీల నేతలు విచ్చలవిడిగా నగదు పంచటమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు సుమారు రూ. 80 కోట్లపైగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. ఇరుపార్టీలు కూడా గ్రామీణ ప్రాంతంలో ఓటుకు రూ. 2వేలు, కందుకూరులో ఓటుకు 3వేలు వంతున ఇచ్చారు. దీంతో ఒక ఇంట్లో 10 ఓట్లు ఉంటే వారు ఒకరి వద్దే డబ్బు తీసుకుంటే రూ. 20వేలు, ఇద్దరి వద్ద చేయి చాపితే రూ. 40 వేలు ఆయాచితంగా వచ్చేశాయి. మధ్యతరగతి, నిరుపేద కుటుంబాల్లో ఐదారు ఓట్లు ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో ఒక్కో కుటుంబానికి రూ. 20 నుంచి పాతికవేలు వచ్చేశాయి. హీనంగా వేసుకున్నా చిన్న కుటుంబానికి కూడా పదివేలుకు తక్కువ కాకుండా ముట్టాయి. ఒక్కసారిగా వేలల్లో డబ్బు రావటంతో ఏదైనా వస్తువు కొనుక్కుంటే బాగుంటుందన్న ఆలోచనతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆయా దుకాణాలకు క్యూ కడుతున్నారు. వేసవి కావటంతో ఏసీలు, కూలర్లు,ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు లాంటి గృహోపకరణాలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు 5జీ సెల్‌ఫోన్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇంట్లోకి అవసరమైన కుర్చీలు, సోఫాలు, డైనింగ్ టేబుళ్లను మరికొందరు కొనుగోలు చేస్తున్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు : ఏవో


కందుకూరు : మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రాము

కందుకూరు, మే 20: భూసార రక్షణకోసం రైతులు విస్తారంగా పచ్చిరొట్ట పైర్లు సాగుచేయాలని, రైతులకు 50 శాతం సబ్సిడీపై అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వీ. రాము తెలిపారు. పీఎం-ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాచవరం, మోపాడు గ్రామాల్లో సోమవారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి భూమిలో కలియదున్నటం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రేనీ రేచల్, ఈ రమణయ్య పాల్గొన్నారు.

- నేటి నుంచి పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై అవగాహన

లింగసముద్రం : మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో పీఎం - ప్రణామ్ పథకం కింద మంగళవారం నుంచి ఈనెల 28వతేదీ వరకు పచ్చిరొట్ట ఎరువులు వాడకం పెంపు, భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహం లింకన్ సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కాగా మండలానికి 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు మంజూరయ్యాయని వివరించారు.

- పచ్చిరొట్టె విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వలేటివారిపాలెం : ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్టె విత్తనాలకు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హేమంత్ భరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డ్, మొబైల్ నెంబర్‌తో ఆర్‌బీకేలో సంప్రదించాలన్నారు.

ఘనంగా జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు


గుడ్లూరు : కేక్ కట్ చేస్తున్న జూ. ఎన్టీఆర్ అభిమానులు

గుడ్లూరు, మే 20 : సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం గుడ్లూరులో ఆయన అభిమానులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచారు. ఈ కార్యక్రమంలో జూ.ఎన్టీఆర్ అభిమానులు పారా అశోక్, కాపులూరి మధు, కర్పూరపు అజయ్‌కుమార్, వినోద్, చిత్తారి మల్లికార్జున, పాల్గొన్నారు.

కందుకూరు : సినీహీరో జూ. ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం కందుకూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు భోజనం ఏర్పాటుచేయటంతోపాటు వారికి నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో జూ. ఎన్టీఆర్ అభిమాన యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

కావలి రూరల్, మే20: పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకట రమణ పేర్కొన్నారు. పట్టణంలోని వడ్డిపాలెంలో ఒకటవ పట్టణ సీఐ రాజేష్, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో ఇళ్లు, దుకాణాల్లో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకు కార్డన్ సెర్చ్ సర్చి నిర్వహించామన్నారు. ఇస్లాంపేట ప్రజలు ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా తగు సూచనలిచ్చి సోదాలు చేశామన్నారు.

కలిగిరి : గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుడ్లదొనలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలు విడుదలయ్యేంతవరకు గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు పర్యటించినా, కవ్వింపు చర్యలకు, కక్షసాధింపు చర్యలకు దిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు

ఉలవపాడు : కందుకూరు సబ్ డివిజనల్ పరిధిలో ఈనెల 31 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారని ఎస్సై బాజీరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఎవరైనా వ్యక్తులు, వ్యవస్థలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ సభలు, సమావేశాలు ర్యాలీలు జరుపుకోవాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

కావలి రూరల్, మే20: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ప్రశ్నపత్రాలు నెల్లూరు డీఈవో కార్యాలయం నుంచి సోమవారం కావలికి రాగా, వాటిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య తెలిపారు.ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

వలేటివారిపాలెం, మే 20: మండలంలోని రోళ్లపాడు గ్రామ శివార్లలోని పొలాల్లో పేకాట శిబిరంపై గుడ్లూరు సీఐ వీ. సుబ్బారావు తమ సిబ్బందితో సోమవారం దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ 73,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పేకాటరాయుళ్లను కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

పేదలకు బిర్యానీ పొట్లాల పంపిణీ

కావలిటౌన్, మే20: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర మనవడు, ఎన్ఆర్ఐ మన్నవ అద్వైత్ చౌదరి జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కూడలిలో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, మాజీ కౌన్సిలర్లు కుందుర్తి కిరణ్, బిట్రగుంట శివ, టీడీపీ నేతలు కావేటి కోటయ్య, పల్లపు కుమార్, సుకుమార్, ఉప్పాల శ్రీను తలమంచి రవి తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన లంకెనపల్లి వీరాచారి, రావమ్మ దంపతులు రూ. 10,116లను సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయ పూజారి మాధవశర్మకు ఈ మొత్తాన్ని వారు అందించారు.

కుటుంబ వివాదంలో పోలీసుల జోక్యం

కావలి, మే20: తమ కుటుంబ వివాదంలో కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు జోక్యం చేసకుని తనను వేధిస్తున్నాడని కావలి రూరల్ మండలం రామచంద్రపురానికి చెందిన కోసూరి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. తన తండ్రి కోసూరు శేషయ్య కొద్ది రోజుల క్రితం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాలపై పడి చనిపోయారన్నారు. డెత్ సర్టిఫికెట్ తన దగ్గర ఉండటంతో దాని కోసం తన తల్లి బాలమ్మ,సోదరులు పోలీసుల ద్వారా వేధిస్తున్నారన్నారు. తనకు తెలయకుండా ఇప్పటికే రెండు ఎకరాల భూమి అమ్మివేశారని చెప్పారు. తన తండ్రిపేరుపై ఉన్న ఆస్తి కోసం డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి చేస్తూ అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. కుటుంబ ఆస్తుల విషయంలో పోలీసుల జోక్యమేమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు.

బంకులు, తోపుడుబండ్ల పంపిణీ

కందుకూరు : నిరుపేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మలినేని చారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం బంకులు, తోపుడుబండ్లను పంపిణీచేశారు. ట్రస్టు ఛైర్మన్ మలినేని లక్ష్మయ్య చేతుల మీదుగా కందుకూరుకి చెందిన ఇద్దరు నిరుపేద మహిళలకు రెండు బంకులు, మరో ఇద్దరు నిరుపేదలకు తోపుడుబండ్లు అందజేశారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

కందుకూరు, మే 20: పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు చేతిరాతపై పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు టీ. నాగరజని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాలలోని కొన్ని పేరాలను చూచిరాత రాయించటం ద్వారా ఈ పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు సందర్భంగా జూన్ 7న అత్యుత్తమ చేతిరాతను ప్రదర్శించిన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వేసవి శిక్షణ శిబిరం సభ్యులు సీ. సుబ్బారావు, ఏవీఆర్ మూర్తి, జి. జయపాల్, సీ. రోశయ్య, సిహెచ్ సుబ్బారావు, ఎస్కే. బాషా, టి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలివ్వాలని స్కూల్ స్వీపర్ల వినతి


స్వీపర్లతో కలిసి ఎంఈవోతో మాట్లాడుతున్న పెంచలయ్య

కావలిటౌన్, మే20: నాలుగు నెలల పెండింగ్ జీతాలివ్వండి సార్... అంటూ ఎంఈవో గోవిందయ్యకు స్కూల్ స్వీపర్లు మొర పెట్టుకున్నారు. సోమవారం సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్యతో కలిసి వారు ఎంఈవోను కలిసి వినతిపత్రం అందించారు. పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే 26మంది స్వీపర్లు ప్రతినెలా జీతాలందితేనే కుటుంబాలు గడవడం కష్టంగా ఉంటుందని, నాలుగు నెలలనుంచి జీతాలివ్వకపోతే ఎలా బతకాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వీపర్ల జీతాలు పెంచి సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్ల యూనియర్ బాధ్యులు ఆదిలక్ష్మీ, పద్మ, సైదమ్మ, వై రామయ్య, శివ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి సుధాకర్‌ను సస్పెండ్ చేయాలి

కావలి, మే20: జనసేన కావలి ఇన్‌చార్జిగా ఉన్న అళహరి సుధాకర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జనసేన నాయకులు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి విఠల్, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్‌లు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలలో కావ్య క్రిష్ణారెడ్డి గెలుపుకోసం సుధాకర్ సహకరించలేదన్నారు. ప్రచారంలో పాల్గొనాలని ఆహ్వానం వచ్చినా, అవసరంలేదని జనసైనికులకు చెప్పారన్నారు. వైసీపీ అభ్యర్థితో లాలూచీ పడి ఆయనకు అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. కావున ఆయనపై విచారణ జరిపి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. సమావేశంలో జనసేన నేతలు, జనసైనికులు గాదంశెట్టి రవి, నాని, క్రిష్ణయ్య, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, మహేంద్ర, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు ఓట్ల వినియోగానికి 4 వరకు అవకాశం

కందుకూరు, మే 20: నియోజకవర్గంలో ఉన్న సర్వీసు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు జూన్ 4 ఉదయం 8 గంటల వరకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు. నియోజకవర్గంలో 66 సర్వీసు ఓట్లు ఉండగా, ఇప్పటివరకు 23 ఓట్లు మాత్రమే పోస్టల్ ద్వారా ఎన్నికల అధికారులకు అందాయని, వాటిని సబ్ కలెక్టరు కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో ఇరుపార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరచామన్నారు. మిగిలిన సర్వీసు ఓటర్లు కూడా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని డీటీవో ప్రసాద్ కోరారు.

అధికారుల మెప్పుకోసం పోలీసులు : భయాందోళనలో ప్రజలు

కావలి, మే20: పోలీసుల వ్యవహారశైలిపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉండటంతో ఉన్నతాధికారుల మెప్పు కోసం దిగువస్థాయి పోలీసులు హడావుడి చేస్తున్నారు. దీంతో సామాన్యులు భయభ్రాంతులకు గురౌతున్నారు. కావలిలో కార్డన్‌సెర్చ్ పేరుతో సామాన్యులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇళ్లలో వినియోగించుకునే కత్తులు,కొడవళ్ల తదితరాలను స్వాధీనం చేసుకోవటం, సరైన పత్రాలు లేవని మోటారుసైకిళ్లు, ఆటోలను స్వాధీనం చేసుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రెండు రోజులుగా పట్టణంలో ఇస్లాంపేట, వైకుంఠపురం, తుఫాన్‌నగర్ తదితర ప్రాంతాల్లోని సామాన్యుల ఇళ్లలో తనిఖీలు చేయటంతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. సార్వత్రిక ఎన్నికలవేళ ఎవరి వల్ల గొడవలు జరుగుతాయి...? దాని వెనుక ఉండే వ్యక్తులు ఎవరనే విషయం పోలీసులందరికీ తెలిసినా అలాంటి వారిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోకుండా సామాన్యుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి వారిని భయభ్రాంతులకు చేయటమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.